# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

మార్చి 2021 సంచిక

© Copyright 2020 - Editorial Board Kathamanjari


సుస్వాగతం



ప్లవ నామ సంవత్సర

# ఉగాది హాస్య కథల పోటీ

అలనాడు, ఇలనాడు కూడా హాస్యానికి తెలుగునాట పెద్దపీట వేసారు. తెలుగుభాషలో పదాల అల్లిక నుండి, తెలుగు జీవితాల సరిగమల వరకు హాస్యం నిత్య నూతనంగానే మనకి సాక్ష్యాత్కరిస్తూనే ఉంటుంది. హాస్యం మన జీవితాలలో ఓ భాగమై, నిత్యం కావాలనిపిస్తుంది. కొత్తదనం కోసం ఎదురు చూసేటట్టు హాస్యం మనల్ని నడిపిస్తూనే ఉంటుంది.

అసలు హాస్యం సున్నితంగా మదిని తాకుతుంది. భళ్లున నవ్విస్తుంది. అలాగే హాస్య రచనలను చదువుతుంటే, అసంకల్పితంగా నవ్వు వచ్చేస్తుంది. ఆ కథలో సన్నివేశమో, సంభాషణో జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నవ్వు వస్తూనే ఉంటుంది. అలా హాస్యాన్ని అలరించే కథలను ఈసారి శ్రీ ప్లవ నామ ఉగాదికి కథా మంజరి పాఠకులకు అందించాలనే ఉద్దేశంతో "ఉగాది హాస్య కథల పోటీ" ని నిర్వహిస్తున్నాం.

## బహుమతులు

మొదటి బహుమతి : ₹ 5000/-

రెండవ బహుమతి : ₹ 3000/-

మూడవ బహుమతి: ₹ 2000/-

12 ప్రత్యేక బహుమతులు: ₹ 500/- చొప్పున

నిబంధనలు:

1) కథాంశం తెలుగువారి నేపథ్యంలో ఉండాలి. హాస్యం ముసుగులో అశ్లీలతకి, వివాదాలకు చోటు ఇవ్వకుండా, హాయిగా అందరూ చదువుకునేటట్టు ఉండాలి.
2) హాస్యం హాస్యాస్పదం కాకుండా ఏ వర్గాలను కించపరచకుండా ఉండాలి.

3) కథ నిడివి 1200 పదాలు మించకుండా ఉండాలి.

4) కథతో పాటు స్వీయ రచన అని, దేనికి అనుసరణ గాని, అనువాదం గాని కాదని, ఏ ఇతర పత్రికలలో పరిశీలనలో లేదని, ఇతర మాధ్యమాలలో ప్రచురితమవలేదని, హామీపత్రం విధిగా జత చేయాలి.

5) కథని word లో Unicode లో టైపు చేసి submit@kathamanjari.in కు ఇమెయిల్ ద్వారా మాత్రమే పంపాలి.

6) కథని పంపే ముందు అక్షర దోషాలు లేవనీ, విరామ చిహ్నాలు సరిగా ఉన్నాయనీ ధృవపరుచుకోండి.

7) ఒక రచయిత(త్రి) ఎన్ని కథలైనా పంప వచ్చును.

8) కథలు మాకు ఇమెయిల్ ద్వారా అందడానికి చివరి తేది. 15.03.2021 రాత్రి 11 గంటలు.

9) పోటీకి వచ్చిన కథల్లో తగిన ప్రమాణంలో బహుమతులు పొందే అర్హత లేని సందర్భంలో, పోటి విషయంలో తగిన నిర్ణయం కథా మంజరి తీసుకొని పత్రికా ముఖంగా తెలియ చేయడం జరుగుతుంది.

10) ఈ పోటీకి సంబంధించి ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరములకు, ఫోన్ ద్వారా గాని, ఇమెయిల్ ద్వారా గాని చేయడానికి తావులేదు.

11) పోటి నిర్వహణ విషయంలో కథా మంజరి కార్యవర్గానిదే తుది నిర్ణయం.

ఈ బహుమతులు పొందిన కథలతో కథా మంజరి ఏప్రిల్ 2021 సంచిక "శ్రీ ప్లవ నామ ఉగాది ప్రత్యేక సంచిక" గా ఏప్రిల్ 13వ తేదిన విడుదలవుతుంది.

ఈ పోటీలో రచయిత(త్రి)లు విరివిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం!

**కథా మంజరి బృందం**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | పేజీ సంఖ్య |
|---|---|---|
| I | మా జట్టు | i |
| II | కృతజ్ఞతలు | ii |
| III | కథా కీయం | iii |
| IV | ఈ నెల విశిష్ట అతిథి | v |
| V | కథా మార్గదర్శి | viii |

**కథలు**


| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1. | చేజార్చుకోకు బంధాన్ని | శశికళా ఓలేటి | 1 |
| 2. | ఆపద్బాంధవులు | డి ఎస్ వి రామశర్మ | 8 |
| 3. | సహానుభూతి | డాక్టర్ ఎమ్ సుగుణరావు | 13 |
| 4. | దిగుడు మెట్లు | ఇరిగినేని హనుమంతరావు | 17 |
| 5. | దే లివ్డు విత్ అవుట్ గాడ్ | రాపాక కామేశ్వర రావు | 26 |
| 6. | తెలుసుకుంటే ఎంత బాగుంటుందీ | పెనుమాక నాగేశ్వర రావు | 31 |
| 7. | లోపం | ఎం బిందుమాధవి | 38 |
| 8. | నన్నూ మీతో వుండనివ్వరూ | వేలూరి ప్రమీలా శర్మ | 45 |
| 9. | నన్ను క్షమించండి | నిష్ఠల సుబ్రహ్మణ్యం | 49 |

| | | | |
|---|---|---|---|
| **10.** | **నాన్నంటే** | **ఏ ఎస్ జగన్నాథ శర్మ** | 53 |


ఈ నెల విశిష్ట అతిధిగా విచ్చేసిన శ్రీమతి సమ్మెట ఉమాదేవి గారికి బాగా నచ్చిన కథ "నాన్నంటే". ఆ కథని ప్రచురించడానికి తమ అంగీకారాన్ని తెలిపిన శ్రీ ఎ. యస్. జగన్నాధ శర్మగారి, అంత మంచి కథ ప్రతిని అందించిన ఉమాదేవి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. ఈ సంచిక పదో కథగా మీ ముందుకు వచ్చింది.


| | | |
|---|---|---|
| VI | వినదగునెవ్వరు చెప్పిన | xi |

# ఇంకా మా జట్టు



## సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

## బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ ‘వసంత’ కృష్ణ

# కృతజ్ఞతలు


## SPONSORS

### ఈ సంచికకు ఆర్థిక సహకారం

## OF THE ISSUE

శ్రీ కోడూర్ సంజయ్ గారు

శ్రీమతి కోడూర్ నీరజ గారు





# "కథా" కీయం



కథలు చదువుతున్నప్పుడు కొన్ని కథల్లోని కొన్ని పాత్రలు మనకి ఎదురుగా ఓ రూపంలో కనబడతాయి. ఎన్ని సంవత్సరాలైనా ఆ పాత్ర వేష,భాషలు మారవు. వయసు మీరినట్టు కనబడవు. అలాంటి అనుభూతి కలగడానికి కారణం.. అవి మనకి నిత్యజీవితాలలో సహజంగా ఎదురయ్యే పాత్రలే. కళ్ళు మూసుకుని ఏ పండు ముక్క రుచి చూసినా, అది ఫలానా పండని ఎలా పోల్చుకుంటామో, కథ చదువుతున్నప్పుడు ఇది ఫలానా రచయిత కథ అని చెప్పగలుగుతున్నామంటే .. ఆ సృష్టికర్తని అభినందించాలి. తాను సృష్టించిన పాత్రలు ఈరోజుకీ అజరామరాలు గా నిలచాయంటే, తన చుట్టూ ఉన్న సమాజంలో తిరుగాడే పాత్రలను సునిశితంగా పరిశీలించి, పాఠకుడికి అక్షర రూపంలో అందించే రచయిత సృజనాత్మకతను వర్ణించడానికి పదాలు లేవనే చెప్పాలి.

"మై డియర్ వెంకటేషం!" అంటూ డైలాగు వినబడిందంటే.. అది కన్యాశుల్కంలోని గిరీశం పాత్ర అని పట్టేస్తాం.

"అదిగో మా నాన్న. మా నాన్నకి నేను కొడుకు. మా నాన్న నాకు గొడుగు. ఇలా అని కొత్త ప్రైవేటు మేష్టరు చెప్పాడు. వీడు మంచివాడు కాదు. అంటే చెడ్డవాడు. అసలు వీడే కాదు....!" ఈ నాలుగు ముక్కలు చదివేసరికే అర్థమైపోతుంది.. అవి బుడుగుగాడి మాటలని!

ఆమె ఫక్తు తెలుగు మహిళ. మల్లెపూలు, తెల్ల చీర అంటే ఇష్టం. మాటకు మాటని ఎదుటివారు నొచ్చుకోకుండా చెప్పగల మాటకారి. ఓ రోజు ఆమె భర్త "మీ చెల్లెలు ఒక కోతి, మీ అక్కయ్య మరొక కోతి, తోకలు మాత్రం లేవు!" అని భర్త ఆట పట్టిస్తే... ఆమె తడుముకోకుండా "మీ చెల్లెళ్లకి ఆ కొరత లేదులెండి!" అంటూ బదులు చెప్పే ఆ మహిళ ఎవరాని అలోచించ వలసిన అవసరం లేకుండానే "ఇంకెవరూ.. కాంతం గారే!" అంటూ ఠక్కున జవాబు వచ్చేస్తుంది.

అలా కథల్లో పాత్రలతోనే చిరంజీవులుగా నిలిచిన తెలుగు కథా రచయితలు చాలా తక్కువ మంది ఉన్నారు. గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కంలో అన్ని పాత్రలు చిరంజీవులే. అలాగే ముళ్ళపూడి వెంకటరమణ గారి బుడుగు, సీగాన పెసూనాంబ, రాధా గోపాళం , అప్పుల అప్పారావు, పక్కింటి పిన్నిగారు.. వంటి వారి పాత్రలు అమృతం పుచ్చుకుని ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. ఇక.. మునిమాణిక్యం నరసింహారావు గారి కథల్లో కాంతం పాత్ర మట్టుకు ఇప్పటికీ ప్రతి తెలుగు లోగిళ్లల్లో నడుస్తున్నట్టే ఉంటుంది.

ఆర్ కే లక్ష్మణ్ గారి ప్రతీ కార్టూనులో 'కామన్ మాన్' ఎక్కడో అక్కడ తారసపడతాడు. ఆర కె నారాయణ్ గారు 'మాల్గుడి' అనే ఓ పట్టణాన్ని ఊహాజనితంగా సృష్టించి అద్భుతమైన కథలు ఆ పట్టణం చూట్టూ రాసారు.

అలా.. కథల్లోని పాత్రలతో పాటు అలాంటి కథల్ని అందించిన రచయితలు చాలా తక్కువ సంఖ్యలోనే ఉన్నారు. వారి కథల్లో అలనాటి సామాజిక పరిస్థితులు, వాతావరణం కనబడతాయి. కాని కాలమాన పరిస్థితులు మారినా, సాంకేతిక విప్లవంతో మనిషి జీవనవిధానం మారినా.. ఆ కథలు ఇప్పటికీ సజీవంగా మనసులను రంజింపచేస్తూనే ఉన్నాయి.

అయితే ఆ తరం తర్వాత అలాంటి పాత్రలు కనబడటం లేదు. మారిన సమాజంలో మనుషులు ఉంటారు, మంచి చెడు ఉంటాయి. వాటిని ఒడిసి పట్టుకుని ముందు తరాలకి అందించే కథాంశాలను రచయితలు ఎంచుకుని కథలు రాయాలి. తమకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకోవాలి.

తెలుగు కథ పుట్టినప్పట్నుంచి, పందొమ్మిది వందల తొంబై వరకు.. ఆ తరాల వారు ఆయా కాలాలకు అనుగుణంగా కథలు రాసారు. ఆ తర్వాతే ... చాలా గ్యాప్ వచ్చేసింది.

ఇప్పటికైనా ఆలస్యం కాలేదు. ఆలోచన చేస్తే.. నేటి కథ రేపు వెలుగునిస్తుంది!! కథతో పాటు నేటి జీవితం రేపటికి మార్గదర్శకం అవుతుంది.

మన ఉనికిని రేపటికి అందించడానికి మన ప్రయత్నం మన చేద్దాం!!

***0***

# విశిష్ట అతిథి



## సమ్మెట ఉమాదేవి

కళ్ల ఎదుట జరుగుతున్న అన్యాయాలకో, అక్రమాలకో స్పందించి ఉవ్వెత్తున లేచి, చప్పబడిపోయే నేటి మానవ సమాజంలో కూడా, ఆయా పరిస్థితుల మీద చలించి, అక్షరరూపంలో నిత్యం సమాజాన్ని జాగృతం చేస్తున్నవాడు 'రచయితే', సందేహం లేదు. అది కవిత అవొచ్చు, కథ అవొచ్చు, నవల అవొచ్చు, వ్యాసమైనా కావొచ్చు.. కాని అది మన కళ్ల ఎదుట నిక్షిప్తమై ఉంటుంది. మనల్ని నిత్యం తట్టి లేపుతూ, ముందుకు నడిపిస్తోంది! అలా కళ్ల ఎదుట కనబడిన నిజజీవితాల్లో చీకట్లను చూసి, చలించి వాటికి అక్షరరూపాలు ఇస్తున్న మన తెలుగు రచయిత్రులలో అగ్రస్థానంలో చెప్పుకోదగ్గ రచయిత్రి శ్రీమతి సమ్మెట ఉమాదేవి గారు. మొన్నటి తరంలో తెలుగునాట మహిళా రచయిత్రులు సంఖ్యాపరంగా తక్కువే. నేటి తరంలో ఆ పరిస్థితి లేదు, ఎక్కువగానే ఉన్నారు. ఆ రచయిత్రులలో... సృజనాత్మక సాహిత్య ప్రక్రియలలో కథారచన క్లిష్టమైనదైనా .. స్పందించే హృదయం ఉన్నప్పుడు 'కథకేం భాగ్యం.. కావ్యాలనే సృష్టించగలం!' అంటూ మన తెలుగునాట, ఆధునిక కథాసాహిత్యంలో ఉత్తమమైన కథలను అందించిన విశిష్ట రచయిత్రి శ్రీమతి ఉమాదేవి గారు. తన కథల పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి రాస్తారు. వాస్తవ స్థితిగతులకు చలించి కలం ఝుళిపిస్తారు. ఆమె కథనం.. తడారని గుండెల్లోంచి కళ్లెదుట దృశ్యంగా సాక్షాత్కరిస్తుంది.

ఇంట్లో మాతామహులనుంచి పుస్తకం, సాహిత్యం చోటు చేసుకున్న వాతావరణంలో పెరగడం ఒక వరమైతే, తాను జీవనం సాగించిన పల్లెల్లో ప్రజల జీవన స్థితిగతులను ప్రత్యక్షంగా వీక్షించడం.. అక్షర యజ్ఞానికి దారితీసింది. "పుస్తకాలను చదవడం, సమాజాన్ని దగ్గర్నుంచి గమనించడం, ఆ జనం మధ్య గడపడం,

వారితో కలిసి మెలిసి తిరగడం, ఆ పరిస్థితులను పరిశీలించడం... ఇవండి నా కథలకి ప్రేరణ. అనుకోకుండా ఆ ప్రేరణతో చాలా కథల్లో అమ్మ పాత్ర ప్రధానంగా వచ్చింది. అలా అమ్మ పాత్ర కథా వస్తువుగా వచ్చిన కథలతోనే 'అమ్మ కథలు' సంపుట వెలువరించాను!" అంటూ ఉమాదేవి గారు తన రచనా ప్రస్థానం గురించి చెపుతారు.

పుట్టింది కృష్ణాజిల్లాలోనైనా, పెరిగి ఎదిగినది ఖమ్మంలోనే. ఎమ్.ఎ. బి.యిడి. చదివి, ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేసిన పల్లెల్లో అక్కడ వారి జీవన స్థితిగతులనూ, పేదరికాన్నీ, సంస్కృతి సాంప్రదాయాలనూ అతి దగ్గరగా గమనించి, ఓ బాధ్యతతో గిరిజన వాసుల జీవితాల మీద కథలు రాసారు. అవే "రేలాపూలు". సహజమైన శైలితో, ఆ తండావాసుల సొదల్ని, జీవితాల్ని ప్రపంచానికి తెలియజేయాలనే తపన ఉమాదేవి గారి కథల్లో కొట్టొచ్చినట్టు కనబడుతుంది. అందులో తెలంగాణా మాండలికంలో కథను అద్భుతంగా అందించడంలో ఆమె కృషితో పాటు ఆవేదన పాఠకుల్ని కుదిపేస్తుంది. "అలా అనీ ఓ మూసలో కథలే రాయలేదు. హాస్యకథలు, చిన్నపిల్లల కథలు, మానవ నైజం మీద కథలు.. అలా అన్నింటి మీద కథలు రాసాను. అయితే ఎక్కువగా గిరిజన కథలు రాయడానికి మనసు లాగుతుంది. ఆ మాండలిక కథలు రాసినందుకు చాలా సంతృప్తి కలుగుతుంది!" అంటూ ఆనందంగా అంటారు. ముందులో "అమ్మ కథల ఉమాదేవి" గా గుర్తింపు వచ్చినా, తర్వాత "రేలాపూలు ఉమాదేవి" గా గుర్తింపు వచ్చింది. గిరిజన గ్రామాల్లో ఉన్న పరిస్థితుల మీద రాసిన కథల సంకలనమే "రేలాపూలు". ఆ పుస్తకం చదివి అనేకమంది, గిరిజన తండాల్లో ఉన్న పేద పిల్లలకి సహాయం అందించారు. ఇంతకన్నా ఈ రచయిత్రికి ఏం కావాలి!

'సాహిత్యంలో కథ చాలా శక్తివంతమైన సాధనం. అది మనిషిలో సామాజిక మార్పులకు ఉపయోగపడుతుంది. పుస్తకాలు చదివేవారి ప్రవర్తన వేరుగా ఉంటుంది. నడవడిక హుందాగా ఉంటుంది. అందుకే సామాజిక దృక్పథం లేనివారు రచనలు చేయకూడదనేది నా అభిప్రాయం' అని నిక్కచ్చిగా చెప్తారు ఉమాదేవి గారు.

ఉమాదేవి గారి కథలు గురించి మాట్లాడుతూ ప్రఖ్యాత సాహితీవేత్త శ్రీ ఎన్. గోపిగారు "మట్టి వాసనలు, బడుగు జీవితాలు తెలిసిన అనుభవ సంపన్నురాలువమ్మా! నీ దగ్గర కథా వస్తువులకు కొదవ లేదు. నీవు మాత్రమే రాయగలిగిన కథలను వదలకుండా రాయి!" అన్నారు. ఇంత కంటే మరో అవార్డు అక్కర్లేదు. పాఠకుల మనసుల్లో స్థానమే గొప్పదని భావించే ఉమాదేవి గారు బాలికల విద్యాభివృద్ధి అధికారిగా డిప్యుటేషన్ మీద ఖమ్మం జిల్లాలోని అటవీ గ్రామాలలో తిరిగారు. ఎన్నో అనుభవాలు, ఎన్నో జీవితాలను ప్రత్యక్షంగా చూసి, చలించి కథలు రాయడానికి శ్రీకారం చుట్టారు. పదహారేళ్ళ పాటు ఉద్యోగ బాధ్యతలతో రైలు ప్రయాణాలు చేసిన అనుభవంతో రైలు కథలు వ్రాసారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు కనుక, పిల్లలతో

ఉన్న అనుబంధంతో బాలసాహిత్యంలో నాలుగు పుస్తకాలు వ్రాసారు. నూట పాతిక పైగా కథలు వ్రాసిన ఉమాదేవి గారివి ఆరు సంపుటాలు కూడా వెలువడ్డాయి. పాతిక కథలకు వివిధ రకాలైన బహుమతులు వచ్చాయి.

ముగ్గురమ్మాయిలు.. ఇద్దరికి వివాహాలు జరిగి హైదరాబాదులో సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇంకా చదువుకుంటున్న ఆఖరమ్మాయితో ఉమాదేవి గారి ప్రస్తుత నివాసం ఖమ్మంలోనే!!

"నీది కాని జీవితాల్లోకి వెళ్లి వారితో మమేకమై రాసిన నీ కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావాల్సిన అర్హత ఉన్నది!" అంటూ కితాబు ఇచ్చిన ప్రముఖ సినీ రచయిత శ్రీ భువనచంద్ర గారి మాటలు యదార్థమవలాని కోరుకుంటూ... ఈ నెల విశిష్ట అతిధిగా విచ్చేసి, కథల ఎంపికలో పూర్తిగా న్యాయం చేకూర్చిన శ్రీమతి సమ్మెట ఉమాదేవి గారికి  కృతజ్ఞతలు తెలుపుకుంటూ...

**"కథా మంజరి" బృందం**

***O***

# కథా మార్గదర్శి



## శ్రీ అయ్యలసోమయాజుల
# నీలకంఠేశ్వర జగన్నాథశర్మ

కథ చదివినప్పుడు మనసుని కుదిపేసే కథాంశంతో పాటు, కథనం పాఠకుల్ని అనుభూతుల్లోకి తీసుకెళ్లే కథలంటే నాకు చాలా ఇష్టం. చదివే పాఠకుడ్ని మంచి ఆలోచనల్లోకి, మధురమైన జ్ఞాపకాలలోకి తీసుకువెళ్లగలిగేలా కథ వ్రాయాలనే నేను ప్రయత్నం చేస్తుంటాను. అలా వ్రాసే క్రిందటి తరం కథకుల్లో శ్రీ జగన్నాథ శర్మ గారి కథలంటే నాకు చాలా ఇష్టం. ఆయన కథల్లో 'నాన్నంటే' కథ అంటే మరీ ఇష్టం.

"కంఠు" అనే కలం పేరుతో సాహిత్య రంగంలో అడుగుపెట్టిన శ్రీ అయ్యలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథశర్మ గారి పేరు వినని తెలుగు పాఠకులు ఉండరు. మానవీయ కోణం వారి కలం. సహజ వాతావరణం వారి కథనం. గుండెలు పిండే కథాంశాలు వారి ఆయుధాలు. నవ్య వీక్లీ సంపాదకులుగా కూడా సాహితీ అభిమానులందరికీ చిరపరిచితులే. విజయనగరం జిల్లా, పార్వతీపురంలో జన్మించిన శర్మగారు పదిహేనవ ఏటనే కథలు వ్రాయటం ప్రారంభించి, ఇప్పటివరకు ఐదు వందల కథలు, పద్దెనిమిది నవలలు వ్రాశారు. 'నవ్య' పత్రికతో పాటు, ఇతర పత్రికల్లో వివిధ కలం పేర్లతో విస్తృతంగా ఆయన రచనలు చేసి, పాఠకుల మన్ననలు పొందారు. అంతేకాకుండా వీరు సినిమా, టి.వి. రచయితగా కూడ ప్రసిద్ధులే. శర్మగారు.. జగన్నాథ రథచక్రాల్, కథా సరిత్సాగరం, పంచతంత్రం, పాలపిట్ట, నెమలీక, పేదరాసి పెద్దమ్మ

మొదలగు పిల్లల కథలను రాశారు. అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో క్లుప్తత, రమ్యతలను జోడించి శర్మగారు రచించిన మహాభారతం, భాగవతం, రామాయణాలను పాఠకులను ఎంతగానో అలరించాయి. నవ్య వీక్లీలో వీరు రాసిన "మొదటి పేజీ" కి వేలాదిమంది అభిమానులు వున్నారు. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే “కళారత్న” పురస్కారం అందుకున్న శ్రీ జగన్నాధ శర్మగారి రచనలన్నీ ఒక ఎత్తు.. దాదాపు 30 అవార్డులు పొందిన వీరి “పేగు కాలిన వాసన” కథానికల సంపుటి ఒక ఎత్తు. అందులోని కథ ‘నాన్నంటే’ చాలా ప్రత్యేకమయిన కథ. ఇప్పటిదాకా 90 శాతం సృజనకారులంతా తమ రచనలలో యువతీ యువకుల ప్రేమలను, సామాజిక సమస్యలను, విశ్వాధారబంధమైన అమ్మ గురించీ రాసి వుంటారు. కాని, ‘నాన్న’ను కథా వస్తువుగా తీసుకుని వచ్చిన రచనలు తక్కువే. ఈ రచనలో వస్తువుకి రచయిత శైలీ.. ధ్వని ప్రధానంగా సాగుతుంది. మౌనంగా చదువుతుంటే కన్నులు చెమరుస్తాయి. ఇక ఈ కథ వింటుంటే గుండె బరువెక్కిపోతుంటుంది. అంతే కాదు . కథలు ఇంత రిధమిక్ గా రాయవచ్చా అని నివ్వెరపోయి, అందులోని కరుణాత్మకతకు కరిగిపోతాము.

ఈ కథలోని ఒక లయకి ఉదాహరణలు

‘నాన్నంటే’ ఒక కథని అమ్మకు తెలియదు పాపం..
‘నాన్నంటే’ ఒక పురాణమని పిచ్చి తల్లికి తెలియదు..
‘నాన్నంటే’ ఒక పాఠమని తెలుసుకోలేని వెర్రి బాగుల్ది అమ్మ..
‘నాన్నంటే’ ఒక కలని.. అమ్మకి తెలియదు గాక తెలియదు.
‘నాన్నంటే’ ఒక పాటని.. అమ్మ ఊహకందలేదు!
చివరికి కథ ముగింపులో..
‘నాన్నంటే’ దేవుడని అమ్మ గుర్తించలేకపోతోంది.. అని వ్యాఖ్యానిస్తూ పోతున్నపుడు మన గొంతులో దుఃఖం గడ్డకడ్తుంది.
అలాగే..
ఏడవాలనిపించలేదు. ఏడేడు లోకాల్లోనున్న నాన్నని వెతికి పట్టుకోవాలనిపించింది. ఆ మాటంటే - 'పారేసుకున్న వస్తువా ఏం! వెతికితే దొరకడానికి' అని అమ్మ అనవచ్చు.. శోకించవచ్చు. అయితే అమ్మకి ఈ నాటికీ తెలియదు… ‘నాన్నంటే’ నిత్యావసర వస్తువని!

శర్మగారి కథల గురించి ప్రముఖ రచయిత కీ.శే. మధురాంతకం రాజారాం స్పందిస్తూ "కోట్లాది మంది జీవిస్తున్న ఈ దేశంలో దీనజనులకేసి మాత్రమే అపేక్షగా చూసే చూపూ, వాస్తవికతా పరిధిని దాటిపోని యదార్థవాద దృక్పథమూ, మానవీయ విలువలకు ప్రతీకలుగా మారే వ్యక్తులతో అలవోకగా మమేకమయ్యే ధర్మ నిగ్రహమూ, మొదలు పెట్టిన నాలుగు వాక్యాలలోపే కథకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించుకునే నేర్పూ, నింపాదిగా, ఒడుపుగా, హుందాగా సాగిపోయే కథనమూ, సదవగాహన తీరాలకు చేర్చే శిల్పమూ, సామాజిక వ్యవస్థపట్ల నిరసనను పెల్లుబికేలా చేసే నిపుణతా... వెరసి జీవితాన్ని కథలా, కరుణరసాత్మక కావ్యంలా మలిచే కళాకారుడి కౌశలమే జగన్నాథశర్మ కథలు!" అంటూ ఎంతో మెచ్చుకున్నారు.

మరో ప్రసిద్ధ కథా రచయిత కీ.శే. పంతుల జోగారావు గారికి కూడా శర్మగారి కథలంటే చాలా ఇష్టం. ఆయన మాటల్లో చెప్పాలంటే.. "శర్మ కథలన్నీ... దిగువ మధ్యతరగతి జీవిత వాస్తవాల నిప్పు కణికెలు. చేతి వ్రేళ్ళకి తగిలి, కాలిన కమురు వాసనతో గుండెలు పిండేసేలా రాసినవి. ఈ కథల్లో ఛిద్ర జీవితాల పట్ల కసీ, కోపం, అభిమానం, జాలి, దయ...అన్నీ కలగలిసిపోయి ఉంటాయి. చెప్పదలచినదీ, చెప్పగలిగినది ఇంత వాడిగా, వేడిగా, సూటిగా, ఒడుపుగా చెప్పే అక్షర విద్య జగన్నాథ శర్మగారికే చేతనవును. కితకితాలయిన అక్షరాలూ, పదాల పరుగుల ఉరవడి, కెరటాల్లా విరిగి పడే వాక్యాల విరుపులూ... వీటితో ఆయన కథలన్నీ మనల్సి వెంటాడుతాయి. కన్నీళ్ళూ, వేదనలూ నిండిన ఆయన కథలు మరోసారి చదవడానికి భయపెడుతూనే, మళ్ళీ మళ్ళీ చదివించేలా చేస్తాయి. అదే వాటి గొప్పతనం!" అని అంటారు.

ఇంత గొప్ప కథని మరలా మీకు గుర్తు చేయడం నా భాగ్యమని భావిస్తూ జగన్నాథశర్మ గారికి, కథా మంజరి బృందానికి నమస్సులు తెలియ జేసుకుంటున్నాను..

**సమ్మెట ఉమాదేవి**

***0***

మొదటి బహుమతి

# చేజార్చుకోకు బంధాన్ని



ఓలేటి శశికళ

**మొదటి బహుమతి**



# చేజార్చుకోకు బంధాన్ని

ఓలేటి శశికళ

"అమ్మా! గిరిధర్ నీతో ఏదో మాట్లాడతాడట. ఈరోజు సాయంత్రం మనింటికి రావచ్చా అని అడిగాడు!" వసుధ వాళ్ళ అమ్మ సుధతో చెప్పింది.

"గిరిధర్ ఎవరు వసుధా?"

"అదేనమ్మా! మొన్న టార్గెట్ సూపర్ మార్కెట్లో కలిసాడు చూడు. మా టెక్నికల్ డైరెక్టర్ అని పరిచయం చేసా. అతను!" ముక్తసరిగా చెప్పింది వసుధ!

"నాతో మాట్లాడేదేముంటుంది వసూ?" సుధ గొంతులో సందిగ్ధం.

"అమ్మా! ముసుగులో గుద్దులాట ఎందుకు కానీ అసలు విషయానికి వద్దాం. నాకు డైవోర్స్ అయిందని తెలియగానే .... తమ ప్రయత్నాలు మొదలుపెట్టిన నడివయసు పెళ్లికొడుకుల్లో ఈ గిరిధర్ ఒకడు. వయసు నలభై. ఆరేళ్ళ కొడుకును పట్టుకుని, అమెరికా నచ్చలేదని వాళ్ళావిడ ఇండియా పారిపోయిందట. అప్పటి నుండి ఉలుకూ పలుకూ  లేదట. పోలీసు కేసులు పెట్టి వేధించిందట .... ఇంకా ఏవో ఇష్యూస్ ఉన్నాయట. మా ఆఫీసులో జనాలంతా నా కేబిన్ లోకి రావడం .... ఈ గిరిధర్ ఎంత గొప్పవాడో, యోగ్యుడో చెప్పడం .... తనతో ఫార్మల్ గా మాట్లాడమని బలవంతం చెయ్యడం. సంతయిపోతోంది!  ఇదిగో ఈరోజు అతనే డైరక్ట్ గా రంగంలో దిగిపోయాడు!".

వసుధ గొంతులో ఒకలాంటి నిరసన, అయిష్టత గమనించి.... "ఈ పిల్ల ఇంకా మానసికంగా సిద్ధంగా లేదు మరో వైవాహిక బంధంలోకి చిక్కుకోడానికి" .... అనుకుంటూ చిన్నగా నిట్టూర్చింది సుధ!

"అరె! ఏం మనుషులమ్మా! ఆడపిల్లను స్వతంత్రంగా బతకనివ్వరా! నా మనసు ఎంత దెబ్బతిని వుందో ఎవ్వరికీ పట్టదా?  మూర్ఖుల్లాగా.... వీడిని చేసుకో, వాడిని చేసుకో...'ఈ దేశంలో తోడు లేకుండా బతకడం కష్టం. నీ బిడ్డకు ఆర్థిక భద్రత, సామాజిక భద్రతా లేకుండా ఈ దేశంలో పెంచలేవు!" అంటూ ఆఫీసుకెళ్ళినప్పటినుండి మన తెలుగాళ్ళు అందరూ  చేరి ప్రబోధాలు మొదలు పెట్టేస్తారు!"  ఇంచుక అరుస్తున్నట్టు చెప్తున్న వసుధకేసి సాలోచనగా  చూసింది సుధ.

"సరే అవన్నీ వదిలేయ్. టెక్నికల్ డైరెక్టర్ అంటే మంచి వెల్ సెటిల్డ్ అబ్బాయే అయివుంటాడు.  నాతో మాట్లాడతానని అన్నాడంటే సంస్కారం,  పద్ధతి ఉన్నవాడల్లే ఉన్నాడు. మనిషిని చూసా! బావున్నాడు. నీ అభిప్రాయం ఏంటి అతని గురించి! "

“అభిప్రాయం లేదూ తొక్కా లేదు. నేనసలు సిద్ధంగా లేనమ్మా! అతను ఆఫీస్ బల్లమీద తను, వాళ్ళావిడా, బాబు ఉన్న ఫోటో పెట్టుకుని ఉంటాడు. ఒక రోజు నేనేదో పనిమీద అతని కేబిన్లోకి వెళ్ళగానే, ఆ ఫోటో తీసి దాచేస్తున్నాడు. ఎందుకంత ఆత్మవంచన? నిజంగా భార్యా కొడుకుల మీద ఫీలింగ్స్ ఉన్నపుడు, మరి కాస్త ప్రయత్నించి... వాళ్లతో యునైట్ అవ్వచ్చుకదా. ఇప్పుడో కొత్త అమ్మాయిని జీవితంలోకి ఆహ్వానించడం అవసరమా? మొదట్లో బానే ఉంటుంది. ఆ తరవాత ఆ అమ్మాయికీ నాకూ ఉన్న సుగుణాలూ, వ్యత్యాసాలూ పోలికకు పెడతాడు. పిల్లలను కంపేర్ చెస్తాడు. నాలో నచ్చని అంశాలను భూతద్దంలో చూసుకుని ... ఆ అమ్మాయయితే ఇలా చేసేది కాదు అంటాడు. ఎందుకమ్మా నాకీ గోలంతా! నేను హాయిగా ఉన్నా. నీకూ, నా కొడుకుకూ వందశాతం సమయం ఇవ్వగలుగుతున్నా. నాకయితే ఇంట్రస్ట్ లేదు. నువ్వు అదే విషయం నీ లౌక్యం, మాటకారితనంతో చెప్పేస్తే నేను సుఖపడతా!” కొట్టినట్టే ఉంటాయి వసుధ మాటలు.

సుధకు కూతుర్ని చూస్తే ఒక పక్క గౌరవం, ఒక పక్క ఆందోళనగా ఉంటుంది. దేశం కాని దేశంలో మంచి ఉద్యోగంలో కుదురుకుని, ఆరేళ్ళ గృహహింసను చట్టంతో తిప్పికొట్టి, ఆత్మవిశ్వాసంతో ముందుకుపోయే పిల్లంటే గర్వంగా ఉంటుంది. కానీ గత అనుభవాల చేదును మరిచిపోలేక, జీవితంలో కొత్త ఉదయాన్ని ఆహ్వానించడానికి జంకిపోతూ.... తన ఫీలింగ్స్ ను ఫ్రీజ్ చేసేసి .... శిలలా మారిపోతున్న ఆమెను చూస్తే, ఆ తల్లిమనసు బాధతో మూల్గుతుంది.
“వసుధా! నేను గిరిధర్ ను కలవాలనుకుంటున్నాను. నీ గురించి కాకపోయినా... అతనితో మాట్లాడితే... ఒక రెండో పెళ్ళికి సిద్ధమైన అబ్బాయి మానసిక స్థితి ఎలా వుంటుందో నాకొక ఐడియా ఉంటుంది. రేప్పొద్దున్న నువ్వు మరో జీవితానికి సిద్ధపడినపుడు డూస్ అండ్ డోంట్స్ మీద మనకు అవగాహన ఉంటుంది. నేను అతని ఇంటికే వెళ్ళి కలుస్తా!“
తల్లి మాటలకు ఆగ్రహంతో మాట తూలబోయి... నిగ్రహించుకుని..” నీ ఇష్టం అమ్మా. వెళ్తే వెళ్ళు!” అనేసింది వసుధ.

***

సాయంత్రం ఆరయినా ప్రకాశవంతంగా ఉంది. సూర్యుని ఏటవాలు కిరణాలు ఆ ప్రాంతాలను రాత్రి పదయినా వెలిగిస్తూనే ఉంటాయి. వసుధ కార్లో దించేసి వెళ్ళిపోగానే .. సుధ కాసేపు అక్కడే నిలబడిపోయి ఆ పరిసరాలను పరిశీలిస్తూ నిలబడిపోయింది. మంచి సంపన్న కుటుంబీకులు ఉండే పోష్ ఏరియా అది. అర ఎకరం స్థలంలో మూడంతస్థుల మేడ గిరిధర్ నివాసం. మనుషుల మధ్యే గోడలు తప్ప ఇళ్ళ మధ్య గోడలు ఉండవు అక్కడ. పచ్చని పచ్చిక బయళ్ళ మధ్య పూదీవులతో అతి సుందరంగా ఉంది ఆ ప్రదేశం.
వసుధ సందేశం ఇచ్చినట్టుంది ... తలుపు తీసుకుని గిరిధర్ బయటకు వచ్చాడు సుధను ఆహ్వానించడానికి.

పలచనయిన జుట్టును టోపీతో, పెరిగిన చిరుబొజ్జను వదులు చొక్కాలో దాచి ... కాస్త శ్రద్ధగానే తయారయినట్టు గ్రహించింది సుధ. నిజమే అవతల తన కూతురుది కళ్ళు తిప్పుకోలేని అందం మరి. లోపలికి వెళ్ళగానే చందనపు అగరత్తుల ఆఘ్రాణింపు, ఎమ్ ఎస్ సుబ్బలక్ష్మి సంగీతం, బాపూ పెయింటింగ్స్ .. అతని భారతీయతను ప్రదర్శిస్తూ దర్శనమిచ్చాయి. మనసులో చిన్నగా నవ్వుకుంది సుధ. అయితే గోడల మీద అక్కడక్కడా ఖాళీ మేకులు .. అతను దాచేసిన గతస్మృతులుగా అర్ధమై మనసు "ఏం కావాలి ఈకాలం అమ్మాయిలకూ అబ్బాయిలకూ! కొంత సహనం, కొంత సర్దుబాటుతో సరి చేసుకోగలిగిన జీవితాలను అహాలతో, అసహనంతో అల్లరిపాలు చేసుకుని తెగతెంపులు చేసుకుంటున్నారు. వారి మధ్య వారి ప్రమేయం లేకుండా వచ్చిన చిన్నపిల్లలు ఎంత ఛిద్రమైపోతున్నారు" ఆమె ఆలోచనలను త్రెంచుతూ.. "రండి ఆంటీ! లోపల లివింగ్ రూమ్ లో కూర్చుందాం!" అంటూ లోపలికి దారితీసాడు గిరిధర్!

ఇద్దరూ తమ మాటలతో చిన్నచిన్న ఫార్మాలిటీస్ పూర్తిచేసుకున్నాకా .. సేరుగా విషయంలోకి వచ్చేసింది సుధ!

"చెప్పండి గిరిధర్! మీ మొదటి వివాహం ఎందుకు ఫెయిల్ అయింది? మీరు ఎందుకు వసుధను మీ జీవితంలోకి ఆహ్వానిద్దామని అనుకుంటున్నారు?"

ఒక తెలుగింటి అమ్మాయి తల్లి నుండి, ఇంత ఖచ్చితమైన ప్రశ్న వస్తుందని ఊహించని గిరిధర్ కాస్త ఖంగుతిన్నాడు. నిజానికి తను వసుధకు గొప్ప ఉపకారం చేస్తున్నానని అనుకుంటున్నాడు. ఇలా క్రాస్ ఎగ్జామినేషన్ కు అతను సిద్ధంగా లేడు. తన సంపాదన, ఇల్లూ, కార్లూ వసుధ తల్లికి చూపించి.... ఆమె దగ్గర అదనపు మార్కులు సంపాదించాలని అనుకున్నాడు తప్పా, తన గతమంతా ఆవిడ ముందు పరవాలని అతను ఊహించనే లేదు. వసుధ గతం గురించి తను తెలుసుకోవాలని .. దానిని బట్టి ఆమెతో తను అడ్జస్ట్ అవ్వగలడో లేదో తేల్చుకోవాలని అనుకుంటే .. కథ కాస్త అడ్డం తిరిగినట్టు అనిపించింది అతనికి.

"పెద్దగా గొడవలేమీ లేవాంటి! ఆ అమ్మాయో మహా తిక్కది. ఒక్కర్తే కూతురు. పిచ్చి గారంగా పెంచేసారు. ఇండియాలో ఏదో పెద్ద కంపెనీలో చేసేది. అమెరికా వచ్చాకా ఒక యేడాదంతా ఖాళీగా ఉంది. అప్పుడే మొదలయింది అసంతృప్తి. మా అమ్మగారు ప్రతి యేడూ ఆరు నెలలు ఇక్కడకొచ్చి నాతో గడుపుతారు. తనకు అదో పెద్ద ప్రోబ్లమ్ అయిపోయిందండి. అమ్మ నాకు ఇష్టమైనవన్నీ చేసిపెట్టేది. అలిసిపోయి వచ్చి అమ్మ ఒళ్ళో కాసేపు తలపెట్టి పడుకుంటే, విపరీతంగా అసూయ పడిపోయేది. అక్కడే ఏడ్చేసి తన కుళ్ళు చూపించేది. ఒకటి కాదండి.... చెప్పాలంటే సవాలక్ష. ఇక్కడ ఉన్న నాలుగేళ్ళలో ఒక జీవితకాలానికి సరిపడ్డ నరకాన్ని చూపించేసింది!"

గిరిధర్ మాట్లాడుతుంటే .. అతని ముఖకవళికలు గమనిస్తోంది సుధ. ఎంత మందికి చెప్పున్నాడో ఏమో అతను నెరేట్ చేస్తుంటే ఆ మాటల్లో పెద్ద బలం కనిపించలేదు. మరి పేరే ఏమీ ప్రశ్నించకుండా..
"గిరిధర్! మీ ఆవిడా, బాబూ ఉన్న పిక్చర్ ఏమన్నా ఉందా. నువ్వు చక్కని వాడివి కదా. నీకొచ్చిన అమ్మాయి, మీ బాబూ ఎంత చక్కగా ఉండి ఉంటారో కదా అని చిన్న క్యూరియాసిటీ! అంతే!" అంది సుధ!

'తన కూతురి గురించి మాట్లాడుకోకుండా, నా గతాన్ని తవ్వుతున్నారేంటి ఈమె' అనుకుంటూ, ఆ పక్కనే బల్ల మీద ఉన్న ఆల్బమ్స్ చేతిలో పెట్టాడు. ఆల్బమ్స్ అంత అందుబాటులో పెట్టుకున్నాడంటే..... అతన్ని వారితో పంచుకున్న అనుభూతులు ఇంకా వెంటాడుతున్నట్టే కదా!
"అబ్బా! ఎంత చక్కగా ఉంది ఈ అమ్మాయి. చూడ చక్కని జంట మీది! మీ బాబు ఎంత బావున్నాడు గిరిధర్. మీ ఇద్దరి అందం, చురుకుదనం వచ్చినట్టుంది!" సుధ మాటలకు గిరిధర్ కళ్ళల్లోకి ఆనందంతో కూడిన కాంతి జివ్వున పాకింది. తనను విడిచిపోయిన తన కుటుంబం గురించి ఒక అపరిచితురాలు ప్రశంసించడం అతని మనసుకు చాలా సాంత్వన ఇచ్చింది.
"థేంక్యూ ఆంటీ! మనోజ్ఞ పేరుకు తగ్గట్టే చాలా అందమయిన అమ్మాయి. ఆ కళ్ళు చూడండి ఆల్చిప్పల్లా. ఈ రోజుల్లో అంత పొడవు జడున్న అమ్మాయిలను చూడం! పెళ్ళయిన మొదటి ఆరు నెలలు ఎంత ఆనందంగా గడిపామో. తను చాలా బాగా పాడేది. ఇక్కడ చుట్టుపక్కల తెలుగు పిల్లలను కూడేసి సంగీతం పాఠాలు చెప్పేది. హిందూ టెంపుల్ కెళ్ళి పాడేది. పాడుతా తీయగాకు పాడాలని చాలా సరదా పడింది. మా అమ్మగారికి నచ్చలేదు ఇవన్నీ. మా ఇళ్ళల్లో సాంప్రదాయాలు ఎక్కువండి. ఒక్కోసారి ఆలోచిస్తే ఇప్పుడు అనిపిస్తుంది .. తెగేదాకా లాగేమా అని!"
గిరిధర్ అలా మాట్లాడుతుంటే సుధకు చాలా ఆశ్చర్యమేసింది. 'ఇతడు మెల్లమెల్లగా ఓపెన్ అప్ అవుతున్నాడు. మనసులో ఆమె అంటే ప్రేమ ఉంచుకుని.... ఎందుకు బంధం తెంపుకున్నాడు?' అనుకుంటూ సుధ....
"మీ అబ్బాయితో నీ అనుబంధం గురించి చెప్పు. ఇంత ముద్దుల మూట కట్టే చిన్నారితో నీకు చాలా మెమొరీస్ ఉండి ఉండాలి కదా!" ఆమె ముగించకుండానే అతను పూర్తిగా బరస్ట్ అయ్యాడు. కళ్ళలో పలచని నీటి తెర.
"వాడి పేరు గౌరవ్ ! మా అమ్మ పేరు "గౌరి" కలిసి రావాలని పెట్టాము. ఇప్పుడు ఎనిమిదేళ్ళు వాడికి. ఎన్ని కలలు కన్నామో వాడి గురించి. వాడిని హార్వార్డ్ పంపాలని నేను సేవింగ్స్ కూడా మొదలుపెట్టాను. వాడి ఆట పాటలు, ముద్దు ముద్దు కబుర్లూ, వాడి ప్రతి నెల పుట్టినరోజులు .... ఇలా అన్నీ అపురూపాలే! వాడు నాకు దూరమై రెండేళ్ళయింది. వాడిని తలవకుండా ఒక్క క్షణం లేనండి!" చాలా ఉద్వేగం అవుతున్నాడు గిరిధర్!

"నాన్నా! బాధపడకు. నువ్వు మంచివాడివి. ఆ అమ్మాయీ మంచిదే అయింటుంది. పెళ్ళయిన మొదటి కొన్ని సంవత్సరాలు ఈ ఫ్రిక్షన్ ఏ జంటకేనా సహజమే! కానీ మీ విషయంలో సయోధ్య చెయ్యాల్సిన పెద్దలు మరెందుకో ఉదాసీనంగా ఉన్నట్టున్నారు!"

"మీరన్నది ముమ్మాటికీ నిజం ఆంటీ. మా అమ్మకు పంతం ఎక్కువే. అలాగే మనోజ్ఞ మదర్! గౌరవ్ పుట్టినపుడు వచ్చి వున్నారు. మహా అహంకారి. ఆమె అడ్వకేట్. తన ఖర్చులు తను పెట్టుకుంటానని మాకు డబ్బు ఇచ్చేసేవారు. అది చూసి మా అమ్మకు ఒళ్ళు మండేది. "నేనేనా ఇక్కడ పడి తింటున్నది.." అని మండిపడేది. ఇలా మాటకు మాట పెరిగి నరకం అయిపోయేది ఇల్లు. పైగా మనోజ్ఞకు గౌరవ్ ను పెంచడంలో మా అమ్మ పద్ధతులు నచ్చేవి కావు. తనకు ఉద్యోగం వచ్చాకా అమ్మా-అత్తా మధ్య మా కాపురం విచ్ఛిన్నమైపోయింది. వన్ ఫైన్ డే గౌరవ్ ను పట్టుకుని ఇండియా వెళ్ళిపోయింది తను. వాళ్ళమ్మగారు మా మీద డౌరీ హరాస్మెంట్ కేస్, గృహహింస కేస్ లని పెట్టి... మా అమ్మా వాళ్ళను కోర్టు చుట్టూ తిప్పించింది...." ఇంకా చెప్పేవాడే సుధ అడ్డుపడకపోతే!

"గిరిధర్! ఒక మాట అడుగుతా ఏమనుకోవద్దు. మీ నాన్నగారేం చేస్తారు?"

"నాన్న డాక్టరండి. గవర్నమెంట్ డాక్టర్ గా రిటైరయ్యారు మొన్ననే. ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారు."

"ఏం లేదు.... భర్తను పనివారికి వదిలేసి మీ అమ్మగారు అమెరికాలో కూర్చోడమేమిటి? నువ్వేమీ చంటి పిల్లాడివి కాదు కదా. పైగా ఇంకో ఇద్దరు బ్రదర్స్ కూడా ఇక్కడే ఉన్నారు. పోనీ నువ్వు బాచిలర్ గా ఉన్నప్పుడు వచ్చినా అర్థముంది... కానీ కొడుకు పెళ్ళయ్యాకా కూడా వాళ్ళకు ఆమెతో ఎలాంటి అవసరం లేకపోయినా వచ్చి కూచుని, వాళ్ళ కాపురంలో వేలు పెట్టడం ఎంత సబబూ?" కాస్త తీవ్రంగానే అడిగింది సుధ.

గిరిధర్ మొహం మ్లానమయింది. ఏమీ మాట్లాడ లేకపోయాడు.

"అలాగే మీ అత్తగారు! పిల్ల పురిటికొచ్చినామె, పని చూసుకుని వెళ్ళిపోకుండా .. అమ్మాయికి ఉన్న అసహనాన్ని మరింత రెచ్చకొట్టడం తప్పు! లాయర్ తెలివితేటలతో కూతురినీ, మనవడినీ నీకు దూరం చెయ్యడం తప్పే! వాళ్ళు ప్రేమకొద్దో, మూర్ఖత్వంతోనో మిమ్మల్ని విడగొట్టారే అనుకోండి... మీ విజ్ఞత ఏమయింది? చదువుకున్న వాళ్ళు. మరీ చిన్నవాళ్ళూ కాదు వయసులో. మిమ్మల్ని సంధానిస్తూ ఇద్దరూ కోరుకున్న గౌరవ్ ఉన్నాడు. మీరిద్దరూ మాట్లాడుకుని, సయోధ్యగా .. మీ ఇరువైపుల వారినీ కొన్నాళ్ళు దూరం పెట్టి హాయిగా ఉండకుండా... చాలా సంక్లిష్టం చేసుకున్నారు విషయాన్ని"....ఆంగ్లంలో కాస్త గట్టిగానే గడ్డి పెట్టింది సుధ!

గిరిధర్ కు ఎక్కడో చివుక్కుమనిపించింది. కాస్త చురుగ్గానే "నాకు ఇన్ని చెప్తున్నారు... మరి మీ అమ్మాయి విషయంలో మీరూ అదే పని చేసారు కదా. ఒక జంటను విడగొట్టారుగా!" కాస్త కచ్చగానే అడిగాడు.

"గిరిధర్! నీకు వసుధ గతం చెప్తే, నువ్వే అందువు .. ఎందుకు ఈ పిల్ల ఆ నరక కూపంలో మగ్గిపోతోందని. అందం, మంచి ఉద్యోగం , వీసా స్టేటస్ ఉంచుకుని... ఇంకా ఏం బావుకోవాలని ఆ అత్తారితో ఉంటోంది.... అని నువ్వే అనే వాడివి. వసుధ అనుమతి లేనిదే నేను తన స్వవిషయాలు ఇతరులతో మాట్లాడలేను. వసుధలాంటి ఆడపిల్లలు దేశం కాని దేశాల్లో కూపస్థ మండూకాల్లా ఎన్ని బాధలు పెడుతున్నా, అదే లోకమంటూ ఉండిపోతారు. బయట ప్రపంచం ఇంకా భయంకరంగా ఉంటుందేమో! సామాజికంగా భర్తను వదిలేసిన స్త్రీకి గౌరవం దొరకదేమో .. బయటకొచ్చాకా ఎటుపోవాలి? ఎక్కడుండాలి .. ఇలాంటి ఎన్నో భయాలు. అందుకే తను ఆ పెళ్ళి త్రుంచుకుని బయటపడడానికి అన్నేళ్ళు పట్టింది. ఈ కాలం అమ్మాయికి భయమా అనచ్చు. ఈ కాలం అమ్మాయిలందరూ ఒకే మూసలో ఉండరు కదా!! కానీ నీ విషయంలో ఒకటి చెప్పగలను.... నీ మాటలు విన్నాకా, మీ ఇద్దరి సెపరేషన్ కూ బలమైన కారణాలే లేవనే అనిపిస్తోంది నాకు. అన్నట్టు గిరిధర్! మీరిద్దరూ విడాకులు తీసుకుని ఎన్నాళ్ళయింది? మనోజ్ఞ మళ్ళీ పెళ్ళి చేసుకుందా?"
సుధ రెండో ప్రశ్న గిరిధర్ కు రుచించలేదు.
"విడాకులు ఫైనల్ స్టేజ్ లో ఉన్నాయండి. గౌరవ్ కస్టడీ కోసమే ఇన్నాళ్ళూ వెయిట్ చేసా. ఇంక అది అయ్యే పని కాదని తెలిసి వదిలేసుకుంటున్నా. పిల్లాడి సంరక్షణ మనోజ్ఞకే ఇచ్చేద్దామని నిర్ణయించుకున్నా! తను ముందు ముందు మరో పెళ్ళిచేసుకోవచ్చు. ఆ వచ్చేవాడు గౌరవ్ ను పూర్తిగా సొంతం చేసుకోగలడా? కన్న తండ్రి తరవాతే కదాంటీ ఎవరైనా....."
ఆ మాటలు చెప్తున్నపుడు గిరిధర్ గొంతులో స్పష్టమైన వణుకు!
"నాకు ఈ మాటలే కావాలి గిరిధర్! నీ మనసు నీ భార్యా బిడ్డలను తిరిగి కోరుకుంటోంది. అహమో, పంతమో అడ్డొస్తున్నాయి. ఆ అమ్మాయి కోర్టు హియరింగులకు రాదు, తన పేరెంట్స్ దగ్గర కూడా ఉండట్లేదని ఇందాకా అన్నావు కదా! దాని బట్టీ నీకు ఏమర్థమవుతోంది? తనకు నువ్వు కావాలి. తన బిడ్డకు తండ్రిని దూరం చేసే పని ఆమె చెయ్యలేకపోతోందేమో! తల్లిదండ్రుల నుండి విడిపోయిందేమో వారి ఒత్తిడి నచ్చక! ఇంత రచ్చ చేసుకున్నాకా ఏ మొహం పెట్టుకుని నీతో సయోధ్యకు రావాలో అర్థం కావడం లేదేమో! పాజిటివ్ గా ఆలోచించు నువ్వు కూడా. ఇండియా వెళ్ళు. మధ్యవర్తులతో కాకుండా నువ్వు నేరుగా మాట్లాడు మనోజ్ఞతో!"
సుధ చెప్తుంటే మంత్రముగ్దుడులా వింటున్నాడు అతను!
"మీ ఆలోచనలు చాలా ఉదాత్తమైనవే కానీ ఇవన్నీ ఆచరణలో అవ్వవాంటీ...." తేలికగా నవ్వుతూ తేల్చేసాడు... గిరిధర్!
"సరే గిరిధర్! నువ్వు మా వసుధనే చేసుకున్నావే అనుకో.... మళ్ళీ అవే సమస్యలు, ఏవీ మారవు! తనకు అత్తగారితో ఉండడం ఇష్టం లేదు. నన్ను విడిచి వుండనంటుంది. నేను కూడా ఎక్కడున్నా నా ఖర్చులు నేను పెట్టుకునే రకాన్నే! పైగా వసుధ కొడుకును పెంచుతుంటే.... నీకు నీ గౌరవే గుర్తుకొస్తాడు. వాడు బాగున్నాడో, బాధలు పడుతున్నాడో అని తల్లడిల్లిపోతూ వుంటావు. వసుధ ఏం తప్పు చేసినా మనోజ్ఞ

పోలిక తప్పనిసరి తెస్తావు.  ఒక్కోసారి  మనోజ్ఞ అయితే ఇలా చెయ్యదే అని కూడా అనుకోవచ్చును. సంబంధానికని వచ్చి,  ఈవిడ సొంత కూతురి  జీవితంలో చిచ్చుపెడుతోందే అనుకోకు.  నువ్వయినా, వసుధయినా రెండో పెళ్ళంటే మరింత జాగ్రత్తగా అడుగెయ్యాలి.  ఇక్కడ సెకండ్ ఛాన్సులు ఉండవు. చేసుకున్నాకా ఒకరికొకరు నచ్చలేదా .. పెనం నుండి పొయ్యిలో పడ్డట్టే! బాగా ఆలోచించుకో గిరిధర్! లేదూ... నాకు మనోజ్ఞ మరింక వద్దు అని నిశ్చయంగా అనుకుంటే .. నేను వసుధను ఏదో విధంగా కన్విన్స్ చేస్తాను!"

ఇంకా చెప్పబోయేదే .. బయట కార్లో వెయిట్ చేస్తున్నానని వసుధ నుండి సుధ ఫోన్లో నోటిఫికేషన్ వచ్చింది. "ఏం పిల్లో .. కర్టసీకయినా ఒకసారి లోపలికి వచ్చి కొలీగ్ ను పలకరించచ్చు కదా!" అనుకుంది సుధ. ఆమెకు ఈ కాలం పిల్లల్ని చూస్తే కోపం కన్నా జాలే ఎక్కువ కలుగుతుంది.  చాలా తెలివయిన వారమనుకుంటారు.

సాంకేతికపరంగా మేధావులేమో  కానీ జీవితంలో కీలక నిర్ణయాల దగ్గర చాలా తెలివితక్కువగా ప్రవర్తిస్తారు. జ్ఞానోదయం అయ్యేటప్పటికి కాలాతీతమైపోతుంది.  కోరుకున్నది  చేజారిపోతుంది.

గిరిధర్ తో గడిపిన ఆ సాయంత్రాన సుధకు నేటి వివాహ వ్యవస్థ గురించి ఉన్న ఎన్నో ప్రశ్నలకు జవాబులు దొరికాయి.  తేలికయిన మనసుతో బయటకు నడిచింది. గిరిధర్ ఒక చక్కని గిఫ్ట్ బేగ్ లో గంధం చెక్కతో చేసిన ఏనుగుల జోడీ ఇచ్చాడు సుధకు! మౌనంగానే కారు దాకా వచ్చి సాగనంపాడు.

వసుధ కనీసం.. 'ఏమయింది? ఏం మాట్లాడుకున్నారు ?'  అని కూడా అడగలేదు.

కొడుకుతో ఆడుకుంటూ ప్రపంచాన్ని మరిచిపోయిన కూతుర్ని చూసి... "ఈ పిల్ల మనసుకయిన గాయాలు ఇంకా పచ్చి పోలేదు. తనను తొందరపెట్టి ఏదో వివాహబంధంలో ఇరికించడం అన్యాయమేమో! తనంతట తను నచ్చినవాడిని ఎన్నుకోడమే కరెక్ట్!" అనుకుంటూ నిద్రలోకి జారుకుంది సుధ.


అర్ధరాత్రి..... ఫోన్లో టింగ్ మని మెసేజ్ మేల్కొలుపు.  లేచి, కళ్ళజోడు పెట్టుకుని వాట్సప్ తెరిచింది. ' గిరిధర్'. "ఆంటీ మీకు మనోజ్ఞ నంబర్ ఫార్వార్డ్ చేస్తున్నా! మీరు మాట్లాడతారా. మీరు మాట్లాడి తనను ఒప్పించాకా... నేను ఫస్ట్ ఫ్లైట్ కు ఇండియా బయలుదేరి వెళ్ళి .. తనను కన్విన్స్ చేసుకుంటాను! నాకు గౌరవ్ కావాలి. అంతకన్నా ఎక్కువగా మనోజ్ఞ కావాలి!"  అంటూ ఒక నమస్కారంతో ముగించాడు.

టైమ్ చూసుకుంది. "ఇప్పుడే కాల్ చేసేస్తా! అక్కడ ఉదయమే కదా. ఒక జంట కలుస్తారంటే అంత కన్నా ఆనందం మరింకేముంది!" అనుకుంటూ వేలికి పని చెప్పింది సుధ.

***0***

రెండవ బహుమతి

# ఆపద్భాంధవులు




డి.ఎస్. వి. రామశర్మ

**రెండవ బహుమతి**

# ఆపద్బాంధవులు

డి.ఎస్. వి. రామశర్మ



అపుడే తెలిసిన వార్తతో ఆదుర్దా పెరిగింది కిరణ్ కు.

ఉన్నపళంగా సీట్ నుంచి లేచి పర్మిషన్ కూడా అడగకుండా ఆఫీస్ మేనేజర్ క్యాబిన్ లోపలికి వెళ్ళాడు.

"ఎస్. కిరణ్..వాట్స్ ది మేటర్ ?" లోపలికి హడావిడిగా వస్తున్న కిరణ్ ను చూసి అడిగాడు మేనేజర్ రామన్.

కిరణ్ కళ్ళల్లో కన్నీటి చుక్కలు కనబడుతున్నాయి. శ్వాస వేగాన్ని కూడా గమనించి "రిలాక్స్. కూర్చో. ఏమిటీ ఏమైంది?" అడిగాడు రామన్.

"సార్. రవికి జరిగి ఆరు నెలలు కూడా కాలేదు. ఈ రోజు మళ్ళీ మరొకరు..." అంటూ గద్గద స్వరంతో చెప్తూ ఆగాడు కిరణ్.

"అయ్యో.. ఏమైంది ఎవరికి ఎక్కడ ఎప్పుడు?" వరుస ప్రశ్నలతో అడిగాడు హతాశుడైన రామన్.

"అన్నీ చెప్తాను. ముందు బయల్దేరండి వెళ్దాం.."

కిరణ్ చెప్పగానే "పద ..ఆలస్యం చేయొద్దితే" అంటూ ఆఫీస్ పనులన్నీ పక్కన పెట్టి కిరణ్ మీద ఉన్న నమ్మకంతో బయలుదేరడానికి సిద్ధమయ్యాడు రామన్.

కిరణ్ , రామన్ హడావుడిగా వెళ్ళడం చూసిన ఆఫీస్ స్టాఫ్ ఏమైందో అని గుసగుసలాడుకున్నారు.

***

రోడ్ ఒక వైపు బ్లాక్ చేసుంది. జనాలు గుమిగూడి ఉన్నారు. 'అయ్యో' అనే నిట్టూర్పుల మధ్య అక్కడ గాలి కూడా అదే ఫీలవుతోందనిపిస్తోంది. అక్కడే పక్కన కింద పడున్న బైక్. రక్తపు మరకలు. మధ్యలో ముడుచుకుపోయున్న బైక్ ని నడిపిన వ్యక్తి. గంట క్రితం జరిగిన ప్రమాదం ఓ ప్రాణం ఖరీదు.

ఆ ప్రదేశం ప్రమాదాలకు పెట్టిన పేరు. డేంజర్ మలుపులు రెండున్నాయి. హెచ్చరికలెన్ని పెట్టినా నెలకో ఐదారు ప్రమాదాలు జరుగుతుంటాయి.

కిరణ్, రామన్ చేరారక్కడికి. చుట్టూ మూగి ఉన్న జనాలను తోసుకుంటూ పడిన వ్యక్తి దగ్గరకు వచ్చారు.

అంతే భోరున విలపించసాగాడు కిరణ్. ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళ నీళ్ళను ఆపుకోలేక సతమతమవుతున్నాడు రామన్. ప్రమాదానికి గురైన ఆ వ్యక్తి గిరి. రామన్ స్టాఫ్ లో మంచి పేరున్నవాడతను. నాలుగు నెలల క్రితమే పెళ్ళయింది. చాలా చలాకీగా ఉండేవాడు. సందడి చేస్తూ అందరినీ నవ్విస్తూ ఉండేవాడు. పనిలో బాగా చురుకు. అజాగ్రత్త వల్ల రోడ్ యాక్సిడెంట్ లో ఇపుడు ప్రాణాలు కోల్పోయే పరిస్థితిలో ఉన్నాడు. అక్కడ అందరూ గుమిగూడి ఉన్నారే కానీ ఎవరికీ ఏంచేయాలో అర్థమవని స్థితి. కొందరు కేవలం చూస్తూ నిలబడ్డారు. ముగ్గురు నలుగురు మొబైల్స్ తో ఫొటో తీస్తున్నారు.

'అంబులెన్స్ కి ఫోన్ చేసారట. దారిలో ఉందట. రావడానికి సమయం పడుతుందట..'

'ఇక్కడే ఆరు నెలల్లో ఇరవై పైగా ఇలా యాక్సిడెంట్స్ జరుగుంటాయి' ఆ ఏరియాలో ఉండే ఒకడు చెప్తున్నాడు.

'ఇది మామూలే. ఎన్ని చూసానో ఇలా.. జరగాల్సుంటే ఇలా జరుగుతూనే ఉంటాయ్" మరొకతని మాట. కాని ఒక్కరికి కూడా రక్తపు మడుగులో ఉన్న గిరిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్దామన్న ఆలోచన లేదు. అసహాయత ప్రాణాన్ని ఏం నిలబెడుతుంది? ఆ కేసులో ఇరుక్కోవడమవుతుందని కాబోలు. కానీ అలా సాయం చేసిన వారికి కోర్టులు, పోలీసులనుంచీ ఎటువంటి నిర్బంధాలు రావన్న రూల్ తెలియకపోవచ్చు. తెలిసినా ముందుకు రానివారుండొచ్చు. యాక్సిడెంట్ జరిగినపుడు చూసి అక్కడకు పరుగెత్తుకుంటూ చేరిన వాళ్ళలో ఒక వ్యక్తి మాత్రం గిరితో మాటాడాడు. కదలలేని స్థితిలో ఉన్న గిరి ఓ నంబరు చెప్పి, నా పేరు గిరి అని చెప్పి ఈ యాక్సిడెంట్ సమాచారం ఇవ్వమని చెప్పాడు తట్టుకోలేని బాధలో గిరి.

అది కిరణ్ నంబర్. కిరణ్ అందరికీ చాలా హెల్పింగ్ గా ఉంటాడు. ఎవరికి ఏ అవసరమొచ్చినా ముందుండి చేస్తాడు. యాక్సిడెంట్ అవగానే వీలున్నంతలో కిరణ్ కే సమాచారం పంపాలని అంత బాధలోనూ గిరి ట్రై చేసాడు. ఇరుక్కుపోయి కదలించ వీలులేని చేతులు. వెన్నెముకకు బాగా దెబ్బ తగిలింది. ఉన్న కాస్త స్పృహతో ఇచ్చిన ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం చేరవేసాడు పెద్ద మనసుతో ఆ వ్యక్తి. ఆ ఫోన్ కాల్ సమాచారంతో కిరణ్, రామన్ ను వెంటబెట్టుకుని అక్కడికి చేరి ఐదు నిముషాలైంది. అంబులెన్స్ రాలేదింకా.

గిరి స్పృహలో లేడు.

చుట్టూ ఓ సారి పరికించాడు కిరణ్. చూసే వాళ్ళే గానీ ఏం చేయాలో ఆలోచించే వాళ్ళు అక్కడెవరూ లేరని తెలుస్తోంది. వెంటనే రామన్ కు చెప్పాడు

"సర్.. మీ కారును ఈ పక్కకు తీసుకురండి. గిరిని మనం మీ కారులోనే ఆసుపత్రికి తీసుకెళ్దాం. ఇప్పటికే చాలా ఆలస్యమైంది" చెప్తూనే గిరిని కదిలించడానికి చూసాడు కిరణ్.

'ఓయ్. అలా కదపకు. ఎముకలసలే ఇరుగుంటాయ్'

'పోలీసులొస్తారబ్బాయ్. వాళ్ళు చూసుకుంటారులే'

'నువ్విరుక్కుంటావేమో.. జాగ్రత్త బాబూ'

'బతకడు. తప్పనుభవించాల్సిందే'

ఒక్కొక్కరూ ఒక్కొక్క మాట అంటున్నారు.

'ఫ్యామిలీ వాళ్ళకు ఫోన్ చేసారా..' ఇంకొకతని ప్రశ్న.

రామన్ కారు పక్కకు తీసుకువచ్చాడు. 'ఓ చేయి వేయండి ' అన్న అభ్యర్థనను విన్నా, కామెంట్స్ తప్ప అడుగు ముందేసే వాళ్ళెవరూ లేరు ఆ గుంపులో. రామన్ సాయంతో గిరిని ఎట్టకేలకు కారు వెనక సీటులో చేర్చి కింగ్ జార్జ్ హాస్పిటల్ కు తీసుకెళ్ళాడు కిరణ్.

***

అక్కడ విషాద ఛాయలు నెలకొన్నాయి.

గిరి ప్రాణం కోల్పోయాడు. తలకు బాగా దెబ్బ తగిలింది. వెన్నెముక విరిగింది. ఆసుపత్రికి చేరటానికి కాస్త ఆలస్యం అవడంతో ప్రాణానికే వచ్చిన ముప్పు. గిరి మరణ వార్త విని కిరణ్, రామన్ తట్టుకోలేక పోతున్నారు.

ఇలా రోడ్ యాక్సిడెంట్స్ వల్ల రోజుకు ఎంతో మంది ప్రాణాలకు ముప్పు కలుగుతోంది. వాహనాన్ని నడిపేవాడి పొరబాటు వల్లనో, వెనక వచ్చే వాహనం నడిపేవాడి తప్పిదమో, రాంగ్ రూట్లో వచ్చే వాహనాల వలనో, మలుపుల వద్ద సరిగా లేని నిర్వాహణ వల్లనో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదం బారిన పడిన వారికి సమయానికి అత్యవసర వైద్యం అందని వ్యవస్థ వల్లో, ప్రేక్షకుల్లా చూస్తూ సాయానికి ముందుకు రాని వారి వల్లనో .. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. వారి మీద ఆధారపడిన కుటుంబాలు చితికిపోతున్నాయి!

రామన్ మనసు అదోలా ఐపోయింది. ఓ సంవత్సరం తాలూకా రోడ్ ప్రమాదాల వివరాలు అంతర్జాలంలో వెదికాడు. ఆశ్చర్యం అనిపించింది. సంఖ్య తక్కువలో లేదు. అన్ని రాష్ట్ర జాతీయ రహదారుల్లో ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. చాలా వరకూ అప్రమత్తత, వైద్యశాలకు చేరటంలో జాప్యం, సమయానికి అందని వైద్యం .. కారణాలు కావచ్చు. కానీ, ప్రమాదానికి మూలకారణాలుగా చాలా విషయాల్లో వేగం, మొబైల్ వాడకం, తాగి నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకపోవడం వంటి నిర్లక్ష్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రామన్ మనసులో ఆలోచనలు ఓ స్థిర రూపాన్ని ఏర్పరిచాయి.

***

కిరణ్ ను పిలిచాడు క్యాబిన్ లోకి రామన్. తన ఆలోచన చెప్పాడు. కిరణ్ మద్దతును కోరాడు.

ఆ రోజు సాయంత్రం ఆఫీస్ అవగానే స్టాఫ్ ను అందరినీ ఒకచోట సమావేశ పరిచాడు కిరణ్. అక్కడ రామన్ తను సేకరించిన సమాచారాన్ని ప్రెజెంట్ చేసాడు. అందరికీ తెలిసిన విషయమైనా ప్రమాదాల స్టాటిస్టిక్స్ చూస్తూ ఆశ్చర్యపోయారు స్టాఫ్.

రామన్ వారందరినీ ఉద్దేశిస్తూ  "మొన్న మన రవి, నిన్న గిరి .. మనతో పాటే ఉన్న వాళ్ళు ఇపుడు లేరన్న బాధ హృదయాన్ని తొలచివేస్తోంది. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ, మనకు తోచిన ముందడుగు ఒకటి వేద్దాం . దానికి మీ అందరి సహకారం కావాలి" అని గద్గద స్వరంతో చెప్పాడు .

ప్రతీ ఒక్కరి కళ్ళల్లో కన్నీరు, మరేం చేద్దాం అన్న ప్రశ్న ఒకేసారి వచ్చాయి.

వెంటనే రామన్, కిరణ్ కలిసి తమ ఆలోచనలను వారి ముందు పెట్టారు.

"నాకు తెలిసిన డాక్టర్ ఫ్రెండ్స్ ఉన్నారు. వారితో మాట్లాడాను. మా బంధువుల్లో ఉన్న వైద్యుల్ని కలిసాను. అందరూ ముందుకు రావడానికి ఒప్పుకున్నారు. మీరు, మీకు తెలిసిన ఫ్రెండ్స్, వారి స్నేహితులు, బంధువులు, సమాజ సేవకులు అందరినీ సమాయత్తం చేద్దాం.." చెప్తూ అందరి వైపూ చూస్తూ తన అభిప్రాయాల్ని వాళ్ళ ముందుంచుతున్నాడు రామన్.

"మనమందరం కలిసి ఒక స్వచ్ఛంద సహాయ కేంద్రాన్ని ప్రారంభిద్దామని ఆలోచన. ప్రతీ వారం ప్రమాదాల నివారణకై ప్రతీ చోటా సందేశాలిద్దాం. అవేర్నెస్ పెంచుదాం.  చెప్పడమే కాదు అవసరమైన సాయాన్ని అందిద్దాం. అందుకు "నడిచే వైద్యశాల" ను ప్రారంభిద్దాం. వాటిని మనమే నిస్వార్థంగా అందరి సహకారంతో నడుపుదాం.  ఇది అన్ని పట్టణాల్లోనూ చేరేట్టుగా ప్రభుత్వాన్ని కోరదాం" చెప్పాడు రామన్ .

"ఇది ప్రభుత్వ బాధ్యత కదా .. వాళ్ళు చూడాలి కదా..?"  స్టాఫ్ లోని ఒక అకౌంటెంట్ తన అనుమానాన్ని వ్యక్తం చేసాడు.

"అవును .. ఐనా వైద్యం సకాలంలో అందడానికి ప్రభుత్వం తమ పనులను చేస్తోంది. మనం వారికి ఉడతా భక్తితో సహకరిద్దాం. చూసిన ఘటనల్లో జరిగిన జాప్యం ముందెవరికీ జరగకుండా చూడాలని మన ప్రయత్నం. మన మంచి ఉద్దేశ్యానికి ప్రభుత్వ సహకారం కూడా ఉంటుంది.  నాకు తెలిసిన స్నేహితుల ద్వారా ప్రభుత్వం నుంచి సహాయానికి యత్నిస్తాను.  వలంటీర్స్ గా మీరు ముందుకు రావాలి.  ఒక్కొక్కరు మరో ఐదుగురిని చేర్పించండి. సోషల్ మాధ్యమాలను ఈ కార్యక్రమం కోసం సరైన దిశలో వాడుకుందాం. మరో  రవి,  గిరి ఇలా దూరమవడానికి వీల్లేదు. మన నడిచే వైద్యశాల వాహనాలు హైవేలో ఉంటాయి. వాటికి ఒక హెల్ప్ లైన్ నంబరు తీసుకుందాం. ఫోన్ అందిన పది నిముషాల్లో చేరే విధంగా అన్నీ చూద్దాం. అసలు ప్రమాదాలే జరగకుండా ఉండేలా చర్యలకై అలోచిద్దాం!"  చెప్తున్న రామన్ మాటలు అందరికీ నచ్చాయి.

సమాజం మనకేమిస్తుందా అన్న ఎదురు చూపు బదులు, మనమేమిస్తున్నాం అనే దిశలో అవసరమైన ప్రణాళికతో సాహసంగా ముందుకు వచ్చిన రామన్, కిరణ్ ఆలోచనలకు  అందరూ ఏకగ్రీవంగా డొనేషన్లు ప్రకటిస్తూ మద్దతు పలికారు.

***

"హలో అయ్యా.. ఎపుడూ యాక్సిడెంట్స్ అయ్యే ఈ రోడ్ లో చానా రోజుల తర్వాత ఈవేళ ఓ చిన్న ప్రమాదం జరిగిందయ్యా. వాడెవడో తాగుతూ నడపడంతో జరిగినాది. మీరెంటనే రండయ్యా.."

ఫోన్ కాల్ అందుకున్న హెల్ప్ సెంటర్ వలంటీర్ అడ్రస్ కనుక్కుని ఆ దగ్గరలో ఉన్న "నడిచే వైద్యశాల" అంబులెన్స్ కు వివరాలందించాడు.  ఐదు నిముషాల్లో ప్రమాద స్థలానికి చేరుకుంది వాహనం. అందులోని వైద్యులు వెంటనే అవసరమైన వైద్యంతో  స్పందించారు.

ఈ హెల్ప్ సెంటర్, నడిచే వైద్యశాలలు ప్రారంభించాలన్న  రామన్, కిరణ్ సాహస నిర్ణయం అమలు సమాజానికి ఉపయోగపడుతోంది. వారి ఆలోచన కార్యరూపంలో వచ్చింది.

నడిచే వైద్యశాలలు ఇపుడు అన్ని రాష్ట్రాల్లోనూ వలంటీర్స్ తో  వచ్చాయి.  ఆ అంబులెన్స్ ల లోనే ఐసీయూ, టెస్టింగ్స్, ఆపరేషన్ వ్యవస్థ సిద్ధం. ప్రమాదం జరిగిన చోటే అత్యవసర వైద్యం అందించటం. ప్రాణాన్ని కాపాడటం.  ఈ కాన్సెప్ట్ నచ్చిన ప్రభుత్వాలు వారికి అవసరమైన అన్ని పర్మిషన్‌లూ, వసతులూ ఇచ్చాయి. సోషల్ మాధ్యమాల్లో ప్రచారం సఫలమౌతోంది.  ఎందరో యువకులు, వయస్కులు అందులో చేరారు.

ఈ సంవత్సరం ప్రమాదాల స్టాటిస్టిక్స్ తగ్గుముఖం పడుతోందని వార్తలు చదువుతూ రామన్,  కిరణ్  ఇద్దరూ రహదారుల్లో ప్రమాద రహిత ప్రయాణాలకై ఇంకా ఏమేమి చేయాలో ఆలోచిస్తూ, ఇంకొన్ని అడుగులు ముందుకేయాలని నిర్ణయించుకున్నారు. వారికి మద్దతుగా ఎంతో మంది వలంటీర్లు సుముఖతతో సిద్ధంగా ఉన్నారు.

'ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న' నిజమౌతూ కనిపిస్తోంది.

***0***

మూడవ బహుమతి

# సహానుభూతి



డాక్టర్ ఎమ్. సుగుణరావు

మూడవ బహుమతి

# సహానుభూతి

డాక్టర్ ఎమ్. సుగుణరావు



ఆ ఇంట్లో ఆ ఇద్దరి గుండె చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం. క్షణక్షణం తమ చరవాణి వంక పదే పదే చూసుకుంటున్నారు. ఆ ఇద్దరితో పాటూ ఆ ఇంటికి వచ్చిన వారి బంధువు ఇందుమతికీ అదే పరిస్థితి. గోవిందరావు, రుక్మిణి తమ పెద్ద కొడుకు మహేష్ కోసం గుమ్మం ముందు నిలబడ్డారు.

ఆ రోజు తమ రెండో కొడుకు పదేళ్ళ నరేష్ పుట్టినరోజు. వాడి స్నేహితులంతా ముందు గదిలో అసహనంగా కూర్చున్నారు. వారి ఎదురుగా ఉన్న కేక్! నరేష్ ఎప్పుడు కేక్ కట్ చేస్తాడా! ఎప్పుడు ఆ కేక్‌తో పాటూ తమకు చాక్లెట్లు, స్వీట్లు పంచుతారా అని ఎదురు చూస్తున్నారు, ఆ చిన్నారులు. అయితే అన్నయ్య వచ్చేవరకూ కేక్ కట్ చేయనని భీష్మించుకు కూర్చున్నాడు నరేష్.

రోజూ మధ్యాహ్నం రెండు గంటలకల్లా మహేష్ ఇంటికి చేరుకుంటాడు. అతను ఆ ఊళ్ళోని ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే అతను ఆ రోజు నాలుగైనా ఇంటికి రాకపోవడంతో అంతా ఆందోళనగా అతడి కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా వారు భయపడే విషయం, మహేష్ ఫోన్ ఎత్తడం లేదు.

అలా పెద్ద కొడుకు గురించి బెంగతో తల్లడిల్లుతున్న రుక్మిణితో "అన్నయ్య ఎప్పుడొస్తాడమ్మా?!" అన్నాడు నరేష్.

వాడు అన్నయ్య గురించి అలా ఆరా తియ్యడం అది పదోసారి. రుక్మిణికి కోపం వచ్చింది. "అన్నయ్య... అన్నయ్య... నీ కిదేం పిచ్చిరా... తెల్లవారి లేచిన దగ్గర నుంచీ అన్నయ్య జపం..." విసుక్కుంది ఆమె. వాడు బుంగమూతి పెట్టాడు.

ఇందుమతికి వాడిని చూస్తే జాలేసింది. "భలే వుందిరా నీ డ్రెస్. జీన్స్, టీ షర్ట్" అంది వాడిని దగ్గరకు తీసుకుంటూ.

"అన్నయ్యే సెలక్ట్ చేసాడు. బావుందా ఆంటీ" అన్నాడు హుషారుగా.

"సూపర్" అంటూ వాడి బుగ్గ మీద ముద్దు పెట్టింది. వాడు లోపల వున్న తన స్నేహితుల దగ్గరకు పరిగెత్తాడు. ఇందుమతి పక్కింటి వాళ్ళమ్మాయి. రుక్మిణీ తోటిది. తను బొంబాయిలో వుంటుంది, భర్త ఉద్యోగరీత్యా. ఆమె కూడా ఒక కార్పొరేట్ స్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తుంది. ఎవరిదో పెళ్ళి కోసం వచ్చింది. వారిని కలిసి చాలా సంవత్సరాలయింది. రుక్మిణీ పిల్లలిద్దరినీ చూసి ముచ్చటపడిపోయింది. ఇద్దరి మధ్యనా పది సంవత్సరాల తేడా ఉండడంతో ఆమెకో సందేహం వచ్చింది. అది అడగాలా వద్దా అనే మీమాంసలో వుందామె. వారం నుంచీ ఆమె మనసులో ఆ ప్రశ్న మెదులుతోంది. అడిగితే ఏం అనుకుంటారో అనే భయంతో అడగలేకపోతోంది.

ఇంతలో గోవిందరావు ఫోన్ రింగయ్యింది. "వస్తున్నా పావు గంటలో..." ఫోన్ పెట్టేసాడు. వెంటనే తన బండి తీసి బైటకు పోనిచ్చాడు.

"ఏమండీ ఏమయ్యింది?!!" అంది కంగారుగా రుక్మిణి.

"ఏమీ లేదు. వాడి కాలేజీకి వెళుతున్నాను. ఏదో చిన్న ప్రోబ్లెమ్. కంగారు పడవలసింది లేదు. నువ్వు లోపలకు వెళ్ళు. పిల్లలకు ఏమైనా పెట్టండి" అంటూ స్కూటర్ వేగంగా పోనిచ్చాడు.

"ఏమయ్యిందో" అనుకుంటూ ఆమె ఇంట్లోకి వెళ్ళింది దిగులుగానే.

"అన్నయ్య వచ్చేస్తాడా?!" అన్నాడు బైటకు చూస్తూ నరేష్.

"వచ్చేస్తాడు లేరా, నాన్నగారు వెళ్ళారు, అన్నయ్యను తీసుకురావడానికి" అంటూ వాడిని దగ్గరకు తీసుకుంది.

ఇందుమతి పిల్లలకు అంత సేపు కూర్చోవడం విసుగ్గా వుంటుందని, కొన్ని నర్సరీ రైములు, కథలు చెప్పింది.

అరగంట తర్వాత మహేష్ వచ్చాడు. తండ్రితో రాగానే నరేష్ అన్నయ్యను చుట్టేసాడు తన చిట్టి చేతులతో -

పదేళ్ళ తమ్ముడిని ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు మహేష్. నరేష్ కేక్ కట్ చేసాడు. స్వీట్లు చాక్లెట్లు తీసుకుని పిల్లలు వెళ్ళిపోయారు.

వెంటనే అడిగింది రుక్మిణి. "ఏంటీ కాలేజీలో గొడవ?!" అని.

"వాళ్ళ కాలేజీలో ఒక కుర్రాడు బస్ ఎక్కుతుంటే డ్రైవర్ ఆపకుండా వెళ్ళిపోయాడు. వాడు పడిపోవడంతో దెబ్బలు తగిలాయి. అందుకే మహేష్ ఇంకా కొంతమంది విద్యార్థులు ఆ బస్ ఆపేసి, డ్రైవర్‌ని క్షమాపణ

చెప్పమన్నారు. పోలీసులొచ్చారు. మొత్తానికి గొడవ సద్దుమణిగింది. శుభం కార్డు పడింది" అన్నాడు ఆమె భర్త.

"ఒరేయ్ నీకెందుకురా లేనిపోని గొడవలు" కోప్పడింది రుక్మిణి.

"బస్ ఎక్కలేక పడిపోయి, దెబ్బలు తిన్నవాడు ఎవరనుకున్నావ్?!" అన్నాడు మహేష్ తల్లితో -

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

"వాడు దివ్యాంగుడమ్మా..."

రుక్మిణితో పాటూ ఇందుమతి కూడా ఆ సమాధానానికి ఉలిక్కిపడింది. రుక్మిణి కొడుకు తల నిమురుతూ "నువ్ సూపర్ నాన్నా" అంది. అంతా భోజనాలు చేసారు. పిల్లలిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మంచం ఎక్కారు నిద్రపోవడానికి.

రుక్మిణి వంటగదిలోకి వెళ్ళింది, పాత్రలు సర్దడానికి. ఇందుమతి ఆమెను అనుసరించింది. ఇక అడిగేయాలనుకుంది తనలో మెదిలే ప్రశ్నను -

ఉపోద్ఘాతంగా, "మీ ఇద్దరి పిల్లలకు వయసులో పదేళ్ళ తేడా వున్నట్టుంది. చిన్నాడు బాగా ఆలస్యంగా పుట్టాడనుకుంటున్నాను" అంది.

"వాడు నాకు పుట్టలేదు!" అంది రుక్మిణి.

ఆశ్చర్యంగా చూసింది ఇందుమతి.

ఔను... పెద్దాడు పుట్టిన తర్వాత, నాకు గర్భసంచిలో సమస్య వచ్చి తీసేసారు. ఇక పిల్లలు పుట్టరని పెద్దవాడు ఒంటరై పోతాడని, వీడిని తెచ్చి పెంచుకున్నాము" అంది రుక్మిణి చిన్నగా నవ్వి.

"'మరి!!!?" మనసులోని తన మీమాంసను బయటపెట్టాలా, వద్దా అనే సందిగ్ధంతో అలా అడిగింది ఇందుమతి.

"అర్థమయింది. మీ మనసులో ఏం వుందో?! ఏం అడగాలనుకుంటున్నారో. చాలా మంది ఇదే ప్రశ్న అడిగారు. అయితే 'అనాథ శరణాలయంకు వెళ్ళి చాలామందిని పిల్లలను చూసాము. పెద్దాడు మాత్రం వీడినే సెలక్టు చేసుకున్నాడు. 'నన్ను ప్రేమగా చూసుకుంటున్నారు కదమ్మా. వీడిని అలాగే చూద్దాం' అన్నాడు" అంది, ఆమె కన్నీళ్ళు తుడుచుకుంటూ -

ఆ మాటలకు ఇందుమతికీ కళ్ళంట నీళ్ళొచ్చాయి. తను పిల్లలకు చెప్పే ఒక ఇంగ్లీషు కథ గుర్తొచ్చింది. ఒక పిల్లవాడు, కుక్కను కొందామని, కెన్నెల్ క్లబ్‌కు వెళతాడు. అక్కడ సరిగ్గా నడవలేని వైకల్యం వున్న కుక్కను ఎంపిక చేసుకుంటాడు. ఆ కుర్రవాడిని చూసి జాలిపడిన ఆ షాపు యజమాని పోలియోతో నడవలేని ఆ అబ్బాయికి బహుమతిగా ఆ కుక్కపిల్లను ఇచ్చేస్తాడు, ఉచితంగా -

ఇప్పుడు పెద్ద కొడుకు మహేష్ అదే పని చేసాడు. వీడికి చిన్నప్పటి నుండి పోలియో. అనాధ శరణాలయం నుంచి తన లాగే దివ్యాంగుడైన ఈ నరేష్ ని తమ్ముడిగా తెచ్చుకున్నాడు. అతని సహానుభూతిని అర్థం చేసుకున్న ఈ తల్లిదండ్రులది ఎంతటి గొప్ప మనసు. ఒక దివ్యాంగుడైన కొడుకుతో మానసిక క్షోభ పడుతూ, ఇంకో దివ్యాంగుడైన పిల్లవాడినే రెండో కొడుకుగా స్వీకరించిన వీరిది ఎంతటి మనోధైర్యం.

- వెంటనే ఇందుమతి ఎదురుగా వున్న రుక్మిణిని బలంగా హత్తుకుంది.

ఆ తరువాత ఇందుమతి పిల్లలిద్దరూ పడుకున్న బెడ్‌రూమ్ లోకి వెళ్ళింది. ఒకరి చేతిలో ఒకరి చేయి వేసి పడుకున్నారు, ఇద్దరూ ఒకరి కోసం ఒకరిలా. ఆమె కళ్ళు తుడుచుకుంది. తను ఇంగ్లీష్ పాఠం చెప్పే విద్యార్థులకి ఎంపతీ గురించి వివరంగా చెప్పేందుకు ఆమెకు ఇద్దరు పిల్లల కథ దొరికింది.


ఎంపతీ అంటే సహానుభూతి... సింపతీ అంటే సానుభూతి. సానుభూతి చూపడమంటే ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడం... సహానుభూతిలో ఎదుటివారి బాధలు పంచుకుంటాం...

ఇందుమతికి పిల్లలకు చెప్పడానికి ఈ సహానుభూతి గురించిన అద్భుత విషయం బాగా అర్థమయ్యింది నరేష్ మహేష్ లను చూసి.

***0***

# దిగుడు మెట్లు

ఇరిగినేని హనుమంతరావు



గోడలకు దట్టంగా పాకిన పచ్చని తీగలు, కుండీల్లో ఏపుగా పెరిగిన పూల మొక్కల మధ్య నుండి మేఘాలకు వేసినట్లుండే మేడ మెట్లు. నిజానికి ఈ మేడకు మెట్లే అందం. దూరం నుండి చూడ్డమే కానీ ఎప్పుడూ ఎక్కిన పాపాన పోలేదు. పాపాలు చేస్తున్నవారేమో పైన, వాటిని మోస్తున్న నాలాంటి వారేమో కింద. దేవుడి సృష్టి తలకిందులుగానే ఉందనడానికి ఇంతకంటే నిదర్శనం ఉంటుందా? పోన్లే... ఇన్నాళ్ళకి ఆయనకి తన తప్పును సరి చేసుకునే అవకాశమొచ్చింది. భయంతోనో, బాధ్యతతోనో పెళ్ళాం మత్తును సమకూరిస్తే, దాన్ని గౌరవించి దేవుడు ధైర్యాన్నిచ్చాడు. ఇక ఆలస్యం చేసే అవసరం లేదు. మేడమీది సౌందర్యాన్ని చేరుకోవడం, లెక్కలు సరి చేయడమే మిగిలింది.

ఒకటా రెండా ఎన్ని అవకతవకలు. అందంలో సమవుజ్జీ అయినా చదువులో తూగదు. గుణం ప్రస్తావన లేనిదే నయం. డబ్బొక్కటే అదనం. అదీ నీచపు సొమ్ము. దానికి సరిపడా పొగరు తలలో పోగు పడింది. ఆరు నెలలుగా కారులో కలిసే ప్రయాణిస్తున్నా, అంగుళం సందు ఇచ్చింది కాదు. ఎంత దగ్గరగా మెసలే ప్రయత్నం చేసినా ఇద్దరి మధ్య దూరాన్ని మాత్రం పెంచుతూనే పోతోంది.

ఏమాటకామాటే. అన్నిటినీ మరచిపోగలిగిన అందమే. మెల్లగా మెట్లెక్కుతూ మేఘమాలిక గురించి ఊహించుకుంటుంటే ఒంట్లోని కైపు రెట్టింపౌతోంది. మనసు గాల్లోనూ, కాళ్ళు మెట్లపైనా తేలుతూ ఉండగా, అక్కడున్న కుండీ నా మోకాలి బలాన్నీ, దాన్లోని గులాబీ ముళ్ళు, చేతి రక్తాన్నీ పరీక్షించాయి. లంకంత కొంపలో ఎక్కడా చోటు దొరకనట్టు దారికడ్డంగా పెట్టారు. కుండీని ఒక్క తాపు తన్నాను. పెళ్ళుమని పగిలిన శబ్దం వినిపించింది. పైకి ఎక్కుతుంటే పగిలింది కుండీయేనా అనే సందేహం వచ్చింది. మోకాలు ఒకటే సలుపుతోంది. డబ్బు వాసన తగిలితే రాళ్ళూ మొక్కలూ కూడా రక్తాన్ని తాగుతాయి కాబోలు.

నా కలల మెట్లు ఎక్కేశాను. మిగిలింది ఒకటే ఇక. చుట్టూ చూశాను. తలుపేదో కిటికీ ఏదో తెలియకుండా ఒకటే దొంతరలు. అవి పెట్టలేని స్థలాల్లోనే గోడలు కట్టినట్లున్నారు. కళాత్మకతకు దగ్గరయ్యే కొద్దీ ఇంగితజ్ఞానానికి దూరమౌతారేమో!

"ఎవరదీ?" కేక వినబడింది. మనిషి అలికిడిని పసిగట్టినట్లుంది.

"నేను రమణను మేడ...మ్" పూర్తయేంతలో తలుపు తెరుచుకుంది. కారెక్కిన ప్రతిసారీ నన్ను మత్తెక్కించే పరిమళం ముందుగా పలకరించింది. గులాబి రంగు నైటీలో రాసి పోసిన సౌందర్యం తర్వాత దర్శనం ఇచ్చింది. ఇంత సూటిగా, ఘాటుగా చూడ్డం ఇదే మొదటి సారి. నోరు తెరుచుకుని ఉండిపోయాను.

“తాగొచ్చావా?”
“ఒచ్చాక తాగే సౌఖ్యానికీ, తాగింతర్వాత నువ్వు చేర్చే స్వర్గానికీ నేన్నోచలేదు కదా?” అనుకోగానే నవ్వొచ్చింది.
“ఒక్క నిమిషం! ఎలాగూ వచ్చావ్ కదా! చేతులు శుభ్రంగా కడుక్కొని వైన్ బాటిల్ ఓపెన్ చేసి పెట్టు.”
మామూలుగా ఐతే వైన్ బాటిల్ క్యాప్సూల్ తొలగించి కార్కును తీయటం మహా సరదా నాకు. కానీ ఆ స్వరంలోని అహంకారానికి నాకెక్కడో అంటుకుంది. కసినీ, కోపాన్నీ తొక్కి పెట్టి కోరికను మాత్రమే ముందుకు నెట్టాను. అటో ఇటో తేల్చుకునే వెళ్ళాలి. వాంఛతో ఉన్నప్పుడు ఓపిగ్గానే ఉండాలి కదా!
“మేడమ్... నేను మురళితో మాట్లాడాను.” కార్క్ తీస్తూ మొదలు పెట్టాను.
“ఏం మాట్లాడావ్? అయినా నాకెందుకు చెప్తున్నావ్?” చిరాగ్గా అడిగింది.
“మీకిప్పుడు అవకాశాలా... పెద్దగా లేవు. అప్పుడప్పుడూ ఆడీ కారు సారు ఇంటికి రావడం, నెలకు మూణ్ణాలుగు సార్లు నేను మిమ్మల్ని స్టార్ హోటల్లో దిగబెట్టడం తప్ప మీకేమీ వ్యాపకాలు ఉన్నట్లు అనిపించదు. మీరిప్పుడు ఏంచేస్తున్నారోనని ఒకటే సందేహం. మురళితో మాట్లాడితే పరిష్కారం అయింది.”
ధైర్యంగా కళ్ళల్లోకి చూశాను. ఏమాత్రం బెరుకు లేకుండా ఎలా ఉండగలుగుతోంది? అర్థం కాలేదు.
“తెలుసుకుంటే నీకేమిటి లాభం? సినీ తార మేఘమాలిక అసలు జీవితం ఇదీ... అని చాటింపేస్తావ్? అంతేనా!” మొఖంలో చూపిన అసహ్యం అందాన్ని మింగేసింది.
“ఛ...ఛ... నేనలాంటివాణ్ణి కాను. చదువుకున్నాను. కాలం కలిసి రాక ఇలా ఉన్నాను కానీ సభ్యతను కోల్పోలేదు.”
“ఓహో అలాగా!” విరగబడి నవ్వింది. నవ్వులోని సంకేతాన్ని భేదించలేక పోయాను.
“సిట్టింగ్ కోసం ఎంత ఖర్చు చేశావ్?” వెటకారం ధ్వనించింది.
“రెండు వేలు” రంగులు మార్చేందుకు నటుణ్ణి కాదు కదా. మామూలుగానే అన్నాన్నేను.
“నీ కూతురుకి బాగోలేదని, ఆ రెండువేల కోసం, నేనొచ్చేంతవరకు నా ఇంటి గుమ్మం దగ్గర పడిగాపులు కాసింది నీ పెళ్ళాం. నువ్వేమో పనికిమాలిన పరిజ్ఞానం కోసం డబ్బులు తగలేస్తున్నావ్. లలితకు నిన్ను భరించడం ఎందుకు కష్టమౌతోందో తెలుస్తోంది.”
“నీతులు చెప్పే అర్హత నీగ్గానీ, వినే అవసరం నాగ్గానీ లేవు మేడమ్!” ఆత్మాభిమానాన్ని చాటుకున్నాను. కొంచెం పైచేయి అనిపిస్తే చాలు. అవకాశాలు సృష్టించుకొని మరీ ఉపదేశాలిస్తారు. ఎదుటివారికి అవసరమా లేదా అని కూడా ఆలోచించరు.
“ఇడియట్... మర్యాదగా బయటకి నడువ్!” కోపంలో అధికారాన్ని కలిపింది.
“ఒళ్ళమ్ముకొనే ఆడదానికి ఈ అభిజాత్యం పనికిరాదు” నేనేమీ తగ్గలేదు.
అంతే నా మీదకు దండెత్తి నా చెంప పగులగొట్టింది. నాకు ఊహ తెలిసిన దగ్గర నుండీ నాపై చెయ్యెత్తిన వారే లేరు. పగలూ రాత్రీ పేకాడి, ఇంటికి సరిగా రాని కాలంలో కూడా మా నాన్న నన్ను దండించలేదు.

అలాంటిది, ఒక మగాడి మీదకు... కేవలం ఒక ఆడది... అందునా బజారుది... ఎగబడి దాడి చేయడమా? బిత్తరపోయాన్నేను.

“నాకు అమ్ముకునేందుకు ఒళ్లైనా ఉంది. నీ దగ్గరేముంది. నీ తండ్రిచ్చిన ఆస్తుల్ని ఏనాడో అమ్మేశావ్! నీ పెళ్ళాం రక్తాన్ని కరిగిస్తే తినగలుగుతున్నావు. నీకు ఉద్యోగం ఇచ్చింది కూడా ఆ పిచ్చిదాని మొఖాన్ని చూసే!”

నా పెళ్ళాం ముం... నా బతుకును మొత్తం దీని ముందు పరిచింది కాబోలు. మొగుడి గౌరవాన్ని కాపాడలేని పెళ్ళామూ ఒక పెళ్లామేనా? వాతలు పెట్టినంత మాత్రాన అదుపులో ఉంచినట్లు కాదని రూఢీ అయింది.

“బాగా చదువుకున్నానని పొగరు కదా. కనీసం నీ చదువును అమ్ముకొని ఒక ఉద్యోగం సంపాదించగలవా? అది చేతకాదు కానీ కొత్తగా ఏదో కనిపెట్టినట్లు కొలంబస్ అవతారమొకటి!” ఈసడించుకొంది.

నేను మోస్తున్న రహస్యానికి కృతజ్ఞతతో తేలికగా లొంగిపోతుందనుకొన్నాను. విషయాన్ని వదిలేసి ప్రవచనాలు వింటూ కూర్చున్నాను. మా నాన్న నన్ను చూసి అయోగ్యుణ్ణని బాధపడినప్పుడు ఏంటో అనుకున్నాను. ఆయన బాధలో న్యాయం ఉంది. ఇక అనవసరం. రంగంలోకి దూకాను.

“ఇవన్నీ ఎందుకు? అమ్ముకునేందుకు నీ వస్తువు నీకుంది. కొనేందుకు నాకు శక్తి ఉందో లేదో చూస్తాను. రేటెంతో చెప్పు?” తెగించాన్నేను.

“ఆపేయ్...!” గర్జించింది. “నీకు తెలివి లేదని వేరే రుజువులు అవసరం లేదు. లోకాన్ని చూసి ఏం నేర్చుకున్నావ్. ఆఫ్ట్రాల్ నువ్వో డ్రైవరువి. నీతో కలిసి తినటానికి కూడా ఇష్టపడను. అలాంటిది పడక దాకా ఎలా రానిస్తాననుకున్నావ్!” అని గేలి చేసి, నన్ను బయటకు తోసి తలుపేసుకుంది.

నడుస్తున్నానే గానీ మనసు మనసులో లేదు. దీని దగ్గర డ్రైవర్ని కాబట్టే కదా దీనికింత లోకువ. ఇలాంటి దిక్కుమాలిన ఉద్యోగాలు నేను చేయనే... అని మొత్తుకుంటే లలిత వినలేదు. నాకు తెలివి లేదా? అందాన్ని దగ్గరగా చూడొచ్చులే అని సరి పెట్టుకొన్నందుకేగా పరాభవం. లాభం లేదు. దీని పీచమణచాల్సిందే. తీర్మానించుకున్నాను. నా జీవితానికో లక్ష్యం లేదని మా నాన్న ఎప్పుడూ బాధ పడేవాడు. లక్ష్యం మెదడులో స్థిరపడింది. పై లోకాల్లో ఉన్న తను ఇకకైనా సంతోషిస్తాడు.

కిందకు దిగుతుంటే మెట్లపై లలిత ఎదురు పడింది. ‘నువ్వు పైకెందుకెళ్ళావ్’ అని ప్రశ్నించింది. ఆ మేడేదో వీసా తీసుకొని ఎక్కాల్సిన విమానమయినట్టు.

“నీకనవసరం. నువ్వెళ్ళి నీయమ్మకి సేవ చేసుకో!” అని విసురుగా వచ్చేశాను. మొగుణ్ణి అగౌరవపరచిన పరాయిదానికి పెళ్ళాం సేవలు చేస్తే, ఉప్పూకారం తినే ఏ మనిషైనా సహించలేడు.

మేడకు ఓ వంద గజాల దూరంలో, మేముండే వెలిగృహం ఎన్నడూ అనిపించనంత చిన్నదిగా అనిపిస్తోంది. అసలీ డబ్బున్న వాళ్ళంతా అదో రకం! వాళ్ళ ఇళ్ళకు బయటి ప్రపంచం కనబడనంత ఎత్తుగా ప్రహరీ గోడలు లేపేసి, ఆ కొంపలకు దూరంగా ఓ వెలి కొంపను కట్టి, అందులో నష్ట జాతకుడు ఒకణ్ణి కట్టేసి, వైభోగం

వెళ్ళబోస్తారు. గుడిసెలోని గరీబును చూసి చంకలు గుద్దుకుంటారు. ఏతావాతా తేలేదేమంటే డబ్బూ, అదృష్టమూ ఇత్యాదులన్నీ సాపేక్షాలే. చిన్న గీత పక్కన పెద్ద గీత.

లలిత తిరిగొచ్చాక పెద్ద రభసే చేసింది. "అమ్మగారితో ఏం మాట్లాడావ్?" అని నిలదీసింది. తెలిసీ అడగడం తప్పని తెలియని అజ్ఞాని. నేను కాబట్టి సరిపోయింది గానీ, మరొకడు మరొకడు అయితే ఎప్పుడో వదిలించుకునే వాడు.

"అదటుంచు...దాన్ని నువ్వు గారూ గీరూ అని పలకడం నాకు నచ్చదని చాలా సార్లు చెప్పాన్నీకు. అసలదేం చేస్తుందో తెలుసా? ఈ కొంప ఎవరిదో తెలుసా? ఆడీ కారు ముసలాడొకడు వస్తాడు చూడు. వాడిది. వాడో ప్రొడ్యూసరు. దీన్నుంచుకున్నాడు. కొంప దీని పేర్న రాశాడు. ఇదేమో నంగనాచి మొఖమేసుకొని, అవకాశాల కోసమని అందరి చుట్టూ తిరుగుతూ, పన్లో పనిగా రంకు నడిపేస్తోంది. ఈ సంగతి ఆ ముసలి వెధవకి తెలీదు. దీని వ్యాపారంలో మురళి గాడొక నిరంతర శ్రామికుడు. ఒడుపుగా ఎరవేయడం, గాలానికి చిక్కిన వాడి పుట్టు పూర్వోత్తరాలు పరిశీలించడం, వాడికి ఆరోగ్య పరీక్షలు చేయించడం, వాడి ఆకారాన్ని బట్టి డబ్బులు గుంజేయడం. ఇలా ఒకటేమిటి. వాడి నిర్వహణకు పేటెంట్ హక్కులు కూడా ఇవ్వొచ్చు" ఇంత చెప్పాక లలితకు తప్పక జ్ఞానోదయం అవుతుందనుకొని పొరబడ్డాను.

"అవన్నీ నాకు తెలుసు. అయినా... ఆవిడ ఎలా తిరిగితే నీకెందుకు? నీకొచ్చిన నొప్పి ఏంటి?" మూర్ఖపు ప్రశ్న వేసింది.

"ఏంటే పిచ్చిదానా... నా డబ్బుల్తో తాగొచ్చినా, పేకాడేందుకు డబ్బులడిగినా, తప్పొప్పుల ప్రసంగాలు చేసే నువ్వు దాని తప్పును సమర్థిస్తున్నావా? సిగ్గు లేదూ...! నాకొచ్చిన నొప్పి చెప్పనా? దాన్ని హోటళ్లకు తీసుకుపోయి దాని పాపంలో పాలు పంచుకుంటున్నాను కదా? ఇంకో పాపంలో కూడా వాటా అడిగాను. తప్పేంటందులో!"

"అయ్యో దేవుడా...! నీతో వాదించే శక్తి నాకు లేదు. అన్నం పెట్టిన చేతిని నరికే పాపంలో నేను భాగం పంచుకోలేను. నిన్నిక భరించే ఓపిక నాకు లేదు. నువ్వు చేసిన వెధవ పనికి, నా ముందు రెండే దారులు. ఒకటి... నా బిడ్డకూ నాకూ ఇంత విషమిచ్చి చంపేయడం. రెండు... మా మానాన మమ్మల్ని వదిలి నువ్వెళ్ళిపోవడం. దయ చేసి ఏదో ఒకటి చేసి పుణ్యం కట్టుకో!" చేతులు జోడించింది.

ఆ రాక్షసే దీనికి నేర్పి ఉండొచ్చు. జూదమంటే ప్రాణం పెట్టే నేను, ఆస్తులన్నీ పణంగా పెట్టినా... నోటికడ్డంగా పెట్టుకున్న కొంగును తీయలేని అశక్తురాలైన ఆడది, నన్ను వెళ్ళమనేదాకా వచ్చిందంటే ఇది ఖచ్చితంగా దాని పనే...! అయినా ఇదీ ఒకందుకు మంచిదే...! నాకున్న లక్ష్యానికి సంసారం గుదిబండే కదా! చాలా మంది గొప్పోళ్ళు పెళ్ళాలను వదిలేశాకే వృద్ధిలోకి వచ్చారు. ఓ బుద్ధుడు. ఓ ప్రధాని. ఓ మనం. మనసు తేలిక పడింది. లక్ష్యాన్ని సాధించినప్పటి హాయి ముందే అనుభవంలోకి వస్తోంది.

అప్పుడు తండ్రి మాట విని రాముడు అడవుల పాలయ్యాడు. ఇప్పుడు భార్య మాటలు విని నేను రోడ్డున పడ్డాను. ఒక్కగానొక్క లక్ష్యాన్ని మాత్రమే వీపుకు కట్టుకొని, అన్నీ వదిలేసి వచ్చాను.

సాధారణ మార్గాల్లో డబ్బు సంపాదించేందుకు చాలా పనులే చేశాను. నాకున్న తెలివితేటలు వాడుకొని లబ్ధి పొందే భాగ్యం లోకానికి లేదని, నాకు చూచాయగా తెలిసిన విషయం ఇప్పుడు ఖాయమైపోయింది. ఇక ఈ జనాల అజ్ఞానాన్ని వాడుకొని పైకి రావాల్సిన బాధ్యత నాపై ఉంది.

ఏ లోకోద్ధారణ పథకమైనా పుట్టింటి నుండే మొదలు కావాలి. నా ఇంటిని ఏనాడో వీటికి వాడి ఉన్నాను గనక సరాసరి లలిత పుట్టింటికే వెళ్లాను. లలిత కొన్నింట్లో పద్ధతి గలదే. పొరపాటున కూడా నాపై చాడీలు చెప్పదు. అందులోనూ పుట్టింట్లో... ఛాన్సే లేదు. నేనిల్లు వదిలి వెళ్లానని అసలే చెప్పదు. వ్యాపారం ప్రారంభించబోతున్నానని ఓ రెండు లక్షలు అప్పుగా సర్దమని లలిత తండ్రిని అడిగాను. కళ తప్పిన నా మొహమో, పోషణ తగ్గిన దేహమో, తన అనుభవమో, నన్ను అనుమానంగానే చూశాడు. ఆ అపనమ్మకాన్ని అల్లానే వదిలేస్తే నా తెలివితేటలకది మచ్చే.

“మీకేమీ సందేహం అక్కర్లేదు. నేనిప్పుడు వేరే మనిషిని. చివరి అవకాశం అనుకొని, నా జీవితాన్ని మార్చుకునే అవకాశాన్ని నాకివ్వండి. ఓ వారం పోయాక మీరే వచ్చి చూడండి. నిజంగా మీ అమ్మాయి జీవితం కుదుటపడుతుందని మీకు నమ్మకం కలగక పోతే అడగండి.”

ఆర్నెల్లు సహవాసం చేస్తే వాళ్ళు వీళ్ళౌతారంటారు. నటితో ఆర్నెల్ల కారు ప్రయాణంతో నాకూ నటించడం వచ్చేస్తోంది. ముసలాడు మెత్తబడ్డాడు. కూతురి జీవితంపై ఆపేక్ష లేకుండా ఏ తండ్రీ ఉండగలడు.

కానీ ఓ మడత పెట్టాడు. డబ్బు నా ఖాతాలో కాక లలిత ఖాతాలో వేశాడు. ఆన్లైన్ గుట్టుమట్లన్నీ నాకు తెలిసినప్పుడు వ్యత్యాసమేముంది. లక్ష్య సిద్ధికి ఏర్పాట్లు మొదలెట్టాను. పెద్దమనిషిగా గుర్తించబడడం కష్టంతో కూడిన వ్యవహారమేమో గానీ, పెద్దమనిషిగా నటించడానికి పెద్ద ఖర్చేమీ ఉండదు. నా బాహ్యరూపంపై దృష్టి పెట్టాను. అసలు నేనెలా ఉండాలో అలా మారిపోయాను. మురళి గాణ్ణి లైన్లోకి తీసుకున్నాను. పూర్వపు ద్రవ పరిచయం పనికొచ్చింది. వాడూ సహకరించాడు. హాస్పిటల్లో ‘ప్రసాద్’ పేరుతో అన్ని పరీక్షలూ చేయించాడు. డబ్బు దాని ఖాతాలోకి బదిలీ చేశాను. మొత్తానికి అనుభవించే హక్కుని కొనుక్కున్నాను.

ఆడీ కారు ముసలాడు తప్పితే మిగిలినోళ్ళు హోటళ్ళకే వెళ్ళాలి. అదే నియమం. ఎందుకో మరి. నన్ను ఇంటికే రమ్మంది. డ్రైవరుతోనా... అని బీరాలు పోయిందిగా. నన్ను చూసాక దాని మొఖంలో ఎన్ని రంగులు మారుతాయో!. దాన్ని చూడాల్సిన రీతిలో చూసాక నా కళ్ళలో ఎన్ని వెలుగులో! అందరూ తెరపైన దాని అందాన్ని చూస్తే, నేను తెరచాటు అందాల్నీ కూడా చూస్తాను. పరవశంతో మెట్లెక్కుతున్నాను. మళ్ళీ మోకాలికి కుండీ తగలడం, గులాబీ ముళ్ళు చేతిని గీరడం జరిగిపోయాయి. ఫలితం కూడా మునుపటిదే రానుందా? అసంభవం. తమాయించుకున్నాను. డోర్ బెల్ మోగించాను.

“తెరిచే ఉంది.” మధువులూరే స్వరమది. పైసా చిలికిన పయోనిధి నుండి ఆ మాత్రం తీపి సహజం.

“వచ్చి ఆ సోఫాలో కూర్చోండి. టేబులుపై స్కాచ్ ఉంది. మీరు సిప్ చేస్తూ ఉండండి. ఇప్పుడే వచ్చేస్తాను.” లోపలి నుండే వినబడింది.

కొంత సమయం గడిచింది. ఉన్నట్టుండి కరెంటు పోయింది. మొత్తం చీకటి. కళ్ళ ముందు అందం- చేతిలో గ్లాసు- ఇదీ ఊహా చిత్రం. ఇప్పుడేమో ఇలా ఒంటరిగా... చేతిలోని గ్లాసు కూడా కనబడకుండా! ఇన్వర్టర్ ఉండాలిగా! ఇప్పుడెలా? రూలని చెప్పి మురళిగాడు ఫోన్ తీసుకున్నాడు. చిరాగ్గా అనిపించింది. మందు ఎప్పుడూ ఇచ్చే కిక్కుని నేను స్వీకరించడం లేదు.

"అయ్యో పవర్ పోయింది. ఇంట్లో కొవ్వొత్తులు కూడా లేవు. ఫోనేమో నిషేధం. ఒకరివల్ల ఇంకొకరికి ఇబ్బందులు రాకూడదనే ఆ నియమం. పవరొచ్చే వరకూ మాట్లాడుకుందామా?" అంటూ నా పక్కనే ఉన్న సోఫాలో కూర్చుంది. అదే పరిమళం... ఒక్కసారిగా తాకింది. ఇప్పుడు పూర్తిగా మత్తెక్కేసింది.

"ఏం చేస్తుంటారు ప్రసాద్ గారు."

"జీవిస్తుంటాను" అప్రస్తుతం అని తెలిసినా సమయ హరణం ఇష్టంలేక చెప్పాన్నేను.

"అద్భుతం. నేనేమో అటు జీవించే నైపుణ్యం లేక, ఇటు నటించే అవకాశాల్లేక త్రిశంకు స్వర్గంలో కాలం గడుపుతున్నాను" నవ్వింది.

"బయటకి కనబడని జీవితాన్ని పూర్తిస్థాయిలో నటిస్తూ జీవిస్తున్నారుగా!" వెటకారంగా అన్నాను.

"కాలయాపన ఇష్టం లేనట్లుంది. కోపం ధ్వనిస్తోంది. గదిలోకెళ్దాం లేవండి." నా సమాధానం కోసం చూడకుండా లేచి, నా చేయి పట్టుకొని నన్నో గదిలోకి తీసుకెళ్ళి మంచంపై కూర్చోబెట్టింది.

గడియ పెట్టిన చప్పుడైంది. దగ్గరగా వచ్చింది. నన్ను రెచ్చగొట్టే పరిమళం నన్ను నిలువనీయడం లేదు. మంచం పైకి ఎత్తి పడేసాను. నాకు పగ్గాల్లేవు. అటునుండి మాటల్లేవు. గర్వంగా నేను ముసుగు తీసేసాను.

"చూసావా కాల మహిమ. డ్రైవరుతో కలిసి భోజనమే చేయనన్నావు. ఆర్నెల్లు తిరిగే సరికి విందు భోజనమే వడ్డిస్తున్నావు. మేడమీది సౌందర్యానివనీ, అందాలతార మేఘమాలికవనీ కళ్ళు మూసుకుపోయి మాట్లాడావు. ఇక్కడేమో తమకంతో కళ్ళు మూసుకొని నా చేతుల్లో నలుగుతున్నావు" కసిదీరా అనగలిగాన్నేను.

పెద్దగా నవ్వు వినబడింది. ఈ నవ్వు దానిది కాదు. మరెవరిది. ల...లి...త. అదిరిపడ్డాను. ఒక్కుదుటున మంచం దిగాను. నన్ను వెధవను చేసేందుకు కరెంటొచ్చింది. మంచంపై లలిత. నన్ను అసహ్యంగా...ఛీ... నేను చూడాల్సిన చూపు అది చూస్తోంది. మోసం. ఆ దొంగ ముం... నా దగ్గర డబ్బులు కాజేసి నా పెళ్ళాన్ని నా దగ్గర... హవ్వ... ఇంతటి దారుణం చరిత్రలో ఇదివరకెప్పుడూ నమోదు కాలేదేమో!

"పక్కలో ఉన్నది- కాపురం చేసిన ఆడదా, మరోటా అనేది తెలియనంతగా కళ్ళు మూసుకొని ఉందెవరో?" నవ్వింది.

ఆ ముం...తో కలిసి నన్ను వంచించింది గాక, పుండు మీద కారం రాస్తుందా? నా కోపం గట్టు తెగింది. చేతికి దొరికిన ఫ్లవర్ వేజ్ తో తల పగలగొట్టాను. నా కోపానికి అంత బలముందని అప్పుడే తెలిసింది. నోట్లో నుండి కేక, తలలో నుండి రక్తం పోటీ పడ్డాయి. కిమ్మనలేదు. మంచంపై కూలిపోయింది.

ఎంతైనా కట్టుకున్న పెళ్ళాం. రక్త ధారలతో చలనం లేకుండా పడి ఉండడాన్ని చూడలేక పోయాను. డ్రెస్ వేసుకొని వేగంగా మేడ దిగి బయటకు నడిచాను. జరిగిన మోసమే గుర్తొస్తోంది. గడియ పెట్టాక ఆ వగలాడి మాయమైంది. లలిత ఎలా చేరింది? మరి నేనెలా పోల్చుకోలేక పోయాను? ఆలోచిస్తే అర్థం అవుతోంది. అందంలో వ్యత్యాసమే కానీ దాదాపు ఒకే శరీరాకృతులు. అందుకే చీకటి పన్నాగాన్ని గ్రహించలేక పోయాను. నేనని తెలిసి, లలితను పంపిందా? లేక లలితను కూడా వృత్తిలోకి దింపిందా? అదే గనక నిజమైతే దాని అంతు చూసి లలిత రక్తానికి బదులు చెల్లించాలి.

జరిగే తంతు గమనిస్తూనే ఉన్నాను. తప్పు చేసింది అదే కదా! పోలీసుల మాటే లేదు. హాస్పిటల్‌కి కూడా అదే తీసుకువెళ్ళింది. ప్రాణాపాయం తప్పింది.  వైద్యం అయ్యాక లలితను ఇంటికే తీసుకొచ్చింది. జరిగిన విషయాన్ని లలిత నేరుగా వాళ్ళ నాన్నకు చెప్తే? నాకు కొత్తగా పోయేదేముంటుంది. నేను ఆలోచించవలసింది కేవలం - డబ్బులకోసం లలిత కూడా వృత్తిలోకి దిగిందా అని!

నెల రోజులు కష్టంగా గడిచాయి. లలిత పని మానేసి ఇంట్లో సుఖంగానే ఉంటోంది. ఓ చీకటి రాత్రి ఇంటి బయట అవకాశం కోసం వేచి చూశాను. కిటికీ నుండి గమనిస్తూ ఉన్నాను. లలిత అల్మారా తెరిచి బట్టలు సర్దుతోంది. హఠాత్తుగా కొంత డబ్బు కింద పడింది. కాదు...చాలా డబ్బు. తీసి లెక్కపెట్టుకుంటోంది. ఇన్నేళ్ళ జీవితంలో లలిత చేతిలో అంత డబ్బు తనెప్పుడూ చూళ్ళేదు. ఖచ్చితంగా అది జీతమైతే కాదు. మరేమైయ్యుంటుంది. సందేహం లేదు. ఇది కూడా పనిలోకి దిగింది.  డ్రైవర్నే చులకనతో, అడిగాననే అక్కసుతో నా పెళ్ళాన్ని రొంపిలోకి దింపింది. ఆ రోజు నేను ఇంట్లో నుండి వెళ్ళిపోవడానికి కారణం కూడా ఆ పాపిష్టిదే. నాకు కర్తవ్యం బోధ పడింది. తల్లి వేరుని నరకాలి. అక్కణ్ణుండి వచ్చేశాను. నా దగ్గరున్న పైకంతో ఓ ఫుల్ బాటిల్ ధైర్యాన్ని కొనుక్కున్నాను.

ఈ మెట్లెక్కడం ఇది మూడోసారి. ఒకసారి అవమానం. మరోసారి మోసం. ఈ సారి లలిత రక్తానికి, ఆ వగలాడి చేయిస్తున్న పాపానికి బదులు తప్పదు. బెల్ కొట్టాను.

తలుపు తీసి నన్ను చూసిన వెంటనే మూసే ప్రయత్నం చేసింది. నేనా అవకాశం ఇవ్వలేదు. లోపలికి చొరబడ్డాను. దాని శరీరాన్ని గోడకు అదిమి పట్టాను. తీయని మాటలు నిక్షిప్తమైన గొంతును నా కుడి చేత్తో బలంగా పట్టుకున్నాను.

"బజారు ముండా...! నటించే అవకాశాల కోసం పడుకోవడం మొదలు పెట్టావ్. పడుకునే అవకాశాల కోసం ఓ వ్యవస్థనే సృష్టించావ్. అదీ సరిపోక ఓ అమాయకురాలిని బురదలోకి దింపావు. నా పెళ్ళాన్ని నాక్కాకుండా చేశావు. నా డబ్బులు కాజేసావు. నీలాంటి దానికి బతికే అర్హత లేదు. చావు..." బలంగా నొక్కుతుంటే గిలగిల్లాడుతోంది. సరిగ్గా ఇలానే ఈ లోకం కూడా చాన్నాళ్ళ నుండి నా ఊపిరాపుతోంది.

అంతలో చేతికి దొరికిన వస్తువుతో నన్ను బలంగా కొట్టింది. కొంచెం పట్టు సడలే సరికి, విడిపించుకొని సోఫా వెనక్కు వెళ్ళింది. వెంటబడ్డాను.

“ఆగు. నీకు దండం పెడతాను. నన్నేం చేయకు. నేను చెప్పేది విను” అంటూ నటించడం మొదలు పెట్టింది. నేనేమైనా టీవీ ప్రేక్షకుడినా కరిగేందుకు. ఊరుకోలేదు. ఈ సారి జుట్టు అందింది. విడిపించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. అలాగే తీసుకెళ్ళి గోడకు కొట్టబోయేంతలో వినిపించింది.

“చంపితే నీకేమొస్తుంది. ముందు నన్ననుభవించు.”

చేతిలోని జుట్టు అప్రయత్నంగా వదిలేశాను. నేను విన్నది నిజమేనా? అవునన్నట్లుగా తల ఊపింది. ఆయాస పడుతోంది. మెల్లగా మంచినీళ్ళు తాగింది. తనను చూస్తూ నేనాలోచించాను. నిజమే కదా! కోరిక ముందు కలిగింది. పగ తర్వాత పుట్టింది. ప్రాధమ్యాలు మార్చడం ఎందుకు?

“ఇందులో మళ్ళీ మోసం లేదు కదా! చావు అంచుల దాకా వెళ్ళొచ్చావు! గుర్తు పెట్టుకో!”

“నేనెక్కడికి పోతాను. నీ బలం ముందు నేనేపాటి.” జుట్టు ముడి పెట్టుకుంటూ అన్నది.

“సరే... ముందు మందు. తర్వాత అందాల విందు.”

నాకిది లొంగి పోయింది. తలుచుకుంటేనే కళ్ళు మత్తుగా తూగుతున్నాయి. రెండు గ్లాసులు కలిపింది. ఒకటి నా చేతికిచ్చి తానొకటి తీసుకొని నా ఎదురుగా కూర్చొని సోది మొదలు పెట్టింది.

“నీ రెండు లక్షల విషయమై మీ మామ లలితకు ఫోన్ చేశాడు. ప్రసాద్ పేరుతో నువ్వు మురళిని కలిసిన సంగతి మురళి చెప్పాడు. విషయం అర్థం అయింది. లలితకు చెప్పాను. ప్రాధేయ పడింది. ఆ అవకాశం తనకిమ్మని అడిగింది. మత్తులో ఉంటావులే తెలీకుండా మేసేజ్ చేయొచ్చనుకున్నా. కానీ తెలిసి పోయింది.”

“నాకు మత్తా... పిచ్చిదానా! నేనెంత తాగినా తొణకను తెలుసా!” అంటూ బాటిల్ ఎత్తి నా ప్రతాపం చూపాను.

“అయినా... ఆ డబ్బు లలిత వాళ్ళ నాన్న ఖాతాకు అప్పుడే బదిలీ చేశాను.”

“నా సొమ్ము దానం చేయడానికి నువ్వెవత్తివే...” అరిచాను. కానీ అది భయపళ్ళేదు.

“ముసలాడొచ్చే సమయం అయింది. ఒకసారి వెళ్లి గేటు వేసిరాపో. నిన్నిలా చూశాడంటే ఇద్దర్నీ చంపేస్తాడు.”

“మళ్ళీ ఏం డ్రామాకు తెర లేపావే. నీ ఇంట్లో నువ్వుండి, వాడెవడికో భయపడతావా? నాన్సెన్స్.”

“ఇల్లు వాడిది. నేను వాడికి సహకరించినంత కాలం నేనీ ఇంట్లో ఉండొచ్చు. తేడా వస్తే, నేనూ నీతో పాటు రోడ్డెక్కాల్సి ఉంటుంది.”

“మరీ ఇంత అబద్ధపు బతుకా...! అవసరమా...?”

“నీ కంటే తీసిపోయిన బతుకేం కాదు.”

చెంప చెళ్ళుమనిపించాను. రంగులద్దాల్సిన బుగ్గలపై నా వేలి ముద్రలు దిగాయి. హొయలు పలికే కళ్ళల్లో నీరు కదిలింది.

“నేనెళ్ళి గేటు మూసి వచ్చే లోపు ఏమైనా పిచ్చి వేషాలేస్తే నీ మొఖం అదనపు వేషాలక్కూడా పనికి రాకుండా చేస్తా” లేచి నిలబడ్డాను.

తనూ లేచింది. కబ్బోర్డ్ దగ్గరకు వెళ్ళింది. తుపాకీ గానీ తీస్తుందా? అసలే సినిమా వాళ్ళను నమ్మకూడదు. "ఏయ్... ఆగక్కడే!" అరిచాన్నేను. ఆగలేదు. డోర్ ఓపెన్ చేసింది. ఒక్కసారిగా వెళ్లి అడ్డం నిలబడ్డాను. భయంతోనో, మరెందుకో అడుగులు తడబడుతున్నాయి. నన్ను పక్కకు తోసింది. ఓ బాక్స్ ఓపెన్ చేసింది. మెల్లగా అందులోంచి ఒక చైన్ తీసింది. ఓహ్... అది మంగళ సూత్రం. నాపై ఇంత మనసా! నమ్మలేక పోయాను.

"ఈ సమయంలో పెళ్లి చేసుకోవడం బాగోదేమో!" మాటలు కూడా తడబడుతున్నాయ్.

బిగ్గరగా నవ్వింది. అలలు అలలుగా నవ్వుతూనే ఉంది. నవ్వీ నవ్వీ పొట్ట పట్టుకొని కూలబడి పోయింది.

"పిచ్చి రమణా... నీ పెళ్ళాం నువ్వు కొట్టిన దెబ్బకు పని చేసే శక్తిని కోల్పోయింది. ఆరోగ్యం కుదుటపడే వరకు నేను డబ్బు సర్దుతానంటే వద్దంది. అభిమానవతి. ఈ మంగళ సూత్రం తనది. అమ్మిపెట్టమని నాకిచ్చి వెళ్ళింది. దీన్నమ్మితే వచ్చే డబ్బు నేనే ఇచ్చాను. హాస్పిటల్ ఖర్చులు నాకిచ్చేసి మిగిలినవి మాత్రమే తను తీసుకొంది. అయినా... నీ భార్య తాళి నువ్వు గుర్తు పట్టకపోవడం ఆశ్చర్యం!"

"ఎందుకు పట్టలేదు. మనసంతా నీపై ఉండి, కొంచెం మగతగా ఉంది. అది నాకివ్వు. తీసుకెళ్ళి లలితకిచ్చి నేనేంటో చూపిస్తాను." అన్నాన్నేను.

"నమ్మొచ్చా?"

"నేన్నిన్ను నమ్మాను కదా!"

"ఇక్కడైతే భద్రంగా ఉంటుంది" తీసుకొని మెడలో వేసుకున్నాను.

"నా పెళ్ళాం బంగారం" ఈ సారి మాట గొంతులోనే ఉండిపోయింది.

నడుస్తున్నాను. తాళి గుండెలపై ఊగుతోంది. తల తిరగడం ఎక్కువైంది. వెళ్లి గేటు వేసి తొందరగా వచ్చేయాలి. దొంగ మొహంది. మెదడుని మళ్ళించింది.

మెట్లు దిగడం మొదలుబెట్టాను. కళ్ళు సరిగా కనిపించడం లేదు. ఒకటి చూస్తే మరొకటి కనబడుతోంది. అంతలో వెనుక నుండి ఎవరో గట్టిగా తన్నినట్లనిపించింది. అంతే...! అమాంతం ఎగిరి పడ్డాను. నన్నస్తమానం అడ్డుకునే పూలకుండీకి తల గుద్దుకుంది. ఫా...ట్...మని శబ్దం వినిపించింది. దొర్లుకుంటూ వెళ్లి కింద వెల్లకిలా పడిపోయాను. కదల్లేక పోతున్నాను. నన్నెవరో తన్నారు. ఎవరది? మెట్ల పైపు చూశాను. లీలగా ఓ ఆకారం కనబడింది. నవ్వుతోంది. ఎవరది? ఇంకెవరు... నేనే. మాయగా ఉంది. మెట్ల పైనున్న నేను బిగ్గరగా నవ్వుతున్నాను. కిందున్న నా వీపు తడిసి పోతోంది. మెల్లగా చేతుల కిందికి వెచ్చని ద్రవం చేరుతోంది. ఏమిటది? మా నాన్న చెమట చుక్కలా? లలిత కన్నీటి ధారలా? నా కళ్ళు నన్ను చీకటిలోకి ఈడ్చుకెళుతున్నాయి. పడిన నేను- ఆకాశంలోకి మెల్లగా తేలుతున్నాను. మెట్ల పైన నేను- శూన్యంలోకి వేగంగా దిగుతూ ఉన్నాను.

***0***

# దె లివ్డు విత్ఔట్ గాడ్

రాపాక కామేశ్వర రావు



"అమ్మా ఉడుకు దప్పి ఉంటె ఇయ్యమ్మా" గుమ్మం ముందర కూర్చొని అడిగింది ఎర్రమ్మ.

"నిన్న రేతిరి నుంచి ఏటి తినలేదు కాలు పీకేస్తున్నాయి" నోటి నుండి వచ్చిన మాటలు స్పష్టముగా లేవు, లోతుబావి లోనుండి వస్తున్నట్టు ఉన్నాయి.

ఆ మాటలు వంట గదిలోనున్న కృష్ణవేణికి లీలగా వినిపించి బయటకు వచ్చింది.

"బియ్యం ఉడుకుతున్నాయి, వార్చగానే ఇస్తాను!" అని చెప్పి 'పాపం రాత్రి ఏమి తిన్నట్టు లేదు, ఆకలితో అలమటించి పోతోంది' అని అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది కృష్ణవేణి.

ఆ వీధిలో చదువుకున్న అతి కొద్దిమందిలో కృష్ణవేణి భర్త రామారావు ఒకడు. ఆ ఊరిలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. ఈమధ్యనే పెళ్ళయింది. చిన్నప్పటి నుండి ఆ వీధి వాసుల కష్టాలు చూస్తున్నాడు. ఏదో తనకు వీలైనంతలో వాళ్ళ కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నాడు. భార్య కృష్ణవేణి కూడ భర్త అడుగు జాడలలో నడుస్తూ వారికి చేయూతనిస్తోంది.

అన్నం వార్చగా వచ్చిన గంజి నీళ్ళనే అక్కడివారు దప్పి అంటారు. ఆ తరువాత కృష్ణవేణి ఆ గంజి నీళ్ళలో కొద్దిగా అన్నం జోడించి ఎర్రమ్మకిచ్చింది. నంజుగా ఆవకాయ కూడ ఇచ్చింది. ఎర్రమ్మ తృప్తిగా కడుపు నింపుకుంది.

"రాత్రి నన్ను అడగవలసింది అమ్మమ్మా. అన్నం కూడ మిగిలింది. అప్పుడే ఇచ్చేదాన్ని కదా!" అంది కృష్ణవేణి.

"నిన్న పొద్దున కూడు మిగిలితే రేతిరికి ముదరోడికి ఇచ్చేసానమ్మా. వార్సిన గెంజి ఉంటే అది తాగి తొంగున్నాను"

***

ఎర్రమ్మ భర్త లచ్చయ్య. ఆ దంపతులకు వయసు మీద పడింది. శక్తి సన్నగిల్లుతోంది కాని కాయ కష్టం చేస్తున్న వాళ్ళు గనుక ఏ జబ్బు వారిని కరవలేదు .. ఒక్క ఆకలి తప్ప. రామారావు ఇంటికి ఎదురుగా ఒక పూరిపాకలో నివాసముంటారు. వారికి ఒక కూతురు లక్ష్మి. చిన్నప్పుడే పెళ్ళి చేసేసారు. ఆమె అదృష్టం

కొద్దీ దేనికీ లోటు లేని ఇంట్లో పడింది. కాని అత్తచాటు కోడలు కాబట్టి, తలిదండ్రులకు ఏవిధము గాను సాయం చేయలేక పోతుంది.
ఆ ఊరిలో పేరు మోసిన ప్లీడరు కామేశ్వరరావు పంతులుగారి దగ్గర లచ్చయ్య కంబారిగా పని చేస్తాడు. ప్లీడరుగారికి పదెకరాల పల్లపు భూమి ఉంది. వారి వ్యవసాయపు పనులన్నీ దగ్గరుండి చేయిస్తాడు లచ్చయ్య. తాను కూడ పొలం పనులు, ఇంటి పనులు చేస్తాడు. ప్రతి రోజు తెల్లవారి లేస్తూనే కాలకృత్యాలు తీర్చుకుని పంతులుగారింటికి వెళ్తాడు. వారు పెట్టిన చద్దన్నము తిని, ఇంటి పనులు చక్కబెడతాడు. తరువాత మధ్యాహ్నం తినడానికి అమ్మగారు ఇచ్చిన భోజనాన్ని మూట గట్టుకుని పొలముకు వెళ్తాడు. పొద్దు గుంకే సమయానికి తిరిగి వచ్చి, ప్లీడర్ గారింట్లో ఏవైనా పనులుంటే చేసి, తన ఇంటికి వెళ్ళిపోతాడు. ఈ పనులు చేసినందుకు ప్లీడర్ గారు సంవత్సరానికి ఒకసారి పంట ఇంటికొచ్చాక కొంత ధాన్యం భరణముగా ఇస్తారు. అలా వచ్చిన ధాన్యంలో కొంత అమ్ముకుని ఆ డబ్బులతో మిగిలిన నిత్యావసరాల్ని తీర్చుకుంటారు. అమ్ముకోగా మిగిలిన ధాన్యాన్ని కొద్ది కొద్దిగా తీసి ఎండబెట్టి, మిల్లు ఆడించి ఆ బియ్యంతో పొట్ట నింపుకుంటారు.

***

కడుపులో మంట చల్లారినాక అటుగా వెళ్తున్న పక్కింటి మహలక్ష్మమ్మను చూసి "మాలమ్మా రేసని కారుడు మీద కోటా సీని ఇస్తన్నారు ఎల్లి తెచ్చుకో!" అని చెప్పింది ఎర్రమ్మ.
"ఆ... రేపెల్తాను పెద్దమ్మా, నీవు తెచ్చుకున్నావా?" అని అడిగింది మహాలక్ష్మమ్మ.
"లేదే నా కారుడిచ్చి పైసాలు తీసుకున్నాను, ఈ సారి రెండు కేజీల సీనికి రూపాయ పావలా ఇచ్చాడు."
ఆ వీధిలో వాళ్ళందరూ వ్యవసాయ కూలీలే. వరి నాట్లు, కోతలు సమయంలోనే వారికి పనులుంటాయి. ఎర్రమ్మ కూడ అలా వ్యవసాయ కూలిగా పని చేస్తోంది. రేషన్ కార్డు మీద పండుగ నెలల్లో కోటా ధరకి పంచదార ఇచ్చేవారు. ఎర్రమ్మలాంటి వాళ్ళు పంచదార కొనకుండా, ఆ కార్డు మీద వచ్చే పంచదార తిరిగి డీలర్ కిచ్చేసి, మార్కెట్ ధరకి కోటా ధరకి ఉన్న తేడా మొత్తాన్ని తీసుకునేవారు. అలా వచ్చిన డబ్బులు కూరనారలకు ఉపయోగపడతాయి. అందరి పరిస్థితి ఇంచు మించు ఇదే. రెక్కాడితే గాని డొక్కాడదు. కొందరు వయసులో ఉన్న మగవాళ్ళు మార్కెట్లో మరియు బస్ స్టాండుల్లో హమాలీలుగా పనిచేస్తుంటారు.

***

ఆ రోజు దీపావళి అమావాస్య. అయినా ఆ వీధిలో దీప కాంతుల మిరుమిట్లు గాని, మతాబుల ముచ్చట గాని మచ్చుకైనా కనబడలేదు. ఎందుకంటే ప్రతి రాత్రి ఇంటిలో చీకటిని తరిమే కిరసనాయిలు బుడ్డి వెలగడమే కష్టంగా ఉండేది. ఇరుగింటి అమ్మో పొరుగింటి అమ్మో ఆదుకునే అవకాశము లేదు. ఎందుకంటే వారిది కూడ అదే పరిస్థితి. అందుకే రామారావు దంపతులు కూడ ఒక ప్రమిదను దేవుని వద్ద వెలిగించారు గాని బాణసంచా జోలికి పోలేదు.

రాత్రి భోజనాలైన తరువాత గుమ్మం వద్ద కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న రామారావు దగ్గరికి లచ్చయ్య వచ్చి ఆ పక్కనే కిందన కూర్చొని "బాబు... ఏటో సదువుకుంతున్నావా?" అన్నాడు

"లేదులే" అని పుస్తకం మూసేస్తూ "చెప్పు తాతా" అన్నాడు రామారావు.

ప్రతి రోజు అలా వచ్చి రామారావు దగ్గర కూర్చొని లోకాభిరామాయణం మాటలాడుతుంటాడు లచ్చయ్య. "బోజనాలయ్యాయా నాయనా" అని కొన్ని కుశలప్రశ్నలు వేసాక "ఇయాల ఏమో గాని మన ఈదిలో రోడ్లన్నీ బాగ తుడిసి, మందు జల్లి ఎల్లారు పంచాయతి వోల్లు!" అన్నాడు లచ్చయ్య.

"ఓ.. అదా! రేపటి నుంచి కార్తీకమాసం తాతా. మన వీధి ఈశ్వరుడి గుడికి ఊరిలో ఉన్న వాళ్ళందరు క్యూ కడతారు. ఈ నెల రోజులు సందడే కదా మన వీధికి!" అన్నాడు రామారావు.

"ఆ .... మనకేటి సందడి బాబు, పెద్దోలంతా దేముడి దగ్గరికెల్తారు, పాపాలు కడిగేసుకోడానికి. మనకి కడుపు నింపుకోడంతోనే సరిపోతాది!"

అదే సమయంలో ఆ వీధిలోనే నివాసముంటున్న గోపాలం అటు నుండి వెళ్తూ "ఏం బాబు బోజనాలయ్యాయా?" అని పలకరించాడు రామారావుని.

"ఆ... అయ్యాయి గోపాలం! ఎక్కడికెళ్తున్నావు ఈ టైంలో?" అని అడిగాడు రామారావు.

"నాయుడు గారింటికెల్తున్నాను బాబు. నాయుడి కొడుకు నడిపోడు బేంకిలో పని చేస్తున్నాడు కదా, మేనేజీరుతో మాటలాడి కూరగాయల బేరంకి అప్పు ఇప్పించమని అడగడానికి వెళ్తున్నాను! ఈ టైంలో అయితే మాటలాడొచ్చు అని నాయుడు గారు చెప్పారు!" అని వెళ్ళిపోయాడు.

గోపాలం చిన్నప్పుడే పక్కింటి వాళ్ళతో కలిసి అండమాన్ వెళ్ళిపోయాడు. అక్కడ పోర్ట్ లో లేబరుగా పనిచేసి, కొంత డబ్బు పోగేసుకుని ఈ మధ్యనే స్వంత ఊరికి వచ్చేసాడు. కాని చిన్నప్పటి నుండి అలవాటు లేకపోవడం వల్ల ఇక్కడ వ్యవసాయపు పనులేవీ చేతకాలేదు. అలాగని ఇప్పుడు హమాలీ పనులు కూడ చెయ్యలేడు. కొన్నాళ్ళు అండమాను నుండి తెచ్చిన డబ్బుతో కాలం వెళ్ళబుచ్చాడు.

'ఇప్పుడు ఆ డబ్బు ఖాళీ అయిపోయాక కూరగాయల వ్యాపారం చెయ్యాలనే తలంపు కలిగినట్టుంది!' అనుకున్నాడు రామారావు.

స్వామినాయుడు గారు ఆ ఊరిలో మోతుబరి రైతు సుమారు యాభై ఎకరాల పల్లపు భూములున్నాయి. ఆ వీధి వాళ్ళందరూ ఆయన భూముల్లోనే పని చేస్తారు. ఆ వీధిలోనున్న గుడికి ఆయనే ధర్మ కర్త. దేవుడి నైవేద్యాలకోసం ఒక అయిదెకరాలు రాసిచ్చారని అందరు చెబుతుంటారు. ఆయన ఇంటికే గోపాలం వెళ్తున్నాడు.

"అవును తాతా నువ్వెప్పుడూ గుడికెళ్ళవా?" అని రామారావు అడిగాడు లచ్చయ్యని.

"నా సిన్నప్పుడు ఒక రోజు శివరాతిరి రోజున నా ఈడు పిల్లలందరం కలిసి ఎల్లాము. ఆ తరవాత పీడరిగారింట్లో పనికి కుదిరాను. అప్పుడు నుంచి ఎల్లలేదు. గంటలు గంటలు ఆ లైనులో నిలబడాల, నాకెక్కడవుతాది నాయనా!" అన్నాడు లచ్చయ్య.
కొంత సేపు మాటలాడాక "నిద్దరొస్తోంది బాబు, నీవు కూడ ఎల్లి తొంగో!" అంటూ వెళ్ళిపోయాడు లచ్చయ్య.
లచ్చయ్య చిన్నప్పుడే కాదు, ఇప్పుడు కూడ ఆ వీధిలో ఏ పిల్లాడికైనా పది సంవత్సరాల వయసొస్తే చాలు.. తలిదండ్రులు వారిని ఏ పచారీ కొట్లోనో, లేక ఫలహారశాలలోనో జీతానికి పెట్టేస్తారు. అయిదో తరగతిగది ఆ పిల్లలెవరు చూడలేదు. అది మొదలు.. జీవితాంతము క్షుద్బాధకే తపన. పిడికెడు ముద్ద కోసం ఆకలి పోరాటం. దేవుడి సన్నిధి వీధిలో ఉంటున్నా, ఏనాడు దేవుడి ఆలోచనే రాని దేవుడి బిడ్డలు.
ఇలా ఆలోచనలతో మంచం చేరిన రామారావుకు ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. తెల్లవారి ఝామునుండే భక్తుల సందడి మొదలైనా, బారెడు పొద్దెక్కే వరకు లేవలేకపోయాడు రామారావు. ఆ రోజు ఆదివారం కాబట్టి స్కూల్ కు వెళ్ళాల్సిన అవసరం లేదు. కాలకృత్యాలనంతరం భార్య కృష్ణవేణి తో కలిసి గుడికి వెళ్ళాడు.
"దేవుడా ఈ నీ పిల్లల్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావు. వీళ్ళ కోసం ఏదైనా చేసే శక్తి నాకివ్వు!" అని మొక్కుకున్నాడు రామారావు. "పేదరికం, నిరక్షరాస్యత రెండు కవల పిల్లలుగా ఇక్కడ రాజ్యమేలుతున్నాయి." అనుకొని ఇక మీదట స్కూల్ మానివేసిన పిల్లలకు ఒక గంట సేపు రాత్రి పూట చదువు చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

***

ఆ రోజు సాయంత్రం టౌన్ హాల్ వీధిలో ఉన్న దివ్యజ్ఞాన సమాజంలో ఎవరో స్వామీజీ ప్రసంగం ఉందని తెలిసి వెళ్ళాడు రామారావు. అక్కడ స్వామీజీ ప్రసంగం సాగుతోంది. శ్రీ రామకృష్ణ పరమహంస బోధనల తత్వాన్ని వివరిస్తున్నారు.
"ఎప్పుడు ధర్మం నశించి దానవత్వం చెలరేగుతుందో అప్పుడో అవతార పురుషుడు జన్మిస్తాడు అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పారు. అలాగే ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మొహమ్మద్, ఆయా దేశ కాల పరిస్థితులకనుగుణంగా అవతరించి మానవాళిని ఉద్ధరించారు. ఆ కోవలోనే శ్రీరామకృష్ణ అవతరించారు. అశేష శిష్యబృందానికి శ్రీరామకృష్ణ దైవమే. ఆయనకు సాక్షాత్తూ కాళీమాత ప్రత్యక్షమయింది. ఆయన శిష్యబృందములో అగ్రగణ్యుడు వివేకానందుడు. ఒక సారి వివేకానందుడు రామకృష్ణుల వారికి 'మీరు దైవాన్ని చూసారా?' అని ప్రశ్నిస్తే........." ఇలా సాగింది ప్రసంగం.
చివరిలో స్వామి చేతనానంద రాసిన "దె లివ్డు విత్ గాడ్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.
రామారావు కూడ ఆ పుస్తకం కాపీని కొనుక్కుని ఇంటి దారి పట్టాడు.
దారిలో ఆ వీధికి చెందిన రాములమ్మ తన కొడుకు గిరి చెయ్యి పట్టుకుని వాడిని తిట్టుకుంటూ ముందు నడుస్తోంది. అది చూసిన రామారావు "ఏమైంది రాములమ్మా?" అని అడిగాడు.

"ఆ బొమ్మల కొట్లో ఏదో బొమ్మ ముట్టుకున్నాడని ఆ సావుకారి కొట్టబోతుంటె సూసానయ్యా,, నేను సూసాను కాబట్టి సరిపోయింది. నేకపోతే ఈడిని కొట్టేవారు."

"లేదు సారు! బొమ్మ ఎంత అని అడుగుదామని ముట్టుకున్నాను!" అన్నాడు గిరి

"ఏమిరా గిరి, స్కూల్ లో కనబడ్డం లేదు ఈ మధ్యన?" అని అడిగాడు రామారావు.

"మా అమ్మ సదవొద్దనీసింది. రేపటి నుండి బజారీదిలో కిరానా కొట్లో నౌకిరికి కుదిర్సింది సార్!" అన్నాడు గిరి.

'పుట్టుకతోనే నిరుపేదలు. జీవితాంతం ఆకలికి బానిసలు.' అని అనుకున్నాడు రామారావు. వారి జీవన స్థితి గతులు తెలిసిన వాడు కాబట్టి రామారావు ఇంకేమీ అనలేకపోయాడు.

రాత్రి భోజనాలయ్యాక ఎప్పటిలాగానే గుమ్మం ముందు కుర్చీలో కూర్చుని "దె లివ్డు విత్ గాడ్" పుస్తకాన్ని తెరిచాడు. ఎందరో సాధకులు శ్రీరామకృష్ణ శిష్యులుగా చేరి ఆయన బోధనలను ప్రజల వద్దకు చేర్చి, సమాజ ఉద్ధరణకై పాటుపడ్డారు. వారి జీవన విధానము, శ్రీరామకృష్ణతో వారి సాన్నిహిత్యం ఒక సంకలనముగా తీర్చిదిద్ది ఈ పుస్తకం ప్రచురించారు.

రామారావు పుస్తకం తెరిచినా దానిపై మనస్సు లగ్నం కాలేదు. పుస్తకం మూసివేసి నిద్రకు ఉపక్రమించాడు గాని, ఆయన మనస్సంతా ఆ వీధి మనుషుల గురించే పరిపరి విధముల ఆలోచిస్తోంది.

"ఆకలి బాధనే ఆహార్యముగా బతుకున్న ఈ బడుగు జీవులకు ఉషోదయమెప్పుడో... "

"వీరి జీవితం ఇంతేనా?"

ఉదయం లేచిన మొదలు జీవన పోరాటం. ఈ రోజు ఎలా గడుస్తుందా అనే ఆలోచన. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశలు కూడ మొలకెత్తవు వారి మనసుల్లో. ప్రారబ్ధము అని కూడ తలవరు. ఒక విధమైన నిర్లిప్త వైఖరి. అలాగని వారి దైన్యానికి వారు ఏ దేవుడిని నిందించరు. కలడనువాడు కలడో లేడోనని అనుకోరు. అసలు దేవుడి గురించి ఆలోచించరు. అంత సమయము లేదు. అంత జ్ఞానము లేదు."

నిజముగా "దె లివ్డు వితౌట్ గాడ్" అని ఆలోచిస్తూ నిద్రపోయాడు.

***0***



# తెలుసుకుంటే ఎంత బాగుంటుందీ

## పెనుమాక నాగేశ్వరరావు

రోజు పదకొండు అయితే కళ్ళు మూసుకుపోతుంటై. కానీ పార్థసారథి ఫార్వార్డ్ చేసిన వాట్సప్ మెసేజ్ ఆసక్తిగా అనిపించి చదవటం మొదలుపెట్టాను. నిద్రని కాసేపు వాయిదా వేసుకున్నాను.

“అమెరికాలో జరిగిన సర్వేలో మనసు బాగున్నవారు ఎక్కువకాలం జీవిస్తున్నారని తేల్చారు. మనసు కలతబారితే లేనిపోని ఆలోచనలు చోటుచేసుకుని, వాటి నుంచి బైటపడడానికి “బలహీనతలు" పెంచుకోవడం, వాటికి బానిసలై "దురలవాట్ల" పాలైపోవడం వంటివి చేస్తున్నారని వారు తేల్చారు.

ఇటీవలకాలంలో ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు కీలక రోగాలకు మందులు ఇవ్వడం తగ్గించి, "జీవన శైలి" ని సరిదిద్దే పనిలో పడ్డారు. ఎంతో కొంత వ్యాయామం మాత్రం చేయమని సూచిస్తున్నారు.

ఒక్కసారిగా వీరి వైఖరి ఇలా మారిపోవడానికి సరికొత్త అధ్యయనాలే కారణం. ఇలా వెల్లడైన అనేక పరిశోధనల ఫలితాలలో జపాన్ శాస్త్రవేత్తల పరిశోధన, అధ్యయనం సరికొత్తది. దీనిలో పాల్గొన్న సైంటిస్టులు ఏం చెబుతున్నారో చూద్దాం.

కడుపులో గ్యాస్ సమస్య రావడానికి, ముదరడానికి కారణం ఆహార లోపాల వల్ల కాదట. "మానసిక ఒత్తిడి" వల్ల ఎక్కువ వస్తుందట !

ఉప్పు ఎక్కువగా తినే వారికంటే "ఆవేశ కావేషాలను" అదుపులో పెట్టుకోని వారిలోనే "అధిక రక్తపోటు" ఎక్కువట !

కొవ్వు పదార్థాలు తినేవారిలో కంటే అతి బద్ధకం వలన కొవ్వు పెరిగిన వారిలోనే చెడు కొలెస్టరాల్ ఎక్కువట!

"మధుమేహం" సమస్య .. తీపి పదార్థాలు అధికంగా తినేవారిలో కంటే అధిక స్వార్థం, మొండితనం ఉన్నవారిలోనే ఎక్కువట !

అతి విచారం వల్లనే ఊపిరితిత్తులలో మార్పులు వచ్చి ఆస్త్మా వస్తుందట.

ధమనుల్లో రక్తప్రసరణ లోపాల కంటే ప్రశాంతత లోపించడం వల్లనే గుండె కొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయట. అందువల్ల మనిషికి గుండెజబ్బులు వస్తున్నాయట.

మొత్తం మీద శరీరంలో వచ్చే సర్వ రోగాలకు "మూల కారణాలు" తరచి చూస్తే "ఆహార అలవాట్ల" వల్ల కాదని లైఫ్ స్టయిల్ సంబంధమైనవేనని తెలుస్తోంది. వారి అధ్యయనం ప్రకారం

50% ఆధ్యాత్మికత లోపంవల్ల, 25% మానసిక కారణాలవల్ల, 15% సామాజిక, స్నేహ బాంధవ్యాల లోపంవల్ల, 10% శారీరక కారణాల వల్ల రోగాలు వస్తున్నాయి. అందువల్ల "కడుపు మాడ్చుకుని"

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరాటపడేకన్నా, "జీవన శైలి" ని మార్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మేలని జపాన్ సైంటిస్టులు అంటున్నారు.
వీరి సూచనల ప్రకారం మనం ఆరోగ్యంగా ఉండాలంటే స్వార్ధం, కోపం, ద్వేషం, శత్రుత్వం, ఆవేశం, అసూయ, మొండితనం, బద్ధకం, విచారం వంటి "వ్యతిరేక భావాలను" వదిలించుకోవాలి. కారుణ్యం, త్యాగం, శాంతం, క్షమ, నిస్వార్ధం, స్నేహభావం, సేవాభావం, కృతజ్ఞత, హాస్య ప్రియత్వం, సంతోషం , సానుకూల దృక్పథం పెంచుకోవాలి."
అంతా చదివాక ఆ మెసేజ్ ఆలోచనాత్మకంగా వున్నట్లనిపించింది. ఫోన్ ఆఫ్ చేసి నిద్రలోకి జారుకున్నాను.
"ఒరేయ్ ఋషీ .... ఇన్నాళ్లూ నన్ను బద్దకస్తుడినని, బుద్ధి తక్కువ వాడినని, ధైర్యం లేదని, జీవితంలో రిస్కు తీసుకోవటానికి ఇష్టపడననీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేవాడివిగా....ఇప్పుడు నాకో మహత్తరమైన ఆలోచన వచ్చింది. ఎవరెన్ని చెప్పినా చేసేయటానికే నిర్ణయించుకున్నాను" సీరియస్ గా చెప్పాడు పార్ధసారథి
"'విషయం చెప్పారా ముందు" విసుగ్గా అన్నాను వాడి మాటల మీద నమ్మకం లేని నేను.
"చూత ఫలం అన్నంత మాత్రాన మామిడి పండు మాధుర్యం మారిపోతుందా! చిత్రాన్నం అన్నా పులిహోర అన్నా ఒకటే రుచిగాదా! క్షీరాన్నం అన్నా, పరమాన్నం అన్నా అదే తీపి .. అలాగే రక్తం, రుధిరం, నెత్తురు .. మూడూ ఒకటే. పేర్లు అనేకం. మనుషులకే కాదు రక్తానికీ గ్రూపులున్నై. బ్యాంకులూ ఉన్నై. మనలో ఏ అవయవానికి రక్తం సరఫరా కాదో ఆ అవయవం పనిచేయటం ఆగిపోతుంది. (లంచం లేనిదే ఏ పనీ కానట్లు). ఏ జబ్బు నిర్ధారించటానికయినా రక్త పరీక్షే ముఖ్యం" ఉపన్యాస ధోరణిలో చెప్పాడు.
కాళ్ళు నొప్పులైనా, కళ్ళు మంటలైనా రక్త పరీక్షలే కదా ... ఒళ్ళు వెచ్చబడినా, చల్లబడినా రక్త పరీక్షలే గదా.... చేతులు గుంజుతున్నా, మెడలు గుంజుతున్నా, లివరుకు, గుండెకు, శ్వాసకోశ బాధలకు, ఉదరకోశ బాధలకు, గర్భకోశ వ్యాధులకు .. అన్నింటికీ .. అన్నింటికీ రక్త పరీక్ష జరక్కుండా వైద్యం చేస్తున్నారా? అన్నాడు సారధి
"ఇప్పుడీ రక్త చరిత్ర ఎందుకురా బాబూ" అన్నాను అసహనంగా
"వస్తున్నా...వస్తున్నా అసలు పాయింటుకు వస్తున్నా .. నేను మరి కొద్ది రోజుల్లో ఓ రక్త పరీక్షా కేంద్రం పెట్టబోతున్నాను" నింపాదిగా చెప్పాడు సారధి.
ఉలిక్కిపడ్డాన్నేను. ఉన్నపళంగా ఇదేం బుద్దీ .. అయినా నువ్వు క్వాలిఫైడ్ కాదుగా" నా సందేహం వెలిబుచ్చాను.
"పిచ్చివాడా .. నేను పెట్టబోయే రక్తపరీక్షా కేంద్రంలో నువ్వనుకున్నట్లు అందరూ చేసే వ్యాధి నిర్ధారణ కోసం చేసే రక్త పరీక్షలు కాదురా బాబూ..
"మరి!"

మీలో అహంకారం, మమకారం, సహకారం, ఉపకారం, అపకారం .. ఏ ఏ మోతాదులో ఉన్నాయో అలాగే స్వార్థం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, ఓర్వలేనితనం .. ఏ ఏ పాళ్ళల్లో ఉన్నాయో, అలాగే మీలో ప్రేమ, అభిమానం, మానవ సంబంధాలు, మాధవ సంబంధాలు ఏ మేరకు ఉన్నాయో .. మీ బుద్ధి, మనసు, చిత్తం అహంకారం ఎలా పని చేస్తున్నాయో .. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలు మితంగా ఉన్నాయా, అమితంగా ఉన్నాయా, అపరిమితంగా ఉన్నాయా తెలియచేస్తాం.

మీ స్వభావం సత్వ, రజ, తమో గుణాల్లో దేనికి సంబంధించింది? ధన దాహం, అధికార దాహం ఉన్నాయా, లేవా! మీరు సత్యవాదులా, అసత్య వాదులా, మీది ధర్మ మార్గమా, అధర్మ మార్గమా? శృంగార ప్రియులా, హాస్య ప్రియులా, భోజన ప్రియులా లేక భజన ప్రియులా? మీలో సహనం ఎంత వుంది, ఆవేశం ఎంత వుంది ఆలోచన ఎంత వుంది? విచక్షణ వుందా లేదా? వినయం, విధేయత, వివేకం, అలసత్వం, దుబారా, పొదుపు, ముందు చూపు, బాధ్యత, కార్యదక్షత, వాక్చాతుర్యం, జాలి, దయ, సానుభూతి, కోపం, నీతి, నిజాయితీ .. ఏవేవీ ఏ ఏ పాళ్ళల్లో ఉన్నాయో తెలియచేస్తాం."

ఇచట అన్ని రకముల రక్త పరీక్షలు చేయబడును. ఫలితములు మూడు రోజుల తదుపరి తెలుపబడును. అతి తక్కువ ధరకే అన్నీ రకాల రక్త పరీక్షలు చేయబడును. కేవలం అయిదు వందల రూపాయలకే దిగువ చెప్పిన అన్నీ పరీక్షలు చేయబడును. విభాగాల వారీగా ఒక్కొక్క విభాగానికి వంద రూపాయలు మాత్రమే. అప్పటికే తను తయారుచేయించిన బోర్డుని నాకు చూపించాడు. మరొకసారి చదువుకుని తృప్తిగా నవ్వుకున్నాడు సారథి. బోర్డుకు వాడిన రంగు, అక్షరాలకు వాడిన రంగు చాలా ఆకర్షణీయంగా వుండటం అతని తృప్తికి కారణం. తెలుగు భాషాభిమాని కావటంతో బోర్డు అంతా తెలుగులోనే తయారుచేయించాడు. అయితే ఆఖర్లో గీసిన బోర్డర్ కింద ఆంగ్లంలో బ్లడ్ టెస్ట్ సెంటర్ అని మాత్రం వ్రాయించాడు.
"ఋషీ ఇప్పుడే కరపత్రాలు వచ్చినై. లోపలికి రా. చూసి ఎలా ఉన్నాయో చెబుదువుకాని" అతని గొంతులో వినబడిన ఆనందాన్ని గ్రహించాను. నేను లోపలికి అడుగు పెట్టగానే, కరపత్రాన్ని నా చేతులో పెట్టాడు. లోగో చాలా బాగున్నది. అక్షరాలు ముచ్చటగా వున్నై. రంగులు హరివిల్లులా ఆకర్షిస్తున్నాయి. మడత విప్పాను. కరపత్రం చదవడం మొదలుపెట్టాను.

భగవంతుడు అన్నీ జంతువులకు ఇచ్చినట్లు మనకూ శరీరం ఇచ్చినప్పటికీ, వివేకం అనే గొప్ప గుణం మనకే ఇచ్చాడు. అలాగే నిన్న జరిగిన విషయం గుర్తుకు తెచ్చుకుంటేనే గుర్తుకు వస్తుంది. రేపు జరగబోయేది ఏం చేసినా తెలియదు. ఇప్పుడు జరుగుతున్నది ఆలోచిస్తే తప్ప అర్థం కాదు. ఈ మూడు కారణాలవల్ల మనిషి పిచ్చెక్కకుండా సుఖంగా వుండగలుగుతున్నాడు

అమ్మలు తమ రక్తాన్నే పాలకా మార్చి పిల్లలకిస్తారట. రక్త సంబంధాలు ఎంత గొప్పవీ? జలగల్లా మన రక్తాన్ని పీల్చేది ఎవరూ? (దోమలు కాకుండా) దోమల రక్తం తెల్లగా ఉంటుందట (అవి పీల్చేది మన ఎర్రని నెత్తురు కదా!) మనిషికి రక్తం ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందేనట (డబ్బో!)
నా రక్తమే బీ పాజిటివ్ ఇక నాకు నెగిటివ్ ఆలోచనలెలా వస్తాయంటూ వాదించేవాళ్లు కంటబడుతున్నారు ఈమధ్యన. రక్తానికీ, డబ్బుకీ సర్క్యూలేషనులో ఉంటేనేనట విలువ, డబ్బుకి ఏమో గాని, రక్తానికి మాత్రం సర్క్యూలేషను ఆగిపోతే రక్త చరిత్రే కాదు, మనిషి చరిత్ర కూడా పరి సమాప్తమే.
ఆరోగ్యంగా వుండటానికి మూలం మన ఆలోచనలు కూడా. ఈ విషయం వైద్యశాస్త్రం కూడా చెబుతూనే వున్నది. వైద్యులూ హెచ్చరిస్తూనే వున్నారు. ఆలోచనలు సక్రమంగా, సవ్యంగా వుంటే ఆరోగ్యం కూడా బాగుంటుంది అనేది సారాంశం అయినప్పుడు వాటి గురించిన సమగ్ర సమాచారం తెలుసుకుంటే మంచిది. అవసరమైతే మీ జీవన శైలిని మార్చుకుంటే .. మరీ మంచిది.
నాలుక చూస్తే రోగం ఎట్లా తెలుస్తుందని డాక్టర్లని అడుగుతున్నారా? అసలా పద్ధతి జడ్జీలకు వుండి వుంటే మన దేశం ఎంత బాగుండేదో!
బీ.పీ. గురించి నాలుగు మాటలు. బీ.పీ అంటే బ్లడ్ ప్రెషర్. రక్తపోటు. మన శరీరంలో గుండె నిరంతరం కొట్టుకుంటూ శరీరమంతటా రక్తం సరఫరా చేస్తుంది. రక్తం రక్తనాళాల గుండా ప్రవహిస్తుంటుంది. వాటిల్లో శుద్ధ రక్తం ప్రవహించే నాళాలని ధమనులని, మలిన రక్తం ప్రవహించే వాటిని సిరలని అంటాం. రక్తం ధమనుల గుండా ప్రవహించేటప్పుడు ఆ రక్తం రక్తనాళాల గోడలమీద కలిగించే ఒత్తిడిని రక్తపోటు అంటాం.
భయం,ఆదుర్దా, ఆందోళన, కోపం, ఆవేశం, ఉద్రేకం .. ఇవన్నీ రక్తపోటుని పెంచుతాయనే విషయం మీరు ఒప్పుకుంటారా? కాబట్టి బీ.పీ. కంట్రోల్ గా వుండాలంటే కోపం, ఆవేశం తగు మోతాదులో వుండాలి. అందుకే ప్రాధమికంగా ఈ లక్షణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవటం అవసరం .
ప్రేమ ఆరోగ్యానికి మంచిది అని అందరూ చెబుతున్నమాట. కౌగిలింతలు రక్తపోటుకు విరుగుడుగా పనిచేస్తాయట. స్పర్శ బోలెడు ఉపశమనాన్ని అందిస్తుందట. కౌగిలిలో ఒదిగినప్పుడు బెసల్ మెటబాలిక్ రేటు పెరుగుతుందట. స్పర్శ మనుషుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందట. స్పర్శ ఒక ఔషధం అంటున్నారు వైద్యులు (కరోనా కు ముందు సుమా). ఎవరికి వారం చక్కలిగింతలు పెట్టుకుని నవ్వలేం. ఎవరో తాకితే కితకితలు కలుగుతాయి. ఎవరు ఏ భావంతో తాకుతున్నారో అవతలి వారికి తెలిసిపోతుంది. ప్రేమతో, ఇష్టంతో ఇస్తున్న స్పర్శా, లేక కసి, కోపం, పగ, కుట్రలతో చేస్తున్న స్పర్శా అని తెలుసుకోగలిగిన శక్తివంతమైనవి మన నాడీ తంత్రులు. తల్లి తాకిందో, మనసుపడిన మరో వ్యక్తి తాకిందో నిద్రలో కూడా తెలుసుకోగలం మనం. ఇప్పుడు స్పర్శ చికిత్సలో ఓ భాగం.
అందుకే మీలో అరిషడ్వర్గాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోండి. అలాగే ఉపకార, అపకార గుణాలు వగైరాలన్నీ .. నేను కరపత్రం చదవటం పూర్తయ్యింది. ఓ సారి సారధి ముఖంలోకి చూశాను. కరపత్రం కవితాత్మికంగా వుందని మెచ్చుకున్నాను.

"నువ్వు చెప్పేదంతా నిజమే. కానీ ఆచరణలో రక్త పరీక్ష ద్వారా వీటిని గురించి ఎలా చెబుతావు అని?" నా సందేహం బయటపెట్టాను.

ఎందుకు చెప్పలేం? రక్త పరీక్ష చేసి నీకు మధుమేహం వుందో లేదో .. వుంటే ఎంత వుందో చెప్పట్లా? రక్త పరీక్ష చేసి నీకు థైరాయిడ్ వుందో లేదో, వుంటే ఏ మాత్రం వుందో చెప్పట్లా? రక్త పరీక్ష చేసేగా కిడ్నీలు, లివరూ ఎట్లా పనిచేస్తున్నాయో చెబుతున్నారు! నీకు ఒళ్ళు దురదలు వచ్చినా, దద్దుర్లు వచ్చినా, రక్త పరీక్ష చేయిస్తున్నారుగా? ఆకలి కావటం లేదూ అంటే రక్త పరీక్ష, ఆకలి ఎక్కువగా అవుతున్నదీ అంటే రక్త పరీక్ష, ఆవులిస్తే రక్తపరీక్ష, తుమ్మినా, దగ్గినా, ఒళ్ళు వెచ్చబడినా, చల్లబడినా, చచ్చుబడినా, చతికిలబడినా .. అన్నింటికీ .. రక్త పరీక్షలేగదా ? ఇన్నింటికి ఉపయోగపడే రక్త పరీక్ష, అసలు వీటన్నింటికీ కారణమయ్యే వాటిని తెలుసుకోవటానికి ఎందుకు ఉపయోగపడదనుకుంటున్నావ్?" అడిగాడు పార్థసారథి.

రక్తపరీక్ష కు వెళ్లినప్పుడు వాళ్ళని "మీరు ఎట్లా పరీక్ష చేస్తారు మా రక్తాన్ని?" అని అడిగే రక్తం ఇస్తున్నారా? పోనీ ఇచ్చాక అడుగుతున్నారా .. లేదే! రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఎంతమందికి ఆ ప్రాసెస్ తెలుసు? మరి నన్నెందుకు అడుగుతారు. నా విధానం నాకు వుంది. నమ్మకముంటేనే రండి. మిమ్మల్ని నేను బలవంతం చేయటంలేదే!.....ఇదీ పార్థసారథి వాదన.

"అవంటే సైన్స్, వాటికో శాస్త్రం వుంది, ఓ పద్ధతి వుంది, ఓ రుజువుంది, ఓ చదువుంది, ఓ సాక్ష్యం వుంది. దీనికేముంది?

"వుంది. దీనికీ వుంది. శాస్త్రం వుంది, ఓ పద్ధతీ వుంది. నీకు నమ్మకం వుండాలి అంతే..."

"ఏమో నేను నమ్మను" మొండిగా అన్నాను కావాలనే.

"నేనేం నమ్మమని అనటంలేదే! నిన్ను బలవంతం చేయటం లేదే. నమ్మితేనే చేయించుకో, నమ్మకం కుదిరాకనే చేయించుకో" అన్నాడు సారధి కూడా మొండిగానే.

"ఒకవేళ నువ్వు చెప్పిందే నిజం అనుకుందాం కాసేపు .. వీటి మూలంగా మనిషికి ఆరోగ్య సమస్యలేమీ వుండవు కదా.. రక్త పరీక్ష చేయించుకోవాల్సిన పనేం వుంది?"

"రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుంది అని అడిగాట్ట నీలాంటి పెద్దమనిషే. అసలు మనకి వచ్చే అనారోగ్యాలకన్నింటికీ మూలం మనసులో కలిగే ఉద్రేకాలని కదా నువ్వు చెప్పే సైన్స్ లో కూడా చెబుతున్నది. ఆ భావావేశాలే .. కామం, క్రోధం, శాంతం, దయ .. ఇవన్నీ అవే స్థాయిలో ఉన్నాయో చెప్పటమే నే చేయబోయేది.. అసలు నీకో విషయం చెప్పాలి. మానసిక అనారోగ్యాలే శరీర అనారోగ్యాలకు దారితీస్తాయని, వ్యాధి అనేది మనసుకే గానీ, శరీరానికి కాదు అనేది హోమియో వైద్యం.

ఒత్తిడి, ఒత్తిడి, ఒత్తిడి .. ఏ వైద్యానికి వెళ్ళినా, ఏ రోగం వచ్చినా, స్ట్రెస్, స్ట్రెస్ అంటున్నారు వినటంలా? అంటే ఏమిటి?మానసిక ఒత్తిడి. మనకి వస్తున్న అనేకానేక రోగాలకి కారణం మానసిక ఒత్తిడి అని వైద్యులే చెబుతున్నారు. మరలాంటప్పుడు మానసిక అనారోగ్యం ఏమిటో ఎంతో తెలుసుకుని, దానికి వైద్యం చేయించుకుంటే, భౌతిక బాధలనుండి విముక్తి పొందవచ్చు కదా!.. ఆలోచించు"

ఓ మాట అడుగుతాను చెప్పు.. ఆ రక్తమే అంతా, ఆ రక్తంలోనే వుంది పౌరుషం, వాడి రక్తంలోనే దాన గుణం వుంది .. లాంటి మాటలు వినే వుంటావుగా? క్షమా గుణం ఆ రక్తం గొప్పతనం, ఇలాంటి డైలాగులు సినిమాల్లో విని, ఈలలు వేయటం, చప్పట్లు కొట్టటం కాదు. నిజ జీవితానికి అన్వయించుకోవాలి. ఆలోచించుకోవాలి. మీ జీవితాలు బాగుచేసుకోవాలి.

అందరి రక్తం ఎర్రగానే వుంటుంది. నిజమే. దాన్ని పరీక్ష చేసేటప్పుడు, ఆ ప్రాసెస్ లో మారే రంగుల్ని బట్టి కొన్ని వ్యాధుల్ని నిర్ధారిస్తున్నారు. మారే ఆకారాల్ని బట్టి కొన్ని నిర్ధారిస్తుంటారు. అలాగే నేనూ ఓ ప్రాసెస్ కనిపెట్టాను. అవసరం అయినప్పుడు నిర్ధారించగలను కూడా. అన్నిటికీ సిద్ధమయ్యే ఇందులోకి దిగాను. దీన్లో మోసం లేదని ఘంటాపథంగా చెప్పగలను.

సారథి  వాక్చాతుర్యానికి వెంటనే సమాధానం చెప్పలేకపోయాను.

అంతలోనే కంప్యూటర్లు, వాటికి సంబంధించిన ఇతర పరికరాలు ఆటోలో వచ్చినై. సిరంజీ పాకెట్లు, దూది బండిల్సు, సిబ్బంది మూతులకు కట్టుకునే మాస్కులు, ఇతర సాధనాలు ఏవేవో ఆ గది నిండా అట్ట పెట్టెలే. అప్పటికే నియమించుకున్న ఇద్దరు కుర్రాళ్ళు వాటినన్నింటిని అందంగా సర్దేస్తున్నారు. రక్త పరీక్షా కేంద్రం పూర్తిగా రూపురేఖల్ని సంతరించుకుంటున్నది. పార్థసారథి ముఖంలో కొత్త వెలుగు స్పష్టంగా కనిపించసాగింది. ఆత్మ స్థయిర్యం కనిపిస్తున్నది..

పార్థసారథి ధైర్యానికి  విస్తుపోయాను. అతని మాటల మీద నమ్మకం మొదలయ్యింది. మోసం లేదంటున్నాడు కాబట్టి అతన్ని ప్రోత్సహించటమే మంచిదనిపించింది. ఆ తర్వాత తన రక్త పరీక్షా ఫలితాలు తెలియచేసే రిపోర్ట్ నమూనా చూపించాడు కంప్యూటర్ లో. ఒక ప్రింట్ కూడా తీసి నా చేతికి అందించాడు పార్థసారథి.

ఆసక్తిగా పరిశీలించాను ఆ రక్త పరీక్ష రిపోర్ట్ నమూనాని ..

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అరిషడ్వర్గాలు | తగినంతలోనే వున్నై | / | కొంచం తగ్గాలి | | | |
| పరోపకారం | ఎక్కువ | / | తక్కువ | / | పరవాలేదు | |
| కోపం | తగ్గాలి | / | పరిమితిలోనే వుంది | | | |
| ఈర్ష్య/ద్వేషం/అసూయ | కొంచం తగ్గాలి | / | తగినంత | / | అస్సలు లేవు | |
| చిత్త శుద్ధి | వుంది | / | లేదు | / | పెరగాలి | |
| స్వార్థం | తగినంతవుంది | / | కొంచం తగ్గాలి | / | లేదు | |
| మోసం | లేదు | / | వుంది | / | కొంచం | |
| బాధ్యత | వుంది / | లేదు | / | తగ్గించుకోవాలి | / | పెంచుకోవాలి |
| డబ్బు యావ | తగినంత | / | తగ్గించుకోవాలి | / | లేదు | |
| అశాంతి | వుంది | / | తగ్గించుకోవాలి | / | లేదు | |

| | | | |
|---|---|---|---|
| ఆడంబరం, అహంకారం | తగినంతవుంది / | తగ్గించుకోవాలి / | లేదు |
| కృతజ్ఞత, జాలి, దయ | తగినంత వుంది / | పెంచుకోవాలి / | లేవు |
| కపటం, కల్మషం | కొద్దిగా వుంది / | తగ్గించుకోవాలి / | లేవు |
| నిరాశ | వుంది / | తగ్గించుకోవాలి / | లేదు |
| దురాశ, అత్యాశ | తగ్గించుకోవాలి / | లేదు | |
| ప్రేమించే గుణం | ఎక్కువ వుంది / | పెంచుకోవాలి / | లేదు |
| భయము | వుంది / | తగ్గించుకోవాలి / | లేదు |
| భక్తి | వుంది / | పెంచుకోవాలి / | లేదు |

మంచి రోజు చూసుకుని రక్త పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించాడు సారధి. ఓ పారిశ్రామికవేత్త, ఓ విద్యావేత్త, ఓ ఆధ్యాత్మికవేత్త, ఓ రాజకీయవేత్త, ఓ మహిళా సాహితీవేత్త, ఈ అయిదుగుర్నీ తన రక్త పరీక్షాకేంద్ర ప్రారంభోత్సవానికి పంచభూతాల్లా వాడుకున్నాడు పార్ధసారథి. యాంకరింగ్ బాధ్యత నాకే అప్పగించాడు. ముగింపు వాక్యాలు నాలుగు చెప్పి ఆనాటి వేడుకను ముగించి వేదిక దిగాను.

ఆ ఆనందంలోనే "తెలుసుకుంటే ఎంత బాగుంటుందీ, తెలుసుకుంటే ఎంత బాగుంటుందీ అని మనసులో అనిపించిన మాటల్ని పాటగా పాడేయటం మొదలుపెట్టాను.

నా కలవరింతకు నిద్రాభంగం అయిందేమో .. ఋషీ ఋషీ అంటూ నన్ను తట్టి లేపాడు మా అన్నయ్య .

పార్ధసారథిని కలిసి నా కలని నిజం చేయమని అడగటానికి నిర్ణయించుకున్నాను. పార్ధసారథి నిర్ణయం ఎలా వుంటుందో చూడాలి.

***0***



# లోపం

ఎం. బిందు మాధవి

మూర్తిగారిల్లు పెళ్ళి సందడితో కళకళ్ళాడుతున్నది. మూడు రోజుల ముందు నుంచీ సంగీత్ లు, మెహిందీలు, పెళ్ళి కూతురిని చెయ్యటాలు...ఓహ్ కళ్యాణికి, మూర్తికి ఊపిరి సలపట్లేదు.

మరునాడు హాల్లో పెళ్ళిలో కలుద్దాం అని ఫ్రెండ్స్ అందరూ రాత్రి భోజనాలయ్యాక ఎవరిళ్ళకి వారెళ్ళారు.

"పల్లవీ పెందలాడే పడుకో! పొద్దున్నే లేపేస్తాను. ఐదు గంటలకల్లా హాలుకి బయలుదేరాలి!" అన్నది కళ్యాణి. పల్లవి ఫోన్లో ఎవరో ఫ్రెండుతో మాట్లాడుతున్నది. అలా మాట్లాడుతూనే, "ఆ! అలాగే మమ్మీ. ఇదిగో వెళుతున్నా!" అంది.

ఫోన్లో మాట్లాడుతున్న పల్లవి మొహంలో రంగులు మారుతున్నాయి.

అప్పటికే నడుం వాల్చిన కళ్యాణి అలిసిన శరీరం నిద్రలోకి జారుకుంది.

మూడింటికి పల్లవి మెల్లగా అమ్మ మంచం దగ్గరకి వచ్చి, "మమ్మీ ఈ పెళ్ళి క్యాన్సిల్ . రేపు హాలుకి వెళ్ళక్కరలేదు. డాడీతో చెప్పు!" అన్నది.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డ కళ్యాణి, చేష్టలుడిగి మంచం మీద లేచి నిటారుగా కూర్చుని "పరాచికాలకిదా సమయం! చాల్లే పిచ్చి వాగుడు. ఎవరయినా వింటే అప్రతిష్ట! అవాచ్యం వాగుడు కట్టిపెట్టు!" అన్నది.

"కాదమ్మా, సీరియస్ గానే చెబుతున్నా! వేణుతో కూడా మాట్లాడా! మేమిద్దరం ఈ పెళ్ళి క్యాన్సిల్ చేసుకుందామని నిర్ణయించుకున్నాం, నిజమే!" అని ఖచ్చితమైన స్వరంతో చెప్పి, అమ్మ లేచిన మంచం మీద పడుకుని ముసుగు తన్నింది.

అవాక్కయిన కళ్యాణి తెప్పరిల్లి, మూర్తి పడుకున్న దగ్గరకి వెళ్ళి, "ఏమండి పల్లవి చూడండి! మతిలేని మాటలు! ఇంతదాకా వచ్చాక ఇప్పుడు మేమిద్దరం పెళ్ళి క్యాన్సిల్ చేసుకుందామనుకుంటున్నాం. మీ తిప్పలు మీరు పడండి అన్నట్టుగా ఒక ప్రకటన చేసి కూల్ గా వెళ్ళి పడుకుంది!" అని కళ్ళల్లో నీళ్ళతో చెప్పింది.

నిద్రలోంచి ఒక్కసారి ఉలిక్కిపడి లేచిన మూర్తి, "అసలేమనుకుంటున్నారు వాళ్ళు! కావలసిన ఆటలు ఆడేసుకుని, నచ్చనివి క్యాన్సిల్ చెయ్యటానికి ఇదేమన్నా బొమ్మలాటా! ఊరూ వాడా అందరిని ఆహ్వానించి,

మూడు రోజుల నించి అన్ని వేడుకలు జరిపించుకోవటానికి పడ్డ శ్రమ, పెళ్ళని కొన్న నగలు, చీరలు, పెట్టుబడి బట్టలు, రిటర్న్ గిఫ్ట్స్, హాల్ రెంట్, క్యాటరింగ్ ఎంత ఖర్చయ్యుంటుందో దానికేమన్నా తెలుస్తున్నదా? ఈ తెలివి ముందేమయింది. మనమేం దాని మెడలు వంచి ఇష్టం లేని పెళ్ళి చెయ్యట్లేదే? అది నిర్ణయించుకున్న వాడే కదా! ఇలా చివరి నిముషంలో క్యాన్సిల్ అయితే దానికి మళ్ళీ పెళ్ళవుతుందా? నలుగురు ఏమనుకుంటారు?" కోపంగా అన్నాడు.

"ఇలాంటివి ఉంటాయనే ఆడపిల్లలకి పెళ్ళి చేసి పంపండని నాన్న చెప్పనే చెప్పారు! మనమే అతి తెలివిగా ఆలోచించి, పెద్దాయన మాట లెక్క చెయ్యక పిల్లని చదివిస్తున్నామనుకున్నాం!"

"ఎంగేజ్మెంట్, సంగీత్ ఫొటోలు తీసుకుని ఫేస్ బుక్ లో పెట్టింది. ప్రపంచమంతా వీళ్ళిద్దరికీ పెళ్ళయిందనే అనుకుంటారు! ఈ వింత ధోరణి దేనికి దారి తీస్తుందో అసలు ఈ కాలం కుర్రకారు ఆలోచిస్తున్నారా! రేపు ఆ ఫొటోలు అవకాశంగా తీసుకుని ఆ అబ్బాయి బెదిరించడని ఏముంది?" అంటూ లేచి షర్ట్ వేసుకుని బయటికి వచ్చాడు.

అప్పటికే కబురు ఇంట్లో నలుగురికి చేరి, ఎవరికి తోచిన వ్యాఖ్యానం వాళ్ళు చెయ్యటం మొదలు పెట్టారు.

తప్పెక్కడ జరిగింది అని కళ్యాణి, మూర్తి తలలు పట్టుక్కూర్చున్నారు!

***

ఈ కాలపు అందరు కుర్రకారు లాగానే పల్లవికి అమెరికా వెళ్ళి ఎమ్మెస్ చెయ్యాలనేది ప్రగాఢమైన కోరిక. బిటెక్ నాలుగో సంవత్సరం నించే అందుకు తగ్గట్టు జీ ఆర్ ఇ, టోఫెల్ వ్రాసి, మంచి స్కోర్ తెచ్చుకుంది. ఒక మంచి యూనివర్సిటీలో ఎడ్మిషన్ తెచ్చుకుంది.

"ఆడపిల్లని బయటికి పంపేటప్పుడు పెళ్ళి చేసి పంపండి!" అన్న మామగారి మాటని కళ్యాణి దంపతులు పెద్దగా పట్టించుకోలేదు. "పల్లవికి డిగ్రీలో మంచి మార్క్స్ వచ్చాయి. అందరిలాగే పై చదువులు చదవాలనుకుంటోంది. ఇంకా చిన్న పిల్లే కదా! కొన్నాళ్ళు చదువుకోవాలనుకుంటున్నది. చదువుకోనివ్వండి నాన్నా!" అన్నాడు మూర్తి.

"పెద్ద వాడిని, అనుభవంతో చెప్పాను. ఇహ మీ ఇష్టం!" అన్నారు రావు గారు.

ప్రయాణపు ఏర్పాట్లు చక చకా జరిగాయి. పల్లవి మూర్తీభవించిన ఆత్మ విశ్వాసంతో అమెరికా ఫ్లైట్ ఎక్కింది.

***

అక్కడ యూనివర్సిటీలో ఉన్న ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్ వారు పల్లవిని సాదరంగా ఆహ్వానించారు. కోరినట్లు అమెరికాలో చదువుకోగలుగుతున్న పల్లవికి రెక్కలొచ్చి ఆకాశంలో విహరిస్తున్నంత ఆనందంగా ఉన్నది.

క్లాసులు, ప్రొఫెసర్స్, లైబ్రరీ, కేఫ్టేరియా అన్నీ కొత్తగా ఉన్నాయి. అయినా తనకి బాగా నచ్చాయి. చదువులో పడిపోయింది. ఫాల్ సెమిస్టర్ అయి క్రిస్మస్ సెలవలిచ్చారు. ఫ్రెండ్స్ అందరూ చుట్టు పక్కల టూరిస్ట్ స్పాట్స్ తిరిగి ఎంజాయ్ చేశారు. స్ప్రింగ్ సెమిస్టర్ క్లాసులు మొదలయ్యాయి.
పొద్దుటి నించీ క్లాసులతో బుర్ర వేడెక్కిపోయి టీ తెచ్చుకుందామని కేఫ్టేరియాకి వెళ్ళిన పల్లవికి తెలుగులో మాట్లాడుతున్న వేణు కనిపించాడు. "హాయ్ మీరు తెలుగు వారా? కొత్తగా వచ్చారా? ఇంతకు ముందు మిమ్మల్ని క్యాంపస్ లో చూడలేదే?" అన్నది.
"అవునండి ఈ సెమిస్టర్ లోనే చేరాను. ఎడ్మిషన్ "ఫాల్ " లోనే వచ్చింది. మా తాతగారు చనిపోయారు. మా నాన్నగారు లేరు. మా అమ్మ ఒక్కతే అన్నీ మేనేజ్ చేసుకోలేదని, సహాయం కోసం ఉండిపోయాను. ఈ సెమిస్టర్ లో చేరతానని స్పెషల్ గా పర్మిషన్ తీసుకున్నాను" అన్నాడు.

ఆ తర్వాత, పల్లవి, వేణు కలిసి చదువుకోవటం, ప్రాజెక్ట్ వర్క్ చేసుకోవటం, కలిసి షాపింగ్ చేసుకోవటంతో బాగా దగ్గరయ్యారు. పల్లవి స్టడీస్ తో బిజీగా ఉన్నప్పుడు వేణు వండి, క్యారేజ్ తీసుకెళ్ళి ఇచ్చేవాడు. ఓ సారి జ్వరం వస్తే నాలుగు రోజులు పక్కనే ఉండి సేవ చేశాడు.

నాలుగేళ్ళ కాలం గడిచింది. ఇద్దరికీ చదువులయిపోయి ఉద్యోగాలొచ్చాయి. ఇక పెళ్ళి చేసెయ్యాలని నిర్ణయించుకున్నారు కళ్యాణి దంపతులు.

పల్లవికి ఫోన్ చేసి "పల్లవీ కమల ఆంటీ నీకు ఒక మంచి సంబంధం చెప్పింది. తన అక్క కొడుకు, అక్కడే అమెరికాలో మంచి కంపెనీలో చేస్తున్నాడుట. నీది చదువు అయిపోయింది కనుక వివరాలు పంపిస్తాను. ఒక సారి చూసి నువ్వు ఓకే అంటే ఈ ఏడు పెళ్ళి చేసేద్దాం అనుకుంటున్నాం" అన్నది కళ్యాణి.
"అమ్మా నువ్వు సంబంధాలేం చూడకు. ఇక్కడ నా క్లాస్ మేట్ వేణు అని ఉన్నాడు. చాలా మంచి అబ్బాయి. మన తెలుగు వాళ్ళే. మా ఇద్దరికీ నాలుగేళ్ళ నించి పరిచయం ఉంది. నా అవసరాలు అన్నీ టైం ప్రకారం కనిపెట్టి చూసుకుంటాడు. అందుకే నాకు అన్ని విధాల సూట్ అవుతాడనిపిస్తోంది. అతనికి తండ్రి లేడు. అతన్నే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఈ సారి ఇండియా వచ్చినప్పుడు నీకు, నాన్నగారికి చెబుదామనుకున్నాను. ఇంతలో నువ్వే పెళ్ళి ప్రస్తావన తెచ్చావు!" అన్నది పల్లవి.

"ఆ అబ్బాయి ముందు వెనకలు మనకి తెలియవు. ఆ అబ్బాయిని మేము చూడలేదు, నిన్ను వాళ్ళ అమ్మగారు చూడలేదు. పెళ్ళనేది ఇద్దరు వ్యక్తులకి సంబంధించిన విషయం కాదు. రెండు కుటుంబాల బంధం. వాళ్ళ కుటుంబ నేపధ్యం మనకి తెలియదు. అలవాట్లు, ఆచార వ్యవహారాలు తెలియవు. మన దేశంలో ఆచార వ్యవహారాలకి, ఆహారపు అలవాట్లకి ప్రాధాన్యత ఎక్కువని నీకు తెలుసు కదా! మీరు ఫ్రెండ్స్ గా ఉన్నంత సేపు ఇవి పెద్ద విషయాలుగా కనపడకపోవచ్చు. విశాలంగా ఆలోచించచ్చు. ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణే కానీ, ఎక్స్పెక్టేషన్స్ ఏమీ ఉన్నట్టనిపించదు! రేపు పెళ్ళయ్యాక, అనుబంధం డ్రాయింగ్ రూం నించి బెడ్రూంకి మారుతుంది. ఒకరి అలవాట్లు ఒకరికి నచ్చకపోవటం, ఒకరి జీవన విధానం ఇంకొకరికి ఆక్షేపణీయంగా ఉండటం జరగచ్చు. ఈ నేపధ్యంలో మీకు మీరు నిర్ణయించేసుకుంటే, రేపు ఏదైనా సమస్య వస్తే పరిష్కారాలు మా చేతిలో లేకపోవచ్చు. మేము చెప్పేవి మీకు నచ్చకపోనూవచ్చు! ఈ తరం వాళ్ళు చదువులో వచ్చే విజయాలని బట్టి వారికి అన్నీ తెలుసనుకుంటున్నారు. చదువు వేరు, జీవితం వేరు! అయినా మీరు నిర్ణయించుకున్నారని చెబుతున్నావు కాబట్టి, వాళ్ళ అమ్మగారి ఫోన్ నంబర్ ఇవ్వు, నేను, నాన్నగారు ఒకసారి మాట్లాడతాము!" అన్నది కళ్యాణి.

వేణు తల్లి పార్వతికి ఫోన్ చేసింది కళ్యాణి. వేణు నాన్నగారికి పార్వతి రెండవ భార్య అని, వేణుకి ఒక చెల్లెలు, ఒక సవితి అన్నగారు ఉన్నారని తెలిసింది. చెల్లెలికి పెళ్ళయింది, బెంగళూరులో ఉంటుంది. సవితి అన్నగారికి, వీళ్ళకి రాకపోకలు బానే ఉన్నాయి. ఆస్తిపాస్తులేమీ లేవు. పార్వతి ఉద్యోగం చేస్తున్నది, సర్వీస్ ఇంకో నాలుగేళ్ళు ఉన్నది అని తెలిసింది.

***

కూతురి కోరిక ప్రకారం కళ్యాణి, మూర్తి దంపతులు పల్లవి పెళ్ళి వేణుతో చెయ్యటానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు అన్నీ సజావుగానే జరిగాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో, పిడుగులాంటి ఈ నిర్ణయంతో అతలాకుతలం అవుతున్నారు.

లేచిన వారందరికీ కాఫీలు ఏర్పాటు చేశారు. "పెళ్ళి ఈ రోజుకి వాయిదా పడిందా, లేక అసలుకే క్యాన్సిల్ అయిందా?" అనుకుంటూ..."ఉండాలా, వెళ్ళాలా" అని తర్జన భర్జన పడుతున్న బంధువులకి ఏం చెప్పాలో తెలియక తికమక పడుతున్న కళ్యాణికి "మేం వెళ్ళొస్తాం, అవసరముంటే కబురు పెట్టు" అని ఒక్కొక్కరే ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

మూర్తి ముందుగా, పెళ్ళి హాలుకి వెళ్ళటానికి బుక్ చేసిన కార్లు క్యాన్సిల్ చేసి, తర్వాత వచ్చి డబ్బు కట్టేస్తామని ఫోన్ చేసి చెప్పాడు. పువ్వుల డెకరేషన్ వారికి ఫోన్ చేసి మండపం అలంకరణ ఆపెయ్యమని, నష్ట పరిహారంగా డబ్బు వచ్చి ఇస్తానని చెప్పాడు.

చిన్నప్పటి నించీ ఆడింది ఆటగా పాడింది పాటగా పెంచిన కూతురు, ఇవాళ నలుగురిలో తమని ఒక దోషిగా నిలబెట్టి, తన భవిష్యత్తుని ప్రశ్నార్ధకం చేసుకున్న పైనానికి, అతిగా కూతురిని నమ్మి స్వేచ్ఛ ఇవ్వటం 'తమ తప్పే' అనుకున్నారు మూర్తి దంపతులు.

ఇంతగా మల్లగుల్లాలు పడుతున్న తల్లిదండ్రులని, అదొక పెద్ద విషయం కాదన్నట్టుగా భావించిన పల్లవి, నిద్ర లేచి వచ్చి తల్లి మొహంలో కనిపిస్తున్న ప్రశ్నలకి సమాధానంగా
"అమ్మా నిన్న రాత్రి నా ఫ్రెండ్ అపర్ణ ఫోన్ చేసింది. దాని పెళ్ళి కిందటి నెల ఐదో తారీకు. అది పెళ్ళయి వెళ్ళిపోయుంటుందని అనుకున్నాను. కానీ దాని పెళ్ళి క్యాన్సిల్ అయిందిట!" అన్నది.

"పెళ్ళికి వారం ముందు ఇక్కడికి వచ్చిన అది, దాని కాబోయే భర్త కలిసి ఓ రోజు గుడికని బయలుదేరారుట. అతను అపర్ణని వాళ్ళింటికి వెళ్ళి పికప్ చేసుకుని, ఏదో అవసరమయి దారిలో అతనింటికి వెళ్ళారుట. ఆ ఇల్లు, వాకిలి మొదటిసారి చూసిన అపర్ణ, ఆ వాతావరణం, ఆ ఇల్లు, సర్దుకున్న తీరు నచ్చక ఇంటికొచ్చి "అమ్మా పెళ్ళయ్యాక ఆ ఇంట్లో ఎప్పటికీ ఉండటం కష్టం. నేను పెరిగిన తీరుకి, వారి అలవాట్లకి అసలు పొంతన కుదరదు. తరువాత నచ్చక రోజూ నేను, అతను కొట్టుకోవాల్సి వస్తుంది. నాకీ పెళ్ళి వద్దు!" అని కేన్సిల్ చేసుకుంది. 'ఇంకా నయం.. ఆ విషయాలు ముందే తెలిసాయి. తరువాత తెలిస్తే కలిసి బ్రతకలేక, విడాకులు తీసుకోలేక నలిగి చావాలి. ఇవన్నీ ఎందుకు, డబ్బు ఖర్చు అని తేలిగ్గా చెప్పేసి, పెళ్ళి ఆపించిందిట!' అపర్ణ ఎంత తెలువైన పని చేసిందో కదా మమ్మీ!" అన్నది పల్లవి. కూతురి మాటలు విన్నాక కళ్యాణికి, మూర్తికి మతి పోయింది.
"చివరి నిముషంలో పెళ్ళి క్యాన్సిల్ చెయ్యటంలో ఒక్క డబ్బు ఖర్చు కోణమే కాదు, సమాజం తమని గురించి ఏమనుకుంటుంది? తల్లిదండ్రుల మానసిక స్థితి ఎలా ఉంటుంది? వాళ్ళకి తగిలిన షాక్ నించి కోలుకోగలరా? అది వారి ఆరోగ్యాలని ఎలా దెబ్బ తీస్తుంది? పెళ్ళికి పిలిచిన ఆహ్వానితులు బయటికెళ్ళి తన తల్లిదండ్రుల గురించి, పిల్లల్ని పెంచటం చేతకాని చవటలుగా ప్రచారం చేస్తారా ... అనే భయం కానీ, సంకోచం కానీ పిల్లలకి కలగకపోవటం వారి పరిణతి లోపమా?"
"ఈ తరం పిల్లలకి ఏం కావాలో తెలియట్లేదు. అన్నీ తమకే తెలుసనుకుంటున్నారు. జీవితం అంటే చదువు, ఉద్యోగం, సంపాదించే జీతం, అది ఇచ్చే స్వేచ్ఛేనా? చదువు అవ్వగానే పెద్ద జీతాలతో ఉద్యోగాలు రావటంతో ఆకాశంలో చుక్కలు వాళ్ళే మొలిపించాం అనుకుంటున్నారు."
ఇలా పరి పరి విధాల ఆలోచిస్తూ కళ్యాణి, పల్లవిని పిలిచి "అపర్ణ పెళ్ళి క్యాన్సిల్ చేసుకుందని నువ్వు క్యాన్సిల్ చేసుకోవటమేంటి? నువ్వెందుకు వద్దనుకుంటున్నావో చెప్పు" అన్నది.
"వేణు వాళ్ళ అమ్మగారు వచ్చే ఏడాది రిటైర్ అవుతారు. అప్పుడు మా దగ్గరకి వచ్చేస్తే, నేను ఆవిడకి సేవలు చేస్తూ బ్రతకాలా? అది నా వల్ల కాదు మమ్మీ! తండ్రి లేని పిల్లల్ని పెంచి పెద్ద చేసిందని వేణుకి తన

తల్లితో అనుబంధం ఎక్కువ! మా అపర్ణ చెప్పినట్టు... ఇంట్లో అడుగడుక్కి ఆవిడ కలగజేసుకుంటే నాకు ఊపిరాడదు. అపర్ణ చెప్పాక నిజమే అనిపించింది. అందుకే 'అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని ' పెళ్ళి ఆపెయ్యమన్నాను" అన్నది.

"జీవితమంటేనే సర్దుబాటు. నలుగురితో కలిసి బ్రతకటం, ఉన్నది నలుగురికీ పంచటం, వారితో ఏర్పడే అనుబంధం... ఇదీ జీవితం! కష్ట సుఖాలు కలిసి అనుభవించటంలో ఒకరికి ఒకరు తోడున్నాం అనే భరోసా, మనిషిని ఆరోగ్యంగా ఉంచుతుంది!"

"ఒక కాయ, పండు చెట్టుకే కాస్తుంది కానీ గాల్లోంచి ఊడిపడదు. అలాగే ఎవరయినా ఒక కుటుంబంలోనే పుడతారు. పెరిగి పెద్దయ్యాక, వారిని పెంచి విద్యాబుద్ధులు నేర్పించి, తన కాళ్ళ మీద తాను నిలబడగలిగే శక్తినిచ్చిన ఆ కుటుంబం ఏమవుతుంది? హఠాత్తుగా మాయమయి పోదు కదా? రేపు నేను, నాన్నగారు అయినా అంతే కదా? మీ ఇంటికొస్తే అలాగే అనుకుంటావా? లోపం మీలో కాదు, మీ చదువుల్లో ఉంది. లోపం కష్టపడకుండా వచ్చేస్తున్న ఉద్యోగాల్లో ఉంది. ఇప్పుడు మీరు వివేకం లేని, సంస్కారం నేర్పని, వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దలేని చదువులు చదువుకుంటున్నారు! పది మందితో ఆనందంగా కలిసి బ్రతకలేని సెల్ఫ్ సెంటర్డ్ బ్రతుకులు మీవి! చదువులు వ్యక్తిగత ప్రయోజనంతో పాటు, సామాజిక బాధ్యతని నేర్పాలి! ఇంక నీతో మాట్లాడటం అనవసరం! నీ ఆలోచనా విధానం మార్చుకోగలిగితే అప్పుడు చెప్పు!" అని నిస్సహాయంగా అక్కడి నించి వెళ్ళిపోయింది కళ్యాణి.

'ఏంటో .. పిల్లలు ఎప్పుడూ పిల్లలుగానే ఉండిపోతారు అనుకుంటారు ఈ పెద్ద వాళ్ళు! మనని ఎప్పుడర్థం చేసుకుంటారో! ఇంతంత చదువుకుని బయట ప్రపంచంలో ఇంత సక్సెస్ఫుల్ గా బ్రతుకుతూ మనని మనం నిరూపించుకుంటున్న స్థితిలో కూడా, ఇంకా పాతకాలంలో లాగా బ్రతకమని చెబుతున్నారు! అనుకున్న పల్లవి ఏమీ జరగనట్టు ఎయిర్వేస్ వాడికి టికెట్ ఎడ్వాన్స్ చెయ్యమని ఫోన్ చేసింది.

ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. ఎవరూ ఎవరితో మాట్లాడుకోవట్లేదు. పల్లవి మాత్రం ఏమీ జరగనట్లు "వేణూ, నా టికెట్ ఎడ్వాన్స్ చేసుకున్నాను. శనివారం బయలుదేరుతున్నాను. నువ్వు కూడా బయలుదేరుతున్నావా? అక్కడ ఎలాగూ ఎవరి వర్క్ ప్లేస్ ప్రకారం వారి దారి వారిదేగా.. ఉంటా!" అని ఒక్క మాట చెప్పేసి, ఫోన్ పెట్టేసింది.

ఎంతయినా కన్న కూతురు కదా, వెళ్ళే ముందు ఎయిర్ పోర్ట్ లో కళ్యాణి "పల్లవీ జరిగిందేదో జరిగిపోయింది. ఒంటరిగా ఉండలేక ఈ లివింగ్ టుగెదర్ అనే పిచ్చి పనులు చెయ్యకు. నీ ఆలోచన మారి, పెళ్ళి చేసుకోవాలనిపిస్తే చెప్పు. మాకు చేతనయిన సంబంధం చూసి పెళ్ళి చేస్తాం!" అని చెప్పి సెండాఫ్ ఇచ్చింది.

పల్లవి అక్కడికెళ్ళాక ఉద్యోగంలో పడి బిజీ అయింది. అప్పుడప్పుడు ఒంటరితనంతో వేణు గుర్తొచ్చి, తను క్యాన్సిల్ చేసుకున్న పెళ్ళి, అమ్మ మాటలు గుర్తొచ్చి క్షణికమైన ఆవేశంలో ఎంత పెద్ద తప్పులు చేస్తామో అనుకుంటూ ఉంటుంది. ఒక్కోసారి దిద్దుకోగలం, ఒక్కోసారి దిద్దుకునే అవకాశం ఉండదు!
ఈ మధ్య కాలంలో నాన్నగారు వెళ్ళిపోయారు. అమ్మ ఒక్కతే ఉంటున్నది. ఇక్కడికి రమ్మంటే, 'నువ్వు ఉద్యోగంలో బిజీగా ఉంటావు. నాకు తోచదు' అంటూ చెప్పేసింది.

అన్నీ పుష్కలంగా ఉండి వడ్డించిన విస్తరి లాగా జీవితం ఉన్నప్పుడు, మనిషికి లొంగుబాటుతనం ఉండదు. తప్పు తెలిసేటప్పటికి కాలం మన చేతిలోంచి జారిపోతుంది అనుకుని, ఆకలికి వండుకునే ఓపిక లేక బ్రెడ్ సాండ్విచ్ తిని పక్క మీద వాలిపోయింది, పల్లవి.

లోపం ఎక్కడుందని ఆలోచిస్తే, జవాబు దొరక్కపోదు!!

***0****

# నన్నూ మీతో వుండనివ్వరూ!

## వేలూరి ప్రమీలా శర్మ




"అప్పుడే ఆరయిపోతోంది... ఇంకో అరగంటలో వీళ్ళు వచ్చేస్తారు!" అనుకుంటూ హడావుడిగా ఇల్లంతా సర్దుతోంది స్వాతి.

"హసీ! మూలగదిలో కర్టెన్లు కట్టమన్నాను, కట్టావా?" సోఫాపై కవర్లు మారుస్తూ కూతుర్ని అడుగుతోంది.

"మమ్మీ.. ఇప్పటికిది నాలుగోసారి అడగడం!" విసుగ్గా సమాధానం చెప్పింది హస్మిత.

"అది కాదే! తాతగారికి ఇల్లు శుభ్రంగా ఉండకపోతే నచ్చదు. ఆయన గదిలో బాత్రూమ్ గుమ్మం ముందర డోర్ మాట్స్ అవీ వేసి, పక్క దుప్పట్లు కొంచెం నీట్ గా సర్దేయ్యి.." అంటూ ఇడ్లీ, సాంబార్ రెడీ చేసే పనిలో మునిగిపోయింది స్వాతి.

తండ్రిని రిసీవ్ చేసుకోడానికి రైల్వే స్టేషనుకి వెళ్లిన సాగర్, కార్ పార్కింగ్ దగ్గర ఒక ముసలామె చలికి ఒణుకుతూ కూర్చోవడం గమనించి, ఆమె దగ్గరగా వెళ్ళాడు.

ఆమె చేతిలో వంద పెట్టి, "అమ్మా? నీకెవరూ లేరా?" అని అడిగాడు.

"ఎందుకులేరు బాబూ? నీలాంటి కొడుకులు ఇద్దరు వున్నారు. కానీ వాళ్ళకి ఇప్పుడు ఈ అమ్మ అవసరం లేక బయటకి గెంటేశారు. అందుకే ఎవరికీ భారం కాకుండా ఈ రైల్వే స్టేషన్లోనే తలదాచుకుంటున్నాను" అంటూ చిరిగిన దుప్పటితో ఒంటిని కప్పుకునే ప్రయత్నం చేస్తోంది.

సాగర్ కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంతలో విశాఖ ఎక్స్ ప్రెస్ ప్లాట్ ఫారం మీదకి వస్తోందని ఎనౌన్సుమెంటు వినబడడంతో గబగబా స్టేషన్ లోనికి దారితీసాడు.

***

మూడు సంవత్సరాలుగా ఉద్యోగ రీత్యా భిలాయిలో ఉంటున్న సాగర్, హస్మిత చదువు కోసం.. స్వాతిని, హస్మితని వైజాగ్ లోనే ఉంచి తానొక్కడే భిలాయిలో ఉంటున్నాడు. తల్లీ, తండ్రీ విజయవాడకు దగ్గర్లో ఇబ్రహీంపట్నంలో సొంత ఇంటిలోనే వుంటూ, ప్రైవేటుగా స్కూలు ఒకటి నడుపుతుండేవారు. ఉన్నది ఒక్కడే కొడుకు అయినా ఎప్పుడో ఏడాదికి ఒకసారి మాత్రమే కొడుకు ఇంటికి వెళ్లేవారు. పండుగలప్పుడు మాత్రం అందరూ ఇబ్రహీంపట్నంలోనే కలిసేవారు. రెండు నెలల కిందటే సాగర్ కి వైజాగ్ ట్రాన్స్ఫర్ కావడంతో ఊపిరి పీల్చుకుంది స్వాతి. అంతలోకే అత్తగారు మరణించడం, మావగారిని ఒప్పించి చివరకు వైజాగ్ తీసుకురావడం.... అనుకోకుండా జరిగిపోయాయి.

***

కొడుకు ఇంట్లో అడుగుపెడుతూనే, హాల్లో ఎదురుగా గోడపై ఉన్న భార్య ఫోటో వంక చూసి మౌనంగా ఉండిపోయాడు సీతారామయ్య.

"నాన్నా! మీ కోడలు స్నానానికి నీళ్లు పెట్టింది. రిఫ్రెష్ అయ్యి వస్తే టిఫిన్ చేద్దురుగాని..." అంటూ తండ్రి చేతికి టవలు అందించాడు సాగర్.

ఇల్లంతా తిరిగి చూస్తున్న సీతారామయ్య, పెరట్లో మూలగా గొలుసుతో కట్టేసి ఉన్న కుక్కని చూసి మొహం చిట్లించాడు.

"ఈ పాడు కుక్కని ఇంకా ఇంట్లోనే ఉంచావా?" కోపంగా అరిచాడు.

"నాన్నా! ఆ కుక్క ముసల్ది అయిపోయింది. ఇన్నాళ్లూ వుండనిచ్చి ఇప్పుడు బయటకి గెంటేస్తే ఎక్కడికి పోతుంది చెప్పండి? అదేమీ చెయ్యదు. మీరు లోపలకి రండి!" అంటూ టిఫిన్ తిందాం రమ్మంటూ డైనింగ్ టేబుల్ వైపు దారితీసాడు సాగర్.

సీతారామయ్యకి మొదట్నుంచీ కుక్కలంటే చాలా అసహ్యం. ఉద్యోగరీత్యా ట్రాన్స్ఫర్ల మీద తిరిగే సాగర్, పదమూడు సంవత్సరాల కిందట ఒక లాబ్రిడార్ కుక్కని తెచ్చి పెంచాడు.

'సీజర్'.. అది లేకపోతే హస్మిత నిద్రపోయేది కాదు. సీజర్ ని ప్రేమగా పెంచుకుంటున్న హస్మిత, లేచిన దగ్గర్నుంచి పడుకునే వరకూ దానితోనే గడిపేది. ఒకరకంగా తండ్రికి దూరంగా ఉన్న బెంగని, తెలీకుండా చేసింది సీజర్.

కానీ సీతారామయ్యకి మాత్రం కుక్కలంటే ఉన్న అసహ్యం వల్ల, కొడుకు ఇంటికి వచ్చినా ఒకట్రెండు రోజుల కన్నా ఉండడానికి ఇష్టపడేవాడు కాదు.

***

కొద్ది నెలల తర్వాత ఒకరోజు...

"నాన్నా! రేపు రాత్రి స్వాతీ వాళ్ళ తమ్ముడి ఇల్లు గృహప్రవేశం ఉంది. పోయిన వారం వచ్చి పిలిచాడు కదా... మీరు 'ఊ' అంటే..."అంటూ అర్ధోక్తిలో ఆగిపోయాడు సాగర్.

"అవును కదూ! మర్చేపోయాను... అమ్మాయిని రెండు రోజులు ముందే పంపకపోయావా? నాకెలాగూ వచ్చే ఓపిక లేదు. మీరు ముగ్గురూ వెళ్ళిరండి" అన్నాడు సీతారామయ్య.

"అదికాదు నాన్నా! మిమ్మల్ని ఒక్కరినీ వదిలి ఎలా వెళ్తాం? అందుకని మా ఫ్రెండ్ నరసింహం లేడూ.... వాళ్ళ కారు డ్రైవరుని రేపు రాత్రికి మీకు సాయం పడుకోమని చెబుదామనుకుంటున్నాను" అన్నాడు సాగర్.

"ఎవరూ?...ఆ మధ్యన ఒక ఆదివారం మన ఇంట్లో భోజనం చేసాడు అతనేనా నరసింహం అంటే?" అని అడిగాడు సీతారామయ్య.

“అవును నాన్నా.  అతనే...” అంటున్న కొడుకుతో
“నాకేమీ పర్వాలేదు... మీరు నిశ్చింతగా వెళ్లి రండి” అన్నాడు.

***

రెండో రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన సాగర్, స్వాతీ... తమ ఇంటి చుట్టూ గుమిగూడిన జనాన్ని చూసి కంగారు పడిపోయారు.  ఏమయ్యిందోనని ఆందోళనగా లోపలికి పరిగెట్టారు.  అక్కడ స్పృహ లేకుండా పడి ఉన్న సీతారామయ్య మంచం పక్కనే కూచున్న పక్కింటి రమేష్... "మరేం పర్వాలేదు...కంగారు పడకండి. నిన్న రాత్రి మీ ఇంట్లో ఏదో గందరగోళం వినపడింది. కానీ కాసేపటికి సర్దుమణిగింది.  ఎందుకో మీ కుక్క చాలాసేపు అరిచి, తర్వాత ఊరుకుంది. మీరందరూ ఇంట్లోనే ఉన్నారనుకుని మేం పెద్దగా పట్టించుకోలేదు. ఉదయం పనమ్మాయి వచ్చి చెప్పాక కానీ తెలీలేదు... రాత్రి దొంగలు పడ్డారని.." అన్నాడు.
"దొంగలా?" అంటూ గాభరాగా తండ్రికి ఏమీ కాలేదు కదా... అని కుదిపి చూసాడు సాగర్.
"కంగారు పడకండి...ఆయన షాక్ వల్ల స్పృహ తప్పారు. అంతే, అంతకన్నా ఏమీ కాలేదు.  ఉదయం డాక్టర్ గారు వచ్చి చూసి వెళ్లారు. మరేం ఫర్వాలేదని ఇంజక్షన్ చేసి వెళ్లారు" అని చెప్పాడు రమేష్.
“ఇంత జరిగితే నాకు ఫోనెందుకు చెయ్యలేదు?” అని అడిగాడు సాగర్.
“ఉదయం చేసాం సార్... ఎన్నిసార్లు చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. మీ మిస్సెస్ నెంబర్ మాకు తెలీదు కదా... అందుకే మీరు వచ్చే వరకు ఇక్కడే కూర్చున్నాం!” అన్నాడు రమేష్.
"చాలా థాంక్స్ అండి" అంటూ, సీజర్ ఎక్కడ వుందోనని పెరట్లోకి పరిగెట్టాడు సాగర్.
గుమ్మం పక్కనే నీరసంగా పడివున్న సీజర్, సాగర్ ని చూడగానే శక్తినంతా కూడదీసుకుని భుజాలపై రెండు చేతులూ వేసి నుంచుని, అతని మెడ దగ్గర మొహం పెట్టి, కుయ్...కుయ్ మంటూ మెల్లగా మూలగ సాగింది.  భయం లేదన్నట్టు సీజర్ వీపు మీద రాస్తూ, దాన్ని ఎత్తుకుని ఇంట్లోకి వచ్చాడు సాగర్.
సీతారామయ్యని చూడగానే ఒక్క దూకు దూకి , కాళ్ళ దగ్గర జేరి నాక సాగింది సీజర్.   మెల్లగా స్పృహలోకి వచ్చిన సీతారామయ్య... కొడుకూ, కోడల్ని చూసి తేరుకున్నాడు.
"నాన్నా! ఎలా వుందీ"అంటూ ఆందోళనగా చూస్తున్న కొడుకుతో.... "రాత్రి ఈ కుక్కే లేకపోతే వాడు నన్ను చంపేసి ఉండేవాడు!  పాపం పిచ్చి మొహంది.. ఎంత పెనుగులాడిందనుకున్నావు! వాడిని తరిమేసేదాకా వదిలిపెట్టలేదు" అంటూనే, ‘నన్నూ మీతో వుండనివ్వరూ’ అన్నట్టు దీనంగా చూస్తున్న  సీజర్ ని ప్రేమగా దగ్గరకి తీసుకున్నాడు.
"అసలేం జరిగింది నాన్నా? రాత్రి డ్రైవర్ సాయం పడుకోలేదా?” అంటున్న కొడుకుతో "వాడివల్లే కదా ఇదంతా జరిగింది.  వాడిని వదలద్దు!" అన్నాడు దగ్గుతూ సీతారామయ్య.
కోపంతో ఊగిపోయిన సాగర్,  నరసింహం ఇంటివైపు దారితీసాడు.

***

గేటు బయట ఆడుకుంటున్న నరసింహం కూతురు చేతులు వెనక్కి పెట్టుకుని ఏదో దాచాలని ప్రయత్నిస్తూ..."హాయ్ అంకుల్" అంటూ సాగర్ ని పలకరించింది.

ఇక్కడున్నావేంటమ్మా? అంటున్న సాగర్ దృష్టి, ఆ పిల్ల చేతిలో ఉన్న ఫోటో మీద పడింది. ఆ ఫోటోలో ఉన్నది మరెవరో కాదు... తాను రైల్వే స్టేషను దగ్గర చూసిన పెద్దామే! చలికి వణుకుతూ అవస్థ పడుతున్న ఆమె.. 'కొడుకులు గెంటేశారని' చెప్పడం సాగర్ కి ఇంకా గుర్తుంది.

'ఈ ఫోటో నీకెక్కడిది?' అని అడగబోతుండగా...

"ఈమె... మా నానమ్మ! నానమ్మ అంటే నాకు చాలా ఇష్టం. కానీ మా డాడీ, నానమ్మను కలవనివ్వరు! అందుకే ఈ ఫోటో బయటకి తెచ్చుకుని నానమ్మతో బోలెడు కబుర్లు చెప్పుకుంటాను!" అంటూ అమాయకంగా చెప్పుకుపోతోంది.

సాగర్ రాకను పసిగట్టిన నరసింహం, గట్టిగా అరుస్తూ "వాచ్ మన్! ఆ గేటు మూసెయ్యి. ఎవ్వరినీ లోనికి రానివ్వద్దు!" అంటూ గట్టిగా అరుస్తున్నాడు.

అప్పటికి గానీ అర్ధం కాలేదు సాగర్ కి 'నరసింహం తన ఇంటికి ముందు రోజు రాత్రి డ్రైవర్ ని ఎందుకు పంపాడో!'

"ఓరి త్రాస్టుడా! తల్లినే తరిమేసినవాడివి... దొంగతనాలు చేయించడం నీకో లెక్కా? పోలీసులకి పట్టిస్తే కానీ నీకు పట్టిన కిలం వదలదు"...అనుకుంటూ సాగర్ పోలీసు స్టేషను వైపు దారితీసాడు.

***0***



# నన్ను క్షమించండి

**నిష్టల సుబ్రహ్మణ్యం**

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటవ నెంబరు ప్లాట్ ఫారం మీద ఆగింది. సుబ్బారావు ఎస్ త్రీ కోచ్ వెదుక్కుంటూ వెళ్లి, అప్పుడే బోగీలోంచి దిగుతున్న రామూర్తిని ఆప్యాయంగా పలుకరించి, చేతిలో బేగ్ అందుకుంటూ "ప్రయాణం బాగా సాగిందా?" అడిగాడు.

"ఆహా! భేషుగ్గా! రిజర్వేషన్ ఉంది కదా!" అన్నాడు రామ్మూర్తి.

"నిజమే, అక్కడ పడుకుంటే, ఇక్కడ లేవడమే. రిజర్వేషన్ ఉంది కదా!" అన్నాడు నవ్వుతూ సుబ్బారావు. కబుర్లు చెప్పుకుంటూ, ఇద్దరూ స్టేషన్ బయటకు చేరుకున్నారు.

గతంలోకి వెళితే, వీరిద్దరి పరిచయం గమ్మత్తుగా జరిగింది. సుబ్బారావుకి చిన్నప్పటి నుంచి, కష్టాలు ఎక్కువ. వయసు ఉండగా, ఉద్యోగానికి కావలసిన అర్హతలు లేక, సరైన ఉద్యోగం లేక ఏదో ఇన్సూరెన్స్ పాలసీలు చేయించడం, వచ్చిన కమిషన్ తోనూ, ఏదో ప్రైవేట్ పనులు చేసుకుంటూ, సంసారాన్ని నెట్టుకు వస్తున్నాడు. ఎలాగో కూతురికి పెళ్లి చెయ్యగలిగాడు. ముందు నుంచి సాహిత్యం అంటే ఇష్టం. హైదరాబాద్ లో ఉన్న ఒక సాహిత్య సంఘంలో సభ్యుడిగా చేరాడు. వాట్సప్ ధర్మమా అని, తన రచనలు సాహిత్య సంఘానికి పంపుతూ, మిగిలిన సభ్యుల రచనలు ఎంజాయ్ చేస్తున్నాడు. ఏదో కాలక్షేపమే కాకుండా, తన రచనాశక్తికి పదును పెట్టినట్లు అవుతోంది. ఈ సందర్భంలోనే రామ్మూర్తితో పరిచయం ఏర్పడింది. రామ్మూర్తి హైదరాబాద్ లోనే ఉంటాడు. బ్యాంకులో ఉద్యోగం. ఒకసారి సాహిత్య సంఘం వాళ్ళు ఏర్పరిచిన, సాహితీ సదస్సుకి సుబ్బారావు వెళ్ళడం జరిగింది. అక్కడ ఇద్దరు కలుసుకున్నారు. తమ తమ సాహిత్యానుభవాలు పంచుకున్నారు. ఆ విధంగా ఇద్దరి పరిచయం బాగా పెరిగింది. ఇప్పుడు విశాఖపట్నంలో తన బంధువుల ఇంట్లో జరిగే పెళ్లికి రామ్మూర్తి వచ్చాడు. పెళ్లివాళ్ళ ఇంటికి వెళ్ళకుండా, సుబ్బారావు ఇంటికి వచ్చాడు. వాళ్ళ స్నేహం అంతలా గట్టిపడింది.

సుబ్బారావు ఇల్లు వచ్చింది. ఆటో దిగి, సుబ్బారావు ఇంట్లోకి దారి తీస్తూ, "రండి రామ్మూర్తి గారూ!" అంటూ ఇంట్లోకి ఆహ్వానించాడు. వీళ్ళ పరిచయం ఇంకా ఏకవచనంలోకి రాలేదు. లోపల నుంచి వచ్చిన భాగ్యం, ఒక గ్లాసుతో మంచి నీళ్లు అందిస్తూ, "బాగున్నారా అన్నయ్యగారూ! వదిన గారు, పిల్లలు బాగున్నారా?" అంటూ పలకరించింది.

"బాగున్నారు చెల్లెమ్మా!" అన్నాడు రామ్మూర్తి మంచి నీళ్ళ గ్లాస్ అందుకుని. అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుంటూ, "మీ జానకి విషయం ఏమయింది? ఒక కొలిక్కి వచ్చిందా చెల్లెమ్మా?" అడిగాడు.
"అలాగే ఉంది అన్నయ్య గారూ! లక్ష రూపాయిలు కట్నం బాపతు బాకీ, ఇస్తే గాని అమ్మాయిని కాపురానికి తీసుకువెళ్ళమని మొండికేసి కూర్చుంది మా వియ్యపురాలు. పెళ్లి జరిగి, అపుడే రెండు సంవత్సరాలు గడిచాయి. వియ్యంకుడు మంచివాడే, కానీ ఆవిడగారి నోటికి జడిసి, ఈయన నోరు విప్పడు. ఇప్పుడు మేము లక్ష రూపాయిలు ఎక్కడ నుంచి తెస్తాం? ఈయన మాత్రం కథలు, కవిత్వాలు అంటూ తిరుగుతున్నారు. ఎవరో ఒక పాలసీ తీసుకుంటే గానీ, కమీషన్ రాదు. అటువంటిది, ఇప్పుడు లక్ష రూపాయలు ఎక్కడ నుంచి తెస్తాము? మా అబ్బాయి నిన్న గాక మొన్న ఉద్యోగంలో చేరాడు. కనీసం ఒక ఏడాది అయితే గాని ఆఫీసులో లోన్ పెట్టడానికి అవదట. మీ బావగారు ఏమి పట్టించుకోరు."
"బాగుంది నీ వరస! నువ్వే అంటున్నావు కదే! కమీషన్ వస్తే గాని ఇల్లు గడవని పరిస్థితి."
"అది సరే, అన్నయ్య గారూ! మీ ఇల్లు బాగా పాడయిపోయింది, రిపేర్లు చేయించాలి అన్నారు కదా! చేయించారా?"
“ఇంకా లేదు. ఏభై వేలు అవుతుందిట. దాని కోసమే వచ్చాను. ఇక్కడ మా మేనమామ ఉన్నాడు అని చెప్పాను కదా, ఆయన్ని డబ్బులు అడుగుదాం అని వచ్చాను. పెళ్లికి వచ్చినట్లు ఉంటుందీ, డబ్బులు కోసమూ వచ్చినట్లు ఉంటుందని వచ్చాను.'
సుబ్బారావు కలుగజేసుకుని, "సరే భాగ్యం! ఇవి ఎప్పుడూ ఉండేవే! కాస్త కాఫీ ఇచ్చి, టిఫిన్ ఏర్పాట్లు చూడు" అన్నాడు.
ఆ రోజు సాయంత్రం, రామ్మూర్తి తను వెళ్లవలసిన పెళ్లికి వెళ్తూ, సుబ్బారావుని కూడా రమ్మన్నాడు. కానీ సుబ్బారావు సున్నితంగా తిరస్కరిస్తూ, "నేనెందుకులెండి, నాకు వాళ్ళు ఎవరో తెలియదు. మీరు వెళ్లి రండి" అన్నాడు. రామ్మూర్తి పెళ్లికి వెళ్ళిపోయాడు.
రామ్మూర్తి వెళ్ళిపోయాక, భాగ్యం మాట్లాడుతూ, "ఏమండీ! అమ్మాయిని కాపురానికి ఎప్పుడు పంపిస్తామో, ఎలా పంపిస్తామో అర్థం కావడం లేదు" సుబ్బారావు చికాకుగా "చూద్దాంలే భాగ్యం! అ దేముడే ఏదో ఒక దారి చూపిస్తాడు." అన్నాడు.
రాత్రి పెళ్లి నుంచి రామ్మూర్తి తిరిగి వచ్చాడు. ఏదో పని మీద బయటకు వెళ్ళిన సుబ్బారావు కూడా సరిగ్గా అప్పుడే ఇంటికి వచ్చాడు. వస్తూనే, "భాగ్యం! ఇదిగో ఈ డబ్బులు లోపల పెట్టు. ఇవాళ చీటీ పాడేసాను. ఏభై వేలు వచ్చింది. ఇంకా ఏభై వేలు కావాలి. చూద్దాములే. ఆ దేముడే ఇస్తాడు" అంటూ భార్యకు ఒక నీలి రంగు కవర్ అందించాడు. భాగ్యం కవర్ అందుకుంటూ, "అమ్మా జానకీ! ఇది లోపల దేముడి దగ్గర పెట్టమ్మా!” అని కూతుర్ని పిలిచి ఇచ్చింది. జానకి మౌనంగా ఆ కవరు తీసుకుని లోపలకు వెళ్లింది. రామ్మూర్తి ఆ కవరు కేసి చూస్తూ 'మీకూ అదే కావాలి, నాకూ అదే కావాలి' అని మనసులో అనుకున్నాడు. తరువాత రామ్మూర్తి కొంచెం సేపు సుబ్బారావుతో మాట్లాడుతూ కూర్చున్నాడు. తరువాత అందరూ నిద్రకు

ఉపక్రమించారు. పడుకున్నారన్న మాటే కానీ, ఎవరికీ మనసు స్థిమితంగా లేదు. సుబ్బారావుకి, భాగ్యానికి, కూతురు గురించి బెంగ. రామ్మూర్తికి ఇల్లు రిపేరు చేయించాలని బెంగ. 'ఇల్లు బాగా పాడైపోయింది. దెయ్యాల కొంప లాగా ఉంది' అనుకున్నాడు.

మరునాడు, ఉదయం రామ్మూర్తి తన మేనమామని కలియడానికి వెళ్లాడు. సుబ్బారావు కూడా ఏదో పనిమీద బయటకు వెళ్లాడు. సాయంత్రం, రామ్మూర్తి తన మేనమామ ఇంటి నుంచి వచ్చాడు. బుర్ర నిండా విపరీతంగా ఆలోచనలు. తను చేయబోయే పని మీద ఏదీ తేల్చుకోలేకబోతున్నాడు. అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇంటికి వచ్చేసరికి, సుబ్బారావు ఇంకా రాలేదు. భాగ్యం, ఏదో కబురు వచ్చి ఆ ఊర్లోనే ఉన్న వాళ్ళ అన్నయ్య ఇంటికి వెళ్లిందిట. రేపు రాత్రి వస్తుందిట. రాత్రి పది అయింది. సుబ్బారావు ఇంకా ఇంటికి రాలేదు.

జానకి, "మామయ్య గారూ! నాన్న వచ్చేసరికి ఆలస్యం అవుతుందేమో, మీరు భోజనం చేసేసి పడుకోండి. తెల్లవారు ఝామునే మీ ట్రైన్ ట కదా! అమ్మ చెప్పింది" అంది.

"లేదమ్మా! నాకు అన్నం తిన బుద్ధి కావడం లేదు. నేను పడుకుంటాను. నాన్న వస్తే చెప్పు. తెల్లవారు ఝామున నాలుగు గంటలకి లేవాలి. అలారం పెట్టమని చెప్పు!" అని పడుకున్నాడు. అతని దృష్టి అంతా పొద్దుట సుబ్బారావు తన భార్యకు ఇచ్చిన నీలి రంగు కవర్ మీదే ఉంది. తెల్లవారింది. భాగ్యం ఇంట్లో లేకపోవడం వలన జానకి పొద్దుటే లేచి, ఇంటి పనిలో పడింది. రామ్మూర్తి పడుకున్న మంచం ఖాళీగా ఉంది. మామయ్య గారు తెల్లవారు ఝామున వెళ్లిపోయి ఉంటారు అనుకుంది.

వంటింట్లోకి వెళ్లి, కాఫీ కలిపి, ఒక కప్పు కాఫీ తండ్రికి ఫ్లాస్క్ లో పోసి, తను ఒక కప్పు తీసుకుని తాగుతూ, యథాలాపంగా పూజాగది కేసి చూసింది. పూజాగది తలుపులు తీసి ఉన్నాయి. ఎప్పుడూ ఆ గది తలుపులు దగ్గరగా వేసి ఉంటాయి. 'అదేమిటీ? తలుపులు బార్లా తీసి ఉన్నాయి' అనుకుంది. ఈలోగా సుబ్బారావు లేచి, పెరట్లోకి వెళ్లబోతూ, కూతుర్ని చూసి ఆగి, ఏమిటి విషయం? అన్నట్లు చూసాడు. జానకి పూజాగది కేసి చూపిస్తూ "నాన్నా! పూజాగది తలుపులు నువ్వు తీశావా? తిరిగి మళ్ళీ వెయ్యలేదా?" అని అడిగింది.

సుబ్బారావు "లేదమ్మా! నేను తియ్యలేదే!' అన్నాడు. ఒక్కసారిగా తన కూతురు నిన్న పూజాగదిలో డబ్బు పెట్టిన విషయం గుర్తుకు వచ్చి, పరిగెత్తినట్లుగా పూజాగదిలో అడుగు పెట్టి, నీలి రంగు కవరు కోసం చూసాడు. కవరు లేదు. ఒక్కసారిగా ఖంగుతున్నాడు. గుండె జారిపోయింది. ఇంట్లో దొంగలు పడ్డారా? ఇంట్లోకి ఎవరూ రావడానికి వీలు లేదే! తెల్లవారు ఝామున రామ్మూర్తి బయటకు వెళ్ళాక, వీధి తలుపులు జాగ్రత్తగా వేసి, వచ్చి పడుకున్నాడు. ఒకవేళ రామ్మూర్తి, ఏమైనా.... 'ఛ ఛ! ఆయన అలాంటివారు కాదు. అయినా, ఏమో . డబ్బు అవసరం ఏమైనా చేయిస్తుంది' అనుకున్నాడు. అయినా నిన్న వాళ్ళ మేనమామ ఇంటికి వెళ్లాడు కదా! ఆయన డబ్బు ఇవ్వలేదా?'

"ఏమిటి నాన్నా! అలా చూస్తున్నావు?" అడిగింది జానకి.

"ఏమీ లేదమ్మా! అవునూ, నిన్న డబ్బులు ఇక్కడే పూజాగదిలో పెట్టావు కదా!"

"లేదు నాన్నా! నిన్న నా బట్టలు మంచివి కాదు అని, అమ్మ పూజాగదిలో పెట్టమన్నా, నేను బీరువాలో పెట్టాను" అంది.

సుబ్బారావు “హమ్మయ్య!” అనుకుని, గదిలో బీరువా దగ్గరకు వెళ్ళాడు. బీరువా తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

"బీరువా తాళం వెయ్యలేదా?" చికాకుగా అడిగి, వెంటనే తలుపులు తీసి చూసాడు. నీలి రంగు కవర్ భద్రంగా ఉంది. వెంటనే తీసి చూసాడు. కవర్ కొంచెం బరువుగా ఉంది. ఓపెన్ చేసి చూసాడు. తను తెచ్చిన ఏభై వేలు మాత్రమే కాకుండా మరొక ఏభై వేలు ఉన్నాయి. తనకేమీ అర్ధం కాలేదు. ఆ కవరులో ఒక కాగితం కనిపించింది. తీసి చూసాడు. అది రామ్మూర్తి రాసింది. అందులో...

"డియర్ సుబ్బారావు గారూ! నిన్న మా మేనమామ నాకు ఏభై వేలు ఇచ్చాడు. మా ఇల్లు రిపేర్లు కి సరిపోతుంది, కాని, మీ సమస్య చూసాక, నాకు చాలా బాధ అనిపించింది. అన్నెం పున్నెం ఎరుగని మీ జానకి, కట్నం వంకతో, పెళ్లి అయి కూడా, పుట్టింట్లోనే ఉండిపోవడం నేను జీర్ణించుకోలేక పోతున్నాను. అందుకనే, మా మేనమామ నాకు ఇచ్చిన యాభై వేలు మీకు ఇస్తున్నాను. మీ అమ్మాయిని అత్తారింటికి పంపించండి. నేను ఇల్లు ఎప్పుడైనా రిపేరు చేయించుకుంటాను. తొందర లేదు. మీరు, ఇస్తే తీసుకోరని, మీకు తెలియకుండా బీరువాలో పెట్టాను. నన్ను క్షమించండి మీకు చెప్పకుండా మీ బీరువా ఓపెన్ చేసాను. అన్యధా భావించవద్దు."

ఆ ఉత్తరం చూసి, సుబ్బారావు నిలువునా కుచించుకు పోయాడు. ఒక్క క్షణం డబ్బులు కనబడక పోయేసరికి, తాను ఎంత దిగజారిపోయి రామ్మూర్తిని అనుమానించాడు? 'నన్ను క్షమించండి రామ్మూర్తి గారూ!' అని అనుకోకుండా ఉండలేకపోయాడు.

***0***

# నాన్నంటే

ఏ. ఎన్. జగన్నాథ శర్మ




నాన్నంటే ముద్దు! నాన్నంటే మెరుపు! నాన్నంటే స్పర్శ! నాన్నంటే సువాసన! నాన్నని గురించి నాకంతే తెలుసు.

నాకు ఏడెనిమిదేళ్ళ వయసున్నప్పుడు, నాన్న వయసెంతన్నదీ నాకు తెలియదు గాని, నాన్న పొట్టిగా ఉండేవారు. గుమ్మడి గింజలా పచ్చగా ఉండేవారు. గావంచాను చుట్టుకొని, పైన లాల్చీ ధరించేవారు.

వేడి శరీరమట! యవ్వనం నాటికే నాన్న తల నెరిసిపోయిందట! అమ్మ చెప్పింది. ఫలితంగా శిరసు మీద మేఘ శకలాల్ని ఉంచుకున్నట్టుగా తెల్ల తెల్లని పొడుగాటి శిరోజాలతో చూడ ముచ్చటనిపించే వారాయన. నాన్న పుట్టి, కను విప్పి, నాన్నమ్మను చూడనేలేదట! నాన్నమ్మ కనుమూసిందట! తాతయ్య నాన్నను పెంచి, పెద్ద చేశారని అంటుందమ్మ. అమ్మను, నాన్నకి ముడివేసి, తాతయ్య స్వర్గస్తులయ్యారనీ చెప్పింది. పెళ్లయిన మూడేళ్లకి అక్క పుట్టింది. తరువాత నేను పుట్టాను. నేను పుట్టిన మూడేళ్ల వరకు నాన్న మంచిగా ఉండేవారట! దగ్గరుండి, వ్యవసాయాన్ని చూసుకునేవారట! ఇంటిపట్టునుండేవారట! పెరట్లో పొట్ల పాదును వేసేవారట! మల్లె మొక్కలను నాటేవారట! ముద్దబంతి పూల నడుమ, పొద్దికగా నిలిచేవారట! తరువాత ఏమయిందని అంటే అమ్మ అక్కుళ్ళు బుక్కుళ్ళుగా రోదించడమే గాని, ఏమీ చెప్పేది కాదు. రెట్టించి అడిగితే 'కథ ఏమిటి' అని విసుక్కునేది. నాన్నంటే కథని అమ్మకి తెలియదు పాపం!

వ్యవసాయంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో నాన్న వ్యాపారం చేసేవారట! కొండ కోనల్లో నివసించే కోయదొరల నుంచి కరక్కాయలు, ఇండుపిక్కలు, వనమూలికలు, తేనె కొనుగోలు చేసి, ఇక్కడ మా ఊరిలో వాటిని అమ్మజూపేవారట! లాభం సంగతలా ఉంచితే, ఆ వ్యాపార వ్యవహారం వల్ల నాన్ననే, అమ్మ నష్టపోవాల్సి వచ్చిందంటుంది.

నాకు నాలుగేళ్ళు వయసున్నప్పుడు, మా ఇంటి మీదకి ఖాకీ కాకులు దాడి చేశాయట! నాన్నని ప్రశ్నలతో పొడుచుకు పొడుచుకు తిన్నాయట! నాన్న పుస్తకాల్ని ముక్కున కరచి పట్టుకు పోవడమే గాక, నాన్నని చుట్టుముట్టి లాక్కుపోయాయట! 'ఎందుకు లాక్కుపోయాయవి' అనడిగితే కారణాలు చెప్పదమ్మ .. కన్నీళ్లెడుతుంది.
'పురాణమా! ఏమిటి' అంటుంది. నాన్నంటే పురాణమని పిచ్చి తల్లికి తెలియదు!

ఆస్తినంతటినీ అమ్మి, కాకుల బారి నుంచి నాన్నని రక్షించుకుందామనుకుందట. అయినా వాళ్ళని సంప్రదించిందట కూడా! కానీ వీలు పడనీయక, కాకిగూడు లోంచి తప్పించుకొని కొండల్లోనికి నాన్న పారిపోయారట! ఓ సంవత్సర కాలం కన్పించనేలేదట! నాకప్పటికీ అయిదేళ్ల వయసట! బళ్లో వేశారు నన్ను. 'న' కు దీర్ఘమిస్తే 'నా' 'న' కింద 'న' రాస్తే 'న్న' 'నాన్న' అని రాత్రి వేళల అక్క నాకు పాఠాలు చెబుతూంటే ముక్కెగ బీలుస్తూ మవునంగా కరిగిపోయేది.
'అదేం పాఠమే' అనేది. నాన్నంటే పాఠమని తెలుసుకోలేని పెర్రి బాగుల్దమ్మ!

ఒకానొక రాత్రి నా బుగ్గల మీద పెదవులూనిన స్పర్శ కలిగింది. మరుక్షణంలో గరుకుతనం తగిలి గిలిగింతలొచ్చాయి. కను విప్పి చూద్దునో! అమ్మ హరికేన్ లాంతరు ఎత్తి పట్టి నిలచి కన్పించింది. ఓ పక్క అమ్మ అలా నిలిచి ఉంటే, మరో పక్క పొట్టిగా గుమ్మడి గింజలా పచ్చగా, గావంచాను చుట్టుకుని ఉన్న వేరెవరో నిలిచి ఉన్నారు. నిద్ర చెదిరిపోయింది. లేచి మంచమ్మీద కూర్చున్నాను. 'ఎవరమ్మా' అడిగాను. జవాబు చెప్పలేదమ్మ. చిరునవ్వు నవ్వింది. నన్ను తన వొడిలో కూర్చోబెట్టుకున్నారాయన.
'ఏం చదువుతున్నావు' అనడిగారు.
'ఒకటో తరగతి' అని చెప్పాను.
'వాడికి వారాల పేర్లన్నీ వచ్చు' అన్నదక్క.
'నిజమా' ఆశ్చర్యపోయారాయన. కళ్ళు పెద్దవి చేసి, నన్ను మెచ్చుకోలుగా చూశారు.
'చెప్పనా' అడిగాను. ఆయన చెప్పమన్నట్టు తలూపారు.
'ఆదివారమొకటి, సోమవారం రెండు, మంగళవారం మూడు, బుధవారం నాలుగు, గురువారం అయిదు, శుక్రవారం ఆరు, శనివారం ఏడు. ఈ ఏడున్నూ వారముల పేర్లు' వల్లించాను. సంబరపడ్డారాయన. సందిట మరింతగా నన్ను బిగించారు. ముద్దులాడారు. ఆయన పెదవులు గమ్మత్తయిన వాసన వేశాయి. మళ్ళీ మళ్ళీ బుగ్గన ముద్దులిడితే బాగుణ్ణనిపించింది.
అమ్మ వేరుశెనగకాయలు వేచి తెచ్చింది. చేటలో పోసి ఉంచింది. ఇంత బెల్లమ్ముక్కను కూడా చెంతనుంచింది. 'తింటావా' అడిగారాయన.

'అపరాత్రి వేళ తిన్నది, అరగించుకోలేదు! వాడికొద్దులెండి' అన్నదమ్మ.

వొలిచి, వేరుశెనగ పలుకులు గుప్పిళ్ళుగా ఆయనకి అందించసాగింది. ఓ చేత్తో నా తల నిమురుతూ కూర్చున్నారాయన. నిద్ర కమ్ముకొస్తుంటే ఆయన గుండెలపై వొరిగి వెచ్చ వెచ్చగా నిద్రపోయాను. తెల్లారి లేచి చూసే సరికి ఆయన వళ్ళో లేను నేను. యథాప్రకారం మంచమ్మీద ఉన్నాను.

'రాత్రి వచ్చిందెవరే' అడిగానమ్మను.

'ఎవరొచ్చారు? ఎవరూ లేదే' అన్నదమ్మ. చల్ల చిలికే కవ్వం కోసం వెతుకులాట ప్రారంభించింది. 'పొట్టిగా ఉన్నారు చూడు! నన్నాయన ముద్దు పెట్టుకున్నారు చూడు! నేనాయన వళ్ళో పడుకున్నాను చూడు, ఆయనొచ్చారు కదే' అంటే...

'కలగని ఉంటావు' అన్నదమ్మ.

'బలే కల' అన్నానేన్ను.

నాన్నంటే కలని అమ్మకి తెలియదు గాక తెలియదు! 'పొట్టిగా ఉన్నారు చూడూ నన్నాయన ముద్దు పెట్టుకున్నారు చూడు... ఈ రగ్గంతా ఆయన వాసనేస్తోంది' అని చెప్పాను.

అమ్మ పక్కన అక్క కూడా నిలిచి ఉన్నదప్పుడు. 'ఆయన ఎవరనుకున్నావు' అన్నదక్క. 'ఎవరే' అడిగాను. ఆత్రంగా లేచి కూర్చున్నాను. చెప్పేందుకు అక్క నోరు తెరిచిందోలేదో .. అమ్మ, అక్క ప్రయత్నాన్ని నివారించింది.

'ఎవరయితే నీకెందుకురా! పడుకో! పడుకో' అంది. 'వెధవకి అన్నీ కావాలి' అంది.

'అన్నీ అక్కర్లేదే! నాన్నొక్కరే కావాలి' అందామనుకున్నాను. అమ్మ కోపగించుకుంటుందని మిన్నకున్నాను.

మర్నాడు వరండాలో కూర్చుని, ఎండని కాగుతూ అక్క స్వెట్టర్ అల్లుతోంది. సూదుల్ని చిత్రాతి చిత్రంగా తిప్పుతోంది. అటలా ఉందది!

'నాకా' అడిగానక్కని.

'కాదు. నాన్నకి' అన్నది.

'నాన్నెక్కడున్నారే చెప్పవూ' ప్రాధేయపడ్డాను.

దూరంగా కొండల్ని చూపించింది. కొండల్లోంచి ఎగసి వస్తోన్న సూర్యుణ్ణి చూపించింది. చూపించి 'అక్కడ ఉన్నారు' అని నవ్వింది. నన్నాటపట్టిస్తూందనుకున్నాను. ఉక్రోషంగా దాని వీపున దబా దబా బాది చేతికందక వీధిలోనికి పరుగెత్తి పోయాను.

తర్వాత్తర్వాత అక్క అల్లుతూన్న స్వెటర్ పూర్తి కావస్తూంటే, అది నాన్న కోసమని తెలిసి తెలిసీ, దాన్ని చేతుల్ని నా మెడ చుట్టూ వేసుకునే వాణ్ణి. వదులు వదులుగా స్వెట్టర్ చేతులు నా మెడనంటి ఉంటుంటే నన్నెవరో అక్కున చేర్చుకున్నట్టనిపించేది. నాన్న ఇలా ఉంటారని, అనుకునేందుకు నాన్న ఫోటో కూడా ఇంట్లో లేదు. ఆయనేనాడూ ఫోటో తీసుకోలేదట! తాతయ్య తైలవర్ణ చిత్రం ఉంది. దానిని చూపించి 'అచ్చం

ఇలానే ఉంటారు' అన్నదక్క ఓసారి. నాటి నుంచి నాన్నని చూడాలనిపించినప్పుడల్లా తాతయ్య తైల వర్ణ చిత్రం చూసి మురిసిపోయేవాడిని.

అక్క .. నాన్న కోసం అల్లుతూన్న స్వెట్టర్ పూర్తయింది. ఆనాడు అక్క సంతోషం అంతా ఇంతా కాదు! స్వెట్టర్ని భుజాల దగ్గర పట్టి నిలిపి, దానిని నిండుగా చూసుకుంది. అమ్మను కేకేసి చూపించింది.
'తీసుకెళ్లి నాన్నకెప్పుడిస్తావు' అడిగాను అక్కని.
'నాన్నే వచ్చి తీసుకుంటారు' అన్నదక్క.
'ఎప్పుడొస్తారే' ఉత్సాహంగా అడిగాను.
'ఎప్పుడో ఒకప్పుడొస్తారు! రాకపోతే రారు! దేవుడా ఏం' అన్నదమ్మ.
నాన్నంటే దేవుడని అమ్మ గుర్తించలేకపోతోంది!

ఓ చలి రాత్రి ఎవరో వచ్చిన అలికిడి. సోకీ సోకని వాసన. నా దగ్గరకి నడిచి వస్తూన్న సుగంధాన్ని అమ్మ అడ్డగించింది. 'పలకరిస్తే చాలు! పసిగడుతున్నాడు వెధవ' అన్నది. స్పష్టా స్పష్టంగా వినవచ్చాయా మాటలు. తర్వాత మరేమీ వినరాలేదు. నిద్రలో నిండుగా కూరుకుపోయాను.
ఆ రోజు బాగా జ్ఞాపకం ఉంది. చీకటి చిక్కబడుతోంది. అమ్మ హరికేన్ లాంతరు చిమ్నీని ముగ్గుతో శుభ్రం చేస్తోంది ముగ్గురు వ్యక్తులు, మా ముంగిటకు వచ్చారు. రక్తసిక్తమయిన గావంచానూ, లాల్చీని, స్వెట్టర్ను అందజేసి చెప్పరాని మాట చెప్పినట్టున్నారు. 'గొల్లు' మందమ్మ. గుండెల్ని బాదుకుంది. నెత్తి మొత్తుకుంది. అక్కను వాటేసుకుని ఏకధారగా ఏడ్చింది. ఆ దృశ్యాన్ని చూసి భయపడి నేనూ ఏడ్చాను. అక్క నన్ను దగ్గరికి తీసుకుంది. ఓదార్చచూసింది.

వచ్చిన ముగ్గురూ వెళ్లిపోయారు. ఊరిలోని వాళ్ళు ఒక్కక్కరుగా రాసాగారు. అమ్మను అనునయించజూశారు. 'ఊహించిందే! బాధపడి ప్రయోజనం లేదు' అన్నారు.

ఏం జరిగిందేం జరిగిందంటే - మీ నాన్న చనిపోయాడన్నారు. తుపాకీ తూటాకి కూలిపోయాడన్నారు. స్వెట్టర్ మడత విప్పి చూసి 'జల్లెడలా ఉంది! ఎన్ని గుళ్ళు పోయాయో' అని దుఃఖించారు.
అక్క అల్లిన స్వెట్టర్ అది! ఎరుపు రంగుది! మరింత ఎర్రెర్రగా కానవచ్చింది.!
'నాన్న ఎప్పుడొచ్చారే' అడిగానక్కని.
"పొట్టిగా ఉన్నారు చూడూ, నిన్నాయన ముద్దు పెట్టుకున్నారు చూడు ఆయనే! ఆయనే మన నాన్న! మొన్నొచ్చారు" అన్నదక్క. అని నన్ను గట్టిగా పట్టుకుని మరింత గట్టిగా ఏడ్చింది.

అక్క పట్టు నుంచి తొలిగి, నాన్న స్వెట్టర్ని చేతుల్లోకి తీసుకున్నాను. ముఖాన్ని అందులో ఉంచి ఇట్నుంచటూ అట్నుంచిటూ రుద్దాను. గరకు గడ్డం బుగ్గలకు, నా బుగ్గలనదిమిన స్పర్శ కలిగింది. నాకిష్టమయిన వాసన వేసింది. నాన్న వాసన, నాన్న స్పర్శ నన్నంటి ఉన్నాయనిపించింది.

ఏడవాలనిపించలేదు. ఏడేడు లోకాల్లోనున్న నాన్నని వెతికి పట్టుకోవాలనిపించింది. ఆ మాటంటే - 'పారేసుకున్న వస్తువా ఏం! వెతికితే దొరకడానికి' అని అమ్మ అనవచ్చు. శోకించవచ్చు.
అయితే అమ్మకి ఈ నాటికీ తెలియదు. నాన్నంటే నిత్యావసర వస్తువని!

***0***



# వినదగునెవ్వరు చెప్పిన ..

రచన రచయితకు ప్రకృతి సహజం. ఉద్యమాలు, సిద్ధాంతాలు ఆ సహజత్వంలో భాగం కావొచ్చు. కాని అవి కట్టుబాటులై శాసిస్తే మాత్రం రచయిత ప్రచారకుడౌతాడు. తెలుగు సాహిత్యానికి ఉద్యమాలందించిన రచనలలో ఆణిముత్యాలు అనేకం. కాని ఉద్యమాల కట్టుబాట్లు ఎందరో రచయితల అపూర్వ కల్పనాశక్తికి ప్రతిబంధకాలవడం తెలుగు సాహితి దురదృష్టం..." ఇది అక్షర సత్యం.  ఈ నెల కథా మార్గదర్శి  రమణగారి గురించి వసుంధర గారి రచన ఆ తరం వారిని జ్ఞాపకాలలోకి  తీసుకుపోతుంది. వారికి నా నెనర్లు.

కథల రాశి గురించీ, వాసి గురించీ  మీరు వెలిబుచ్చిన ఆవేదన సహేతుకమే. గజపతులైనా, చదరంగం ఆడేటప్పుడు రెండు ఏనుగులతోనే ఆడాలన్నట్టు, ఏ పత్రికా సంపాదకులకైనా తమకు వచ్చిన కథలలో నుంచే ఎంపిక చెయ్యాలి. నువ్వులలో నూనె లేనపుడు తెలకలిని నిందించి ప్రయోజనం ఏమిటి?

ఈ నేపథ్యంలో, విశ్రాంత ఉద్యోగులైనా, మంచి కథకోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న మీకూ, మీ సంపాదక వర్గానికీ హృదయపూర్వక అభినందనలు.

ఎస్.ఎస్.మూర్తి, బెంగుళూరు

I am delighted to receive Kathamanjari promptly on 1st of every month promptly and without any mistakes with beautiful get up. The credit goes to the editorial board. A small request sir.If it is possible kindly introduce Dr Raghurama Rao Garu, eminent, service oriented dermatologist and also a Sahitya Abhimani, who always encourages upcoming artists.

Thanking  you sir

J Balakrishna, Visakhapatnam

- ఏప్రిల్ 2021 నెల సంచిక "ఉగాది ప్రత్యేక సంచిక" గా ఉగాది ఉదయాన్నే అనగా తేది. 13.04.2021 మీ నెట్-ఇంట చేరుతుంది.
- మే 2021 సంచిక ఎప్పటిలాగే, మే ఒకటో తేదికే విడుదలవుతుంది.

**రాబోయే కథా మంజరి సంచికల విడుదల తేదీలను పాఠకులు, రచయితలు, శ్రేయోభిలాషులు గమనించగలరు.**



